ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**

**LEGISLATIVE COUNCIL DEBATES**

# అధికార నివేదిక

# OFFICIAL REPORT


శుక్రవారం, మార్చి 24, 2017,

ఇరవై ఎనిమిదవ సమావేశం, సంపుటం–2, నంబరు–4,

దుర్ముఖినామ సం.ఫాల్గుణ బ.11

**FRIDAY, THE 24TH DAY OF MARCH, 2017,**

**TWENTY EIGHTH SESSION, VOLUME - 2, NO.4**

**3RD ,CHAITRA 1938 S.E.**


* * * * *


శాసన పరిషత్తు సచివాలయము,

వెలగపూడి,

అమరావతి – 522503.

**LEGISLATURE SECRETARIAT,**

**VELAGAPUDI,**

**AMARAVATHI - 522503.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ ఛైర్మన్** | : | శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | : | శ్రీమతి పమిడి శమంతకమణి<br>శ్రీ వాకాటి నారాయణ రెడ్డి<br>శ్రీ బొడ్డు నాగేశ్వర రావు<br>శ్రీ మెట్టు గోవిందరెడ్డి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## శుక్రవారం, మార్చి 24, 2017.

# అధికార నివేదిక

---

## విషయ సూచిక

---

**(1)**సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం

**(2)**ప్రశ్నోత్తరాలు

**(3)**ప్రత్యేక ప్రస్తావనలు

**(4)**సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు

1. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, 2015–16 సంవత్సరానికి, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ సంస్థ లిమిటెడ్, 1 వ వార్షిక నివేదిక ప్రతిని, 1956, కంపెనీల చట్టంలోని 619ఎ(3) సెక్షను క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ
2. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు, 2013–14, సంవత్సరానికి, ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ లిమిటెడ్, 38వ వార్షిక నివేదిక ప్రతిని, 1956, కంపెనీల చట్టంలోని 619ఎ(3) సెక్షను క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ

**(5)**సాంఘిక భద్రతా పథకాలపై లఘు చర్చ

**ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL**

**FRIDAY, THE 24TH MARCH, 2017**

(The House assembled at 10.00 a.m.)
(The Hon'ble Chairman in the Chair)

## 1. సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం

MR.CHAIRMAN: Today I have received one Adjournment Motion.

The Adjournment Motion given notice of by Sri Boddu Nageswara Rao, Sri Yandapalli Srinivasulu Reddy and Sri Vitapu Balasubramanyam to discuss about increasing the Honorarium to Village Revenue Assistants has been disallowed.

MR. CHAIRMAN: Now, Question Hour.

## 2.ప్రశ్నోత్తరాలు

### ఉచిత విద్యుచ్ఛక్తి పరిమితిని పెంచడం

ప్రశ్న నెం 9574 (11)
శ్రీమతి అంగూరి లక్ష్మీ శివ కుమారి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఉప ప్రణాళిక నిధుల ద్వారా ఇస్తున్న 50 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా పరిమితిని పెంచాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నదా ?

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి ?

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారి తరఫున కార్మిక మరియు ఉపాధి కల్పన, కర్మాగారాలు, యువజనులు మరియు క్రీడలు, నైపుణ్యాల అభివృద్ధి మరియు వ్యవస్థాపకత శాఖా మంత్రివర్యులు (శ్రీ కె. అచ్చన్నాయుడు):

అ) ఉప ప్రణాళిక నిధుల క్రింద ఇస్తున్న 50 యూనిట్ల విద్యుత్ సరఫరా పరిమితిని పెంచాలని ప్రతిపాదనలు అందాయి. ఆ అంశం పరిశీలనలో ఉంది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి అంగూరి లక్ష్మీ శివ కుమారి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, ఉచిత విద్యుత్‌ను 50 యూనిట్ల కన్నా ఎక్కువగా వాడుకుంటే ఎస్సీ, ఎస్టీలకు ఎక్కువ బిల్లు వస్తుందని, 50 యూనిట్ల కన్నా తక్కువగా వాడుకుంటే తక్కువ బిల్లు వస్తుందని అప్పటి ప్రభుత్వం చెప్పడం జరిగింది. అయితే, ఈ మూడు సంవత్సరాల నుండి కూడా ఎస్సీ, ఎస్టీలను కరెంటు బిల్లు కట్టమని అడగలేదు. వారు కూడా కట్టలేదు. కానీ, ప్రస్తుతం ఆ మూడు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న కరెంటు బిల్లులు మొత్తం ఇప్పుడు చెల్లించాలని, చెల్లించక పోతే విద్యుత్తు కనెక్షన్లను కట్ చేస్తామని డి.ఇ మరియు ఎస్.ఇ, లైన్‌మెన్లను పంపించి అక్కడ ఉన్న ప్రజల్ని ఇబ్బంది పెట్టడం జరుగుతుంది. ఈ నాలుగు సంవత్సరాల బిల్లులు ఒక్కొక్క కుటుంబానికి

సుమారుగా రూ.12,000 నుండి రూ.15,000ల వరకూ రావడం జరిగింది. కష్టపడి పనులు చేసుకునే వారికి, అంత బిల్లును ఒకే సారి కట్టడం అనేది అసాధ్యం. దయచేసి ఈ బిల్లులు చెల్లించే విషయంలో, వారికి ఏమైనా సహాయం చేయగలిగితే బావుంటుందని మీ ద్వారా కోరుతున్నాను.

అధ్యక్షా, రెండవది గౌరవ ముఖ్యమంత్రి గారు ఉచిత విద్యుత్‌ను 50 యూనిట్ల నుండి 75 యూనిట్లకు పెంచారనేది చెప్పడం జరిగింది. అయితే ఉచిత విద్యుత్‌ను 100 యూనిట్ల వరకూ పెంచమని మేము అడిగాము. కాబట్టి, ఇది సాధ్యమైతే దీనిని కూడా పరిశీలించవలసినదిగా గౌరవ మంత్రి గారిని తమ ద్వారా కోరుతున్నాను.

డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి (స్థానిక సంస్థలు – విశాఖపట్నం): అధ్యక్షా, ఉచిత విద్యుత్‌ను 50 యూనిట్ల వరకూ గృహావసరాలకు ఇస్తున్నారు. వ్యవసాయానికి కూడా ఉచిత విద్యుత్‌ను 7 గంటలపాటు ఇస్తున్నారు. పూర్వకాలంలో 9 గంటలు ఇచ్చేవారు. ఇప్పుడు కూడా 9 గంటలు ఇమ్మని రైతుల నుండి డిమాండ్ ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రం. అందువలన వ్యవసాయానికి కరెంటు ఇవ్వడం వలన రాష్ట్రానికి ఉత్పత్తి పెరిగి, లాభం చేకూరుతుంది తప్ప, నష్టం ఏమీ లేదు. కాబట్టి, వారికి 9 గంటలు ఉచితంగా విద్యుత్ ఇస్తే బావుంటుందని తమ ద్వారా ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, ఇక రెండవది విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి చూసినట్లయితే, అర్బన్ ఫీడర్ మీద కూడా ఇస్తున్నారు. విలేజే ఫీడర్ అంటే త్రీ ఫేజ్ కనెక్షన్‌ను విడదీసి అది 7 గంటలు మాత్రమే ఉండేటట్లు ఇస్తారు. కానీ, అర్బన్ ఏరియాలలో కూడా అక్కడక్కడ వ్యవసాయ భూములు ఉన్నాయి. అర్బన్ ఫీడర్ మీద ఇచ్చిన దానికి 24 గంటలు కరెంటు ఉంటుంది. కానీ, దీనిని వారు వాడుకోవడానికి వీలు లేదు. వారికి సంవత్సరానికి 6,000 యూనిట్లు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయమని ఏ.పి.ఆర్.ఇ.సి ఆదేశాలు ఇచ్చింది. కానీ, ఆ ఆదేశాలను అమలు చేయడం లేదు. కాబట్టి రైతులందరికీ మొదటి రోజు నుండి అన్ని యూనిట్లకు వారు చార్జ్ చేస్తున్నారు. ఇది చాలా అన్యాయం. అందుచేత రైతులు గోల పెడుతున్నారు. రైతులు కూరగాయలు మొదలైన పంటల్ని పండిస్తారు. అలాంటి వారికి మొత్తం కరెంటు బిల్లు కట్టాల్సి వస్తే, వారికి మిగిలేది ఏమీ ఉండదు. రైతులు 6,000 యూనిట్లు ఉచితంగా విద్యుత్తు ఇవ్వడం లేదంటున్నారు. అసలు ఈ 6,000 యూనిట్లు రైతులకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చేటువంటి ఆదేశాలు ఉన్నాయా? ఉంటే దానిని ఎందుకు అమలు చేయడం లేదు? రూపాయి నుండి వారి దగ్గర ఎందుకు వసూలు చేస్తున్నారు. రైతులు అంటే మీకు అంత చులకనగా ఉందా? ఎప్పటి నుండి దీనిని అమలు చేస్తారు? దీనిని అమలు చేసి, కాంపన్‌సేషన్ ఇవ్వవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ రాము సూర్యారావు (ఉపాధ్యాయ నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి): అధ్యక్షా, కేవలం 50 యూనిట్లకే ఉచిత విద్యుత్తు పరిమితమైతే ఆ పరిమితిని పెంచమని తమ ద్వారా గౌరవ మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు(స్థానిక సంస్థలు – గుంటూరు): అధ్యక్షా, ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది. మొదటిది గృహవినియోగదారులు, చిన్న, చిన్న పనులు చేసుకునే వారు ఉచితంగా ఇచ్చే ఈ 50 యూనిట్లు చాలదని చాలా ఆందోళన చేస్తున్నారు. ఈ 50 యూనిట్లను కనీసం 100 నుండి 150 యూనిట్లకు పెంచితే వారికి నిజమైన లబ్ధి చేకూరుతుంది. ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం పాజిటివ్‌గా తీసుకుని పరిశీలించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తమ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, ఇక రెండవ అంశం ఏమిటంటే – వ్యవసాయానికి సంబంధించి గతంలో Agriculture feeder and Domestic feeder అని రెండుగా విభజించి చేయాలనే ఒక పాలసీ ఉంది. కానీ, అది ఎక్కడా

అమలు కావడం లేదు. వ్యవసాయానికి 9 గంటలు ఉచిత విద్యుత్తును అందిస్తామని గతంలో ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా చెప్పారు. ఆ విధంగా వ్యవసాయ రంగానికి 9 గంటలు ఉచిత విద్యుత్తును ఇవ్వనట్లయితే వారికి ఉన్న ఇబ్బందులు తీరవు. ఈ రెండు అంశాలను పాజిటివ్‌గా పరిశీలించమని తమ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం): అధ్యక్షా, ప్రభుత్వ పాఠశాలల్లో, డిగ్రీ కళాశాలల్లో ఈ రోజు డిజిటల్స్ క్లాస్ రూమ్స్, ఇంటర్నెట్, కంప్యూటర్ల ద్వారా కరెంటును వినియోగిస్తున్నారు. మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మిగులు విద్యుత్తు స్థాయికి మన రాష్ట్రాన్ని తీసుకు వచ్చారు. కాబట్టి, పాఠశాలలోని పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. అందుచేత వారికి ఉచిత విద్యుత్తును అందించే ప్రతిపాదన ఏమైనా ఉందా, లేదా అనేది తెలియజేయాల్సిందిగా తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ కె. అచ్చన్నాయుడు: అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఎన్ని యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇస్తున్నారు? వాటిని పెంచే ఆలోచన ఏమైనా ఉందా అని ఈ ప్రశ్న వేశారు. ఈ ప్రశ్న మనకు వచ్చే సమయానికి ఉచితంగా 50 యూనిట్ల విద్యుత్తును ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందిస్తున్నాము. దీని వలన సుమారుగా రూ.71 కోట్లు ఖర్చవుతుంది. ఎంత మంది ఈ పరిధిలోకి వస్తారో, వారందరికీ ఇది వర్తిస్తుంది. ఈ మధ్య కాలంలో ఇంకా కొంచెం వాటిని పెంచితే బావుంటుందని అధికార పక్షం వారు, మిగతా వారు కూడా ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకొచ్చారు. 4 రోజులు ముందు గానే గవర్నరుగారి ప్రసంగానికి ధన్యవాదములు తెలిపేటటువంటి సమయంలో ముఖ్యమంత్రి గారు ఉచితంగా ఇచ్చేటువంటి విద్యుత్తు 50 యూనిట్లను 75 యూనిట్లకు పెంచినట్లుగా నిర్ణయం తీసుకుని అంగీకరించారు. జీవో కూడా ఇవ్వడం జరుగుతుంది.

(సభ్యుల హర్షధ్వానాలు)

అధ్యక్షా, ఈ నిర్ణయం వలన ఎక్కువ మంది లబ్ధి పొందే అవకాశం ఉంది. మనం చూసినట్లయితే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు 75 యూనిట్ల విద్యుత్తును వినియోగించుకునే వారు చాలా తక్కువ మంది ఉంటారు. ఎక్కడో ఒకరో, ఇద్దరో ఉంటారు. ఇంటిలో ఒక ఫ్యాను, ఒక టి.వి ఇంకా వారికి ఉన్నటువంటి అన్ని సౌకర్యాలను చూసుకున్నా సరే 50 యూనిట్ల నుండి 55 యూనిట్ల మధ్య లోనే వస్తుంది. కానీ, ఇప్పుడు 75 యూనిట్ల విద్యుత్తు ఇచ్చాము. కాబట్టి చాలా వరకు ఆ సమస్య పరిష్కారం అవుతుంది.

అధ్యక్షా, ఇక రెండవ అంశం మన గౌరవ సభ్యులు శ్రీ ఎం.వి.వి.ఎస్.మూర్తి గారు చెప్పినట్లుగా అర్బన్ ఏరియాలలో ఉన్నటువంటి వ్యవసాయానికి సంబంధించి 6,000 యూనిట్లు ఉచిత విద్యుత్తును ఇవ్వవలసిన అవసరం ఉంది. అయితే, ఇప్పటికే అర్బన్ ఏరియాలలో ఉన్నటువంటి వ్యవసాయానికి సంబంధించి అన్ని పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేసి 6,000 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందిస్తున్నాము. ఎక్కడైనా ఇలాంటి ప్రాంతాలలో విద్యుత్తు అందక పోతే అలాంటి వారిని మా దృష్టికి తేస్తే 6,000 యూనిట్ల విద్యుత్తును ఇవ్వడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

అధ్యక్షా, ఇక మూడవ అంశం గౌరవ సభ్యులు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టారని అన్నారు. వారు దినపత్రికలు చదువుతున్నారో, లేదో గాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్తును 7 గంటలు సరఫరా చేస్తామని పెట్టుకున్నామే తప్ప, 24 గంటలూ విద్యుత్తు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. మొన్ననే కరవు ఏర్పడినప్పుడు రాయలసీమ జిల్లాలలో గానీ, మిగతా ప్రాంతాలలో గానీ ఈ సంవత్సరం 24 గంటలు కూడా విద్యుత్‌ను అందించాము. కాబట్టి భవిష్యత్తులో అవసరాన్ని బట్టి లిమిటేషన్ లేకుండా ఎక్కడ అవసరమైతే అక్కడ విద్యుత్తును సరఫరా చేయడానికి ప్రభుత్వానికి ఎటువంటి

ఇబ్బందులు లేవని మీ ద్వారా గౌరవ సభ్యులందరికీ తెలియజేస్తున్నాను. ఈ మధ్య రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలలో కరవు వస్తే ఒక్క నిమిషం కూడా ఆపకుండా 24 గంటలూ వ్యవసాయానికి కరెంటు ఇచ్చాము. వ్యవసాయానికి ఎటువంటి ఇబ్బంది రాకుండా కరెంటు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు కూడా చేశాము.

అధ్యక్షా, అలానే సభ్యులు శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు గారు చెప్పినట్లు పాఠశాలలకు ఉచితంగా విద్యుత్తును అందించడం అనే దాని గురించి ఆలోచించి తగిన విధంగా నిర్ణయం తీసుకుంటామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఉ. 10.10

మీరు ఒకసారి తెలుసుకున్నా తెలుస్తుంది. గృహ వినియోగానికి, వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా నిరంతరం కరెంటు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు కూడా చేశాము. అలాగే, సభ్యులు శ్రీనివాసులు నాయుడు గారు కూడా స్కూల్సు గురించి చెప్పారు. అది కూడా ఆలోచన చేసి, సరైనటువంటి నిర్ణయం తీసుకోవడానికి చర్యలు తీసుకుంటామని మనవి చేస్తున్నాను.

## హంద్రీ – నీవా కాలువను వెడల్పు చేయడం

ప్రశ్న నెం.9585

శ్రీ పయ్యావుల కేశవ్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన జల వనరుల నిర్వహణ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) హంద్రీ – నీవా కాలువను వెడల్పు చేయడం ద్వారా సాగునీటి సామర్థ్యాన్ని రెండింతలు చేసే ప్రతిపాదన ఏదైనా ఉందా?
ఆ) అయితే, కేటాయించిన నిధుల పరిమాణమెంత?
ఇ) ఎప్పటిలోగా పనులను ప్రారంభించి, పూర్తి చేయడమవుతుంది?

గౌరవనీయులైన జల వనరుల నిర్వహణ శాఖ మంత్రిగావర్యులు (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు)

అ) అవునండీ.
ఆ) కాలువ వెడల్పు చేయడానికి వ్యయాన్ని సుమారు రూ.1,272.41 కోట.గా అంచనా వేయడమయింది.
ఇ) 2017, కాలువ క్లోజర్ పీరియడ్‌లో పనిని చేపట్టి, పూర్తి చేయాలని ప్రతిపాదించడమయింది.

శ్రీ పయ్యావుల కేశవ్ (స్థానిక సంస్థలు – అనంతపురం): అధ్యక్షా, ముందుగా ఈ ప్రభుత్వాన్ని అభినందించదలచుకున్నాను. కరువుతో రాష్ట్రం మొత్తం, సగం దేశం ఇబ్బందిపడుతున్న తరుణంలో అనంతపురం, కర్నూలు జిల్లాలను కరుణించిన ముఖ్యమంత్రి గారికి, నీటి పారుదల శాఖామంత్రి గారికి, ఈ ప్రభుత్వానికి అనంతపురం జిల్లా రైతుల తరఫున, ప్రజల తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఒకటి కాదు, రెండు కాదు, పది కాదు, ఇరవై కాదు, ఏకంగా 33 టి.ఎం.సి.ల నీటిని హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నేడు మా జిల్లాకు అందజేసిన ఈ ప్రభుత్వాన్ని ఏరకంగా అభినందించినా అది తక్కువే అవుతుంది. ఈ ప్రశ్న వేసేముందు రెండు విషయాలు తమరి అనుమతితో నేను చెప్పాలనుకుంటున్నాను. ప్రతిరోజూ కూడా ప్రతిపక్షాలు మీరు లస్కర్ పనిచేస్తున్నారు, మీరు లస్కర్ పనిచేస్తున్నారని ఒక్కటే విమర్శిస్తున్నాయి. Yes, ఈ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి గారు, మంత్రిగారు,

ప్రజాప్రతినిధులు, మేమంతా కూడా రైతుల కళ్లల్లో ఆనందం చూడడం కోసం లస్కర్ పని చేయడానికైనా సిద్ధంగా ఉన్నాము సార్.

(సభలో హర్షధ్వానాలు)

ప్రజల సొమ్మును దోపిడీ చేసే తస్కర్‌లం మాత్రం మేము కాదని ఈరోజు నేను చెబుతున్నాను. ఎట్లా మేము లస్కర్‌లమవుతాము సార్? ఈ హంద్రీనీవా ప్రాజెక్టు పనులు వాళ్ల ప్రభుత్వ హయాంలో మొత్తం కలిపితే 3.91 కోట్ల క్యూబిక్ మీటర్లు అంటే, 47 శాతం పనులు మాత్రమే వారి ప్రభుత్వ హయాంలో జరిగాయి. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన 50 శాతానికి పైగా పనులను పూర్తిచేసి ఒకటి కాదు, రెండు కాదు, ఆరు మోటార్లతో నీళ్లు ఇచ్చి అనంతపురం జిల్లా కరవు రైతుల కన్నీళ్లు తుడిచే ప్రయత్నం చేస్తున్నటువంటి ఈ ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి ఇంకా బురద జల్లే ప్రయత్నం చేయడం బాధాకరం. ఏదిఏమైనా, ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో పట్టిసీమ ప్రాజెక్టు పనులు అక్కడ ప్రారంభించడం వల్లనే ఈరోజు రాయలసీమ ప్రాంతానికి నీరివ్వగలుగుతున్నారనేది మనమంతా గుర్తించాలి. శ్రీశైలం నుంచి అయితే కరెక్టుగా 10 రోజులు కూడా ఈ మోటార్లు పనిచేసే అవకాశం ఉండేది కాదు. దిగువన ఉన్న పట్టిసీమ నుంచి నీరు ఇవ్వడం మూలాన 120 రోజులకు డిజైన్ చేసినటువంటి, ఈ పంపుల్ని 186 రోజులు నడిపించినటువంటి ఈ ముఖ్యమంత్రి గారిని, మంత్రిగారిని హృదయపూర్వకంగా ఈసభ ద్వారా నేను అభినందిస్తున్నాను.

అధ్యక్షా, పట్టిసీమ ప్రాజెక్టు ఫలితాలను నేరుగా అనంతపురం జిల్లా ప్రజలకు అందించి నేడు రైతుకు ఒక భరోసాను, నమ్మకాన్ని ముఖ్యమంత్రి గారు, మంత్రిగారు ఇచ్చారు. ఇప్పటికి 6 మోటార్లు ప్రారంభిస్తున్నారు. మరి 12 మోటార్లు నడిపేవిధంగా కాలువలను ఎప్పుడు వెడల్పు చేస్తారు? ఆ పనులకోసం టెండర్ల ప్రక్రియను ఎప్పుడు ప్రారంభిస్తారు? ఆ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎప్పటిలోగా ఆ పనులను పూర్తిచేస్తారు? ఆ ఫలితాలను అనంతపురం జిల్లా ప్రజానీకానికి ఎప్పుడు అందిస్తారన్నది ఒక ప్రశ్న.

అధ్యక్షా, మరొక విషయం, నా నియోజకవర్గంలోని ఉరవకొండ మండలంలోని షేక్‌షాన్‌పల్లి, లత్తవరం చెరువులు కాలువ ప్రక్కనే ఉన్నాయి. అదేవిధంగా, కూడేరు మండలంలో మరో రెండు చెరువులు ఉన్నాయి. ఆ నాలుగు చెరువులు వెడల్పు చేయడంతో పాటు నీరందించే అవకాశం ఉన్నదా అని నేను మంత్రిగారిని అడుగుతున్నాను. ఈ ప్రభుత్వం చేసే ఆలోచనలో ఉన్నది కాబట్టి, అందించాలని కూడా ఈ ప్రభుత్వాన్ని తమరిద్వారా నేను కోరుతున్నాను.

శ్రీమతి పి.శమంతకమణి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, నిన్నటి రోజునే మనం కరువు గురించి మాట్లాడుకున్నాము. నిరంతరం కరువుతో బాధపడుతున్న అనంతపురం జిల్లాకు ఈ హంద్రీనీవా నిజంగా ఒక గొప్ప వరం. దీనివల్ల మా జిల్లాలో ఈ రోజు చాలా గ్రామాలకు నీటి వసతి కలుగుతోంది. ముఖ్యంగా జల వనరుల శాఖామంత్రిగారైతే ఆ హంద్రీనీవా పనులు జరిగినంత సేపు అనంతపురం దత్తపుత్రుడిగా ప్రతినెలా నాలుగైదుసార్లు మా జిల్లాకు వచ్చేవారు. ఆయన దగ్గరుండి, సంబంధిత అధికారులను కూడా అక్కడే ఉంచడం వల్ల పనులు త్వరగా జరిగి ఈ రోజు అంత నీరు మా జిల్లాకు రావడం జరుగుతోంది. అయితే, కేవలం ఒక పంపుకు నీళ్లు తెచ్చి భగీరథ ప్రయత్నమని, ఈయన అపర భగీరథుడని చాలా గొప్పగా గతంలో ప్రభుత్వంలో ఉన్న వాళ్లు ప్రకటించుకున్నారు. కానీ, మా జలవనరుల శాఖామంత్రి గారు మాత్రం 6 పంపుల ద్వారా జీడిపల్లి నుండి బొల్లాపల్లి వరకు నీళ్లు తీసుకురావడం జరిగింది. అందువల్ల, ఈ రోజు మా అనంతపురం జిల్లావాసులందరూ ముఖ్యమంత్రి గారికి ఎంతో రుణపడి ఉన్నాము. అయితే, మీద్వారా మంత్రిగారిని కోరేది ఒక్కటే. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు కాన్సెప్ట్ ఏమంటే –

జిల్లాలో ఉన్న అన్ని చెరువులు నింపడం. మాకు తుంగభద్ర నీళ్లు ఉపయోగకరంగా లేవు. ఆ ప్రాజెక్టు నుండి నీటివసతి సరిగా లేనందువలన, ఈ సంవత్సరం హెచ్ఎల్సి కాలువ ప్రక్కన ఉన్నవాళ్లమందరం త్రాగునీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నాము. కాబట్టి, దయచేసి మీ ద్వారా మంత్రిగారిని కోరేదేమంటే – హంద్రీనీవా నీళ్లతో జిల్లాలో ఉండే అన్ని చెరువులను నింపితే బాగుంటుంది. అంటే రాయలకాలం నాటి చెరువులైన శింగనమల, కొత్తైరువు, ధర్మవరం, బుక్కపట్నం మొదలైన ఈ చెరువులు నింపితే అక్కడున్న ప్రాంతాల వారికి త్రాగునీరు అందడంతోపాటు, పంటపొలాలలో ఉన్న బోర్లకు నీటి శాతం పెరిగి సేద్యపు నీరు కూడా చాలావరకు అందుబాటులోకి రావడం జరుగుతుంది. తద్వారా కరవును పారద్రోలడానికి వీలౌతుంది. దయచేసి, మంత్రిగారు ఈ విషయం మీద శ్రద్ధ వహించాల్సిందిగా మీద్వారా కోరుతున్నాను.

శ్రీ గౌనివారి శ్రీనివాసులు (నామినేటెడ్): అధ్యక్షా, చిత్తూరు జిల్లాలో ఉండే ప్రజలు ఈ హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు–నగరి ప్రాజెక్టుల రాక వల్ల ఎంత సంతోషపడుతున్నారంటే అంత సంతోషపడుతున్నారు. ఎక్కడ శ్రీశైలం, ఎక్కడ కుప్పం! ఈ హంద్రీనీవా సుజల స్రవంతిని కుప్పం వరకు తీసుకురావాలని ఆ రోజున నందమూరి తారకరామారావు గారు ఈ హంద్రీనీవా సుజల స్రవంతి పైన సర్వే చేయిస్తే, ఈ రోజు ఆ కార్యక్రమాన్ని తప్పకుండా సఫలీకృతం చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, జలవనరుల శాఖామాత్యులు శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు గారు చిత్తశుద్ధితో పనిచేస్తూ చాలా చక్కగా ఈ కార్యక్రమాన్ని చేస్తున్నందుకు వారికి హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, మరొక్క విషయాన్ని మీ ద్వారా గౌరవ మంత్రివర్యులకు తెలియజేయదల్చుకున్నాను. మదనపల్లి నియోజకవర్గంలోని రామసముద్రం మండలం ఇందులో వదిలివేయబడింది. ఆ విషయాన్ని ఇదివరకే చెప్పడం జరిగింది. అలాగే, పూతలపట్టు నియోజకవర్గంలోని యాదమరి మండలం కూడా వదలివేయబడింది. దానితోబాటు చిత్తూరుకు త్రాగునీరు అందించేందుకు పలమనేరు నుండి చిత్తూరుకు కాలువ ద్వారా నీటిని తీసుకువస్తే చాలా బాగుంటుందని చిత్తూరు జిల్లా ప్రజల అభిప్రాయమని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ బి.నరేష్ కుమార్ రెడ్డి (స్థానిక సంస్థలు – చిత్తూరు): అధ్యక్షా, మదనపల్లి ప్రాంతానికి రామసముద్రం ఒక్కటే కాకుండా, మిగతా చెరువుల సామర్థ్యాన్ని పెంచుతామని అంటున్నారు. అలా సామర్థ్యాన్ని పెంచేటప్పుడు, మదనపల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సాగునీటి సామర్థ్యం పెంచగలిగితే అందరికీ నీళ్లిచ్చే అవకాశముంటుంది. ఆ విధంగా నీళ్లు సప్లై చేసేందుకు ఎక్కడా ప్రతిపాదనలు గానీ, ప్లానింగ్ గానీ లేదు. ప్రస్తుతం ఆ ప్లానింగ్ ఏమన్నా ఉందా? సప్లై ఛానెల్స్ ద్వారా అన్ని చెరువులకు నీళ్లిచ్చే అవకాశం ఉందా? అదేవిధంగా అక్కడ ప్రస్తుతం బహుదా ప్రాజెక్టు ఉంది. ఆ ప్రాజెక్టుకు కూడా ఈ నీళ్లు నింపగలిగితే బాగుంటుంది. ఇంకొక విషయమేమంటే, సాగునీటి సామర్థ్యాన్ని పెంచేటప్పుడు, హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులకు నీళ్లిచ్చేందుకు, బహుదా ప్రాజెక్టుతోబాటు, అన్ని చెరువుల్ని క్రైటీరియాగా తీసుకుని ప్లానింగ్ చేస్తున్నారో, లేదో చెప్పవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

ఉ.10.20

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు): అధ్యక్షా, హంద్రీనీవా– గాలేరు నగరి ప్రాజెక్టు 2007–2009 మధ్యలో జరిగినంత వేగంగా ఇప్పుడు రూపకల్పన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. సంతోషం. అయితే, ఇంత సమయంలో పూర్తి చేస్తామని అన్నారు కాబట్టి, పట్టిసీమకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని మించి హంద్రీనీవా–గాలేరు నగరిని సకాలంలో పూర్తి చేయాలి. చిత్తూరు జిల్లాలో పడమటి మండలాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి కొనసాగుతున్నది. గాలేరు నగరి అయితే

కరకంబాడి నుండి ఒక అడుగు కూడా ముందుకు వేయలేకపోతోంది. కొన్ని కొన్ని మండలాలు అటు హంద్రీనీవా గాలేరు నగరి రెండు కాలవలకూ కూడా అనుసంధానం లేని మండలాలుగా మిగిలిపోతున్నాయి. వాటిని కూడా డీలింక్ చేయవలసిందిగా కోరుతూ, ఈ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తిచేయగలుగుతారని నేను మంత్రిగారిని అడుగుతున్నాను. పూర్తిస్థాయి బడ్జెట్‌ను కూడా కేటాయించవలసిన అవసరం ఉందని నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గుండుమల తిప్పేస్వామి (శాసనసభా నియోజకవర్గం): మొట్టమొదటిసారిగా అనంతపురం జిల్లాకు హంద్రీనీవా పథకం ద్వారా దాదాపు 40 టిఎంసిల నీళ్లు ఇచ్చినటువంటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి, మంత్రివర్యులు శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు గారికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. హంద్రీనీవా ఫేజ్–2లో భాగంగా మడకశిర బ్రాంచ్ కెనాల్ ఉన్నది. అనంతపురం దక్షిణ తాలూకాలో ఉన్నటువంటి మడకశిర, హిందూపూర్ , పెనుగొండ ప్రాంతాలకు నీరందించే పథకం అది. అయితే, ఇంతవరకూ సరిగా పనులు జరగడం లేదు. ఎప్పటిలోగా మడకశిర బ్రాంచ్‌కెనాల్ పూర్తి చేసి నీరందిస్తారు? ఏ విధంగా ప్రతి "సోమవారాన్ని పోలవారం" గా భావిస్తూ పోలవరం పైన ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారో, అదే విధంగా వెనకబడిన ప్రాంతాలైన కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీరందించే హంద్రీనీవా పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి వారానికి ఒక దినాన్ని మంత్రిగారు ప్రత్యేకంగా భావించి, ఆ రోజు హంద్రీనీవా పథకాన్ని పూర్తిచేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి (స్థానిక సంస్థలు – కర్నూలు): ఇంతకుముందు మా మిత్రులు, అనంతపురం జిల్లావారు మాట్లాడడం జరిగింది. ఈ రోజు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 33 టిఎంసిలు అనంతపురానికి తీసుకురావడంపై మేమందరం సంతోషిస్తున్నాము. దానికి మాకు ఎలాంటి బాధ లేదు. అయితే, కర్నూలు జిల్లాలో శ్రీశైలం ప్రాజెక్టు ఉన్నది. అలాంటి మాకు కేవలం నాలుగు పంపులు మాత్రమే కేటాయించారు. దానివల్ల వెయ్యి క్యూసెక్కులు మాత్రమే కె.సి.కెనాల్‌కు మళ్లించడానికి వీలవుతున్నది. అక్కడేమో హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 12 పంపులు కేటాయించారు. మేము నీటిపారుదల శాఖామంత్రిని కోరేదేమంటే, మాకు రెండు పంపులు అదనంగా కేటాయించాలి. మా ప్రాంతంలో శ్రీశైలం జలాలు ఉన్నాయి. మా రైతాంగం కూడా బాధ పడుతున్నారు. మా రైతాంగం బాగుండాలంటే మాకు కూడా అదనంగా కేటాయింపులు జరగాలి. మాకు తుంగభద్ర నీళ్లు లేవు. ఏప్రియల్‌లో ఇంకా నీళ్లు కావలసిన అవసరం ఉంది. చాలా ఇబ్బంది పడుతున్నాము. కె.సి. కెనాల్ రైతాంగాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉంది కాబట్టి మరో రెండు పంపులు అదనంగా మాల్యాల ద్వారా గానీ, మచ్చుమర్రి ద్వారా గానీ తప్పకుండా కేటాయించాలని మంత్రిగారిని కోరుతున్నాము.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు : ఈ అంశంపై ఇప్పటివరకూ మాట్లాడిన గౌరవ సభ్యులు చాలా చక్కని సూచనలు, సలహాలు ఇచ్చారు. హంద్రీనీవా వైడెనింగ్ పనులు కూడా ఏప్రియల్ నెలలో టెండర్లు అన్నీ కూడా ఫైనల్ చేసి ఈ సీజన్‌లోనే పూర్తి చేయాలని ఒక పట్టుదలతో లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతున్నది. గౌరవ ముఖ్యమంత్రిగారు "సోమవారం పోలవారం" అని పోలవరం రెవ్యూతోపాటు మిగతా పెండింగ్ ప్రాజెక్టుల విషయమై virtual-inspections చేసి అన్ని జిల్లాల చీఫ్ ఇంజనీర్లు, ఎస్.ఈలతో ప్రతి వారు సెక్రటేరియట్ నుండి ప్రతి పనిని డిపార్ట్‌మెంట్ వైజ్‌గా, ప్రాజెక్టు వైజ్‌గా సమీక్ష చేస్తున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ వైడెనింగ్ పనులు చేసినట్లయితే 40, 50 శాతం తక్కువగా వర్షపాతం ఉన్న ఈ కష్టకాలంలో హంద్రీనీవాకు 37.3 టిఎంసిలు ఈ ప్రాంతానికి తీసుకువెళ్లడం వల్ల కర్నూలు, అనంతపురం వంటి కరవు పీడిత ప్రాంతాలకు త్రాగు నీరు, సాగు నీరు అందించి కాపాడుకోగలిగాము.

స్వర్గీయ నందమూరి తారకరామారావు గారు ఆనాడు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న శ్రీ కె.ఇ. కృష్ణమూర్తి గారు వేసిన విత్తనం ఈనాడు మూడు దశాబ్దాల తరువాత మళ్లీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి చేతుల మీదుగా హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్తి చేస్తున్నామని మనవిచేస్తున్నాను. కర్నూలు జిల్లా విషయంలో కూడా మాకందరకూ గర్వకారణం అధ్యక్షా. ఎక్కడా ఏ జిల్లాలకు ఇవ్వని నీళ్లు కర్నూలు జిల్లాకు ఇచ్చినందువల్ల పాడీలో హైయస్ట్ ప్రొడక్షన్ వచ్చింది. గౌరవ సభ్యులు చెప్పిన అంశాలను తప్పకుండా గమనంలోకి తీసుకుని ఏ విధమైన ఇబ్బందీ లేకుండా చూస్తాము. కేశవ్ గారు చెప్పినట్లు చెరువులను కలిపి లక్కవరం, సారిపల్లి వంటి ప్రాంతాల గురించి అడిగారు. శమంతకమణిగారు శింగనమల ప్రాంతం గురించి అడిగారు. అలాగే, మదనపల్లి, చిత్తూరు, తంబళ్లపల్లి,పలమనేరు, కుప్పం ప్రాంతాలకు ఈ సంవత్సరం మేనెలలో నీటిని తీసుకువెళ్లాలి. అక్కడ ఏవైతే రైల్వే ట్రాక్, బ్రిడ్జి పనులు ఉన్నాయో వాటిని ఈ రెండు నెలల్లో వేగవంతం చేస్తున్నాము అధ్యక్షా. జీడిపల్లిలో ఉన్న నీళ్లు ఈ సంవత్సరం గొల్లపల్లికి తీసుకువెళ్లాము. ముఖ్యమంత్రిగారి చేతుల మీదుగా పెనుగొండకు నీళ్లు ఇవ్వబోతున్నాము. తద్వారా 50 వేలమందికి నీరందుతుంది. హిందూపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడిగా నందమూరి తారక రామారావు గారు, ఇంజనీర్ శ్రీరామకృష్ణయ్య గారి కృషి ఫలితంగా మరియు ఆనాడు ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఆనాటి ఇరిగేషన్ శాఖామంత్రి శ్రీ కె.ఇ. కృష్ణమూర్తి గారు శంకుస్థాపన చేయడం జరిగింది. ప్రత్తికొండ దగ్గర ఆ రిజర్వాయరుకు కీర్తిశేషులు శ్రీ మాదన్న గారి పేరును పెడుతున్నాము. ఆయన 30 ఏళ్ల క్రితం చేసిన పనివల్ల ఈనాడు అక్కడ రైతు కళ్లల్లో ఆనందం చూశాము. ఉల్లి పంట వేసుకుని రూ.50,000 ఆదాయం వచ్చిందని ఆనాడు రైతు చెప్పినప్పుడు మా అందరికీ కళ్లవెంట నీళ్లు కనబడ్డాయి. రైతులు, పేదవారు ఈనాడు ఆ ఫలాలను అందుకొంటున్నారు. కాలవను వైడెన్ చేసి చిత్తూరు,అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఇవన్నీ చేయడం జరిగింది.

మచ్చుమర్రిని గాలికి వదిలేస్తే, ఈ రెండు సంవత్సరాల్లో ముఖ్యమంత్రిగారి చేతుల మీదుగా రెండు పంపులను పూర్తి చేయడం జరిగింది. హంద్రీనీవా లెవల్స్ పడిపోతే, క్రింద స్థాయిలో మచ్చుమర్రి నుండి లిఫ్ట్ చేసి హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్‌కి, కె.సి.కెనాల్‌కి కూడా నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఉన్నది. తుంగభద్రలో గతంలో లేని విధంగా ఈ సంవత్సరం నీళ్లు తగ్గాయి. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మనం తుంగభద్ర ఆయకట్టును కొంతమేరకు కాపాడుకోగలిగాము. మచ్చుమర్రి, హంద్రీనీవా కాలువ వైడెనింగ్‌తో రాయలసీమ రతనాలసీమ అవుతుంది అధ్యక్షా. రాయలసీమ హార్టికల్చర్ హబ్ అవుతుంది. పులివెందుల నుండి ఒక రైతు ముఖ్యమంత్రిగారికి ఫోన్ చేసి మంచి ఆదాయం వచ్చిందని చెప్పారు. ఈరోజున ఆరు లక్షల నుండి ఏడు లక్షల వరకు చీనీ చెట్ల మీద ఆదాయం వచ్చింది, మేము సంపాదించుకున్నాము, కృష్ణా జలాలు మా ప్రాంతాన్ని కాపాడాయని నాలుగు మండలాల రైతులు ముఖ్యమంత్రిగారిని కలిసి చెబుతుంటే ప్రభుత్వానికి ఇంకా పట్టుదల పెరిగింది అధ్యక్షా. ఎట్టి పరిస్థితుల్లో మహానుభావుడు శ్రీ ఎన్.టి. రామారావు గారు మొదలుపెట్టిన తెలుగు గంగ, హంద్రీనీవా ఈ సంవత్సరంలో పూర్తి చేస్తాము అధ్యక్షా. వచ్చేసంవత్సరం గాలేరునగరి ఫేజ్ 1 పులివెందులతోబాటు, నగరి చిత్తూరు వరకు తీసుకువెళ్లాలనే పట్టుదలతో ఆ పనులన్నీ కూడా వేగవంతం చేస్తాము. ఎప్పుడో 2004వ సంవత్సరంలో టెండర్లు పిలిస్తే, ఇప్పుడు అవన్నీ అంచనాలు పెరిగాయి.

పిండికొద్దీ రొట్టె అధ్యక్షా. రాష్ట్ర బడ్జెట్ రూ.16,500 కోట్లు లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ప్రాజెక్టులకు రూ.23,000 కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నాము. ఒక పక్క పోలవరం ప్రాజెక్టుకు డబ్బులు అడ్జస్ట్ చేసుకుంటూ, కేంద్రానికి వెళ్లి నిధులు తెచ్చుకుంటూ, ఉన్నవాటిల్లోనే ముఖ్యమంత్రిగారు సర్దుబాటు చేసి, ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పనులు ఆగకూడదని పట్టుదలతో చేస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న తెలంగాణా,

తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో ఎక్కడా కూడా జనవరి నెల బిల్లులు కూడా చెల్లించిన పరిస్థితి లేదు. ఇవాళ ఈ కష్టకాలంలో కూడా రైతు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో -27 శాతం వర్షపాతం అంటే చాలా తక్కువ వర్షపాతం ఉన్నది. రాయలసీమలో -40 వరకు తక్కువగా ఉన్నది. అయినప్పటికీ కోటి ఎకరాలకు పైగా నీళ్లిచ్చి ఈ సంవత్సరం రైతులను కాపాడుకోగలిగాము.

గౌరవ సభ్యులు ఏదైతే అడిగారో తప్పకుండా చేస్తాము. చెరువులు నింపే విషయంలో ఈ చెరువు, ఆ చెరువు అని కాకుండా కాలవ పరిధిలో ఆ దగ్గరలో ఉన్న చెరువులకు మొబైల్ లిఫ్ట్‌ల ద్వారా 5 కౌంటర్స్‌లో ఉన్న ఒక చెరువును నింపితే, గ్రావిటీ ద్వారా క్యాస్‌కేడ్‌లో గొలుసుకట్టు చెరువుల ద్వారా కింద ఉన్న చెరువులకు కూడా నీళ్లు అందుతాయి.

ఉ. 10.30

కాబట్టి ప్రతి పేదవాడు నా చెరువుకు నీరు రాలేదు, నా పొలానికి నీరు రాలేదని ఎక్కడికి వెళ్లే పనిలేకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకుని ఆ కాలువ పరిధిలో ఉన్న ఏవైతే చెరువులున్నాయో వాటికోసం గొలుసుకట్టు చెరువు, పెద్దచెరువులకు నీటిని ఇచ్చినట్లయితే గ్రావిటీతో చిన్న చెరువులకు నీరు వెళుతుంది. ఆ విధంగా డ్రిప్ మరియు స్ప్రింక్లర్ ఇరిగేషన్ కూడా హంద్రీనీవాలో పెద్దఎత్తున ఈ సంవత్సరం తీసుకుంటున్నాము. డెఫినెట్‌గా రాయలసీమ ముఖచిత్రం తెలుగుగంగ, హంద్రీనీవా వెడల్పుచేయడం, గాలేరు నగరి ఈ మూడు ప్రాజెక్టులను ఈ రెండు సంవత్సరాలలో పూర్తిచేస్తాము. ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రి గారు ఏదైతే చెబుతున్నారో దానికి అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం ముందుకు వెళుతోందని తమరిద్వారా నేను సభకు తెలియజేస్తున్నాను.

శ్రీ గుండుమల తిప్పేస్వామి: (మైకు లేకుండా) అధ్యక్షా, మడకశిరకు నీరందించే విషయం కూడా మంత్రి గారిని చెప్పమనండి సార్.

దేవినేని ఉమామహేశ్వరరావు: అధ్యక్షా, ముఖ్యమంత్రిగారి చేతులమీదుగా మడక శిరకు కూడా నీళ్లిచ్చే కార్యక్రమం ఈ సంవత్సరం జరుగుతుంది.

## తూర్పుగోదావరి జిల్లాలో యన్.ఆర్.డి.డబ్ల్యు.పి. కవరేజ్ స్కీమ్

ప్రశ్న నెం.9475 (14)

శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) తూర్పు గోదావరి జిల్లా కొత్త పేట నియోజకవర్గంలో 2013లో మంజూరు చేసిన రూ. 55.00 కోట్ల విలువ చేసే ఎన్ఆర్‌డిడబ్ల్యుపి కవరేజ్ పథకం పనులను ఇప్పటికీ పూర్తిచేయని విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, అందుకు గల కారణాలేమిటి?

ఇ) ఆ పనిని ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు (శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు)

అ) అవునండీ.

ఆ) బొబ్బరలంక వద్ద తగినంత స్థలంలేని కారణంగా ప్రధాన పనుల ప్రాంతాన్ని బొబ్బరలంకనుండి రావులపాలెంకు తరలించిన కారణంగా పనిలో జాప్యం ఏర్పడింది.

ఇ) పనిని తేది. 31-12-2017 నాటికి పూర్తి చేయడమవుతుంది.

శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం (స్థానిక సంస్థలు – తూర్పు గోదావరి): అధ్యక్షా, జి.ఓ.ఆర్.టి. నెం.1369 తేది. 24.07.2012 నాడు ఈ పథకం రూ.55 కోట్లతో మంజూరైంది. ఈ పథకం వల్ల ముఖ్యంగా కొత్తపేట నియోజకవర్గంలో కొత్తపేట మండలంలో పది గ్రామాలు, రావులపాలెం మండలంలో పన్నెండు గ్రామాలు మొత్తం 22 గ్రామాలకు శుద్ధిచేసినటువంటి మంచినీరును సరఫరా చేయడం జరుగుతుంది. దీనికోసం టెండర్లు పిలిచిన తర్వాత తేది. 23.01.2014 నాడు అగ్రిమెంటు కుదుర్చుకోవడం జరిగింది. ఈ పనులను 18 నెలల్లో పూర్తిచేయాలని ఉంది. అంటే, తేది. 27.07.2015 నాటికి పనులు పూర్తిచేసి ఈ 22 గ్రామాలకు వారు మంచినీటిని అందించాలి. ఇప్పటికే 20 నెలల సమయం దాటిపోయింది. ఇంతవరకూ మంత్రిగారు చెప్పినట్లుగా బొబ్బర్లంకలో భూమి వివాదం రావడం వల్ల ఆలస్యమైనా 300 కిలోలీటర్ల నీటికోసం 15 మీటర్ల ఎత్తుతో ఓవర్‌హెడ్ ట్యాంకు ఒకటి, రావులపాలెంలో 300 కిలోలీటర్ల నీటికోసం 30 మీటర్ల ఎత్తుతో మరొక ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. ఈ మంచి పథకం కొద్దిగా ఆలస్యమైనా మంత్రిగారు చెప్పినటువంటి నిర్ణీత సమయంలో నీటిని సరఫరా చేయాలన్నా, కొత్తపేట హెడ్‌క్వార్టర్‌లో ఉన్నటువంటి ఆ గ్రామాలకు పైపులైను లేదు. నేను స్థానికంగా ఉన్న అధికారులతో మాట్లాడితే ఎస్సీ ప్రాంతాలైన రామమోహన్ పేట మరియు చిక్కాలవారిపేట కోసం మరొక రెండు ట్యాంకులను నిర్మించవలసిన అవసరముందని చెబుతున్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన రూ. 55 కోట్లతో అదనంగా ఈ రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించడానికి నిధులు సరిపోవు. పైపులైను పనులు కూడా మిగిలిపోయాయి. సుమారు రూ. 5 కోట్లు అదనంగా కేటాయించి ఈ పనులను కూడా పూర్తిచేయాలని తమరిద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, గ్రామీణ నీటి సరఫరా పథకం అనేది మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేంద్రం నుంచి వచ్చేటటువంటి నిధులు నేరుగా పంచాయితీలకు వెళ్లేటటువంటి నేపథ్యంలో పంచాయితీలు మళ్లీ మండల స్థాయికి ఆ నిధులన్నింటినీ పంపించడం జరుగుతుంది. గ్రామీణ నీటి సరఫరా పథకంలో మోటర్లు బాగుచేయడానికి, పైపులైన్లు లీకేజిలను కట్టడి చేయడానికి పనిచేస్తున్నటువంటి వారికోసం కొంత బడ్జెట్‌ను పెట్టుకున్నారు. దాదాపు ఐదు నెలల నుంచి బోర్లు, మోటార్లు పనిచేసే వారికి జీతాలు లేవు. సంబంధిత అధికారులతో మాట్లాడితే మేము ఏమి చేయలేమని అంటున్నారు. మాకున్న సమాచారం మేరకు కర్నూలు జిల్లాలో కూడా వేసవికాలంలో త్రాగడానికి నీళ్లు లేవు. అనంతపురం జిల్లా నుంచి పదివేల మంది విజయవాడకు వచ్చి త్రాగునీరు లేక మా ప్రాణాలు పోతున్నాయని నేడు ఆందోళన చేపట్టారు. గ్రామీణ నీటి సరఫరాకు సంబంధించి త్రాగునీటిని సరఫరా చేసే విధానంలో అత్యంత నిర్లక్ష్యం జరుగుతోంది. దయచేసి గౌరవ మంత్రిగారు ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు: అధ్యక్షా, సభ్యులు శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం గారు అడిగిన ప్రశ్నకు సమాధానం, ఈ పథకం ద్వారా 114 గ్రామాలకు సుమారు 1,62,000 మందికి త్రాగునీటిని సరఫరా చేయడం జరుగుతుంది. దీనికోసం మొత్తం రూ.55 కోట్ల బడ్జెను కేటాయించడం జరిగింది. అయితే, సరైన స్థలం దొరకకపోవడం వల్ల ఆలస్యమైన మాట వాస్తవం. దీనిని రావులపాలెంకు మళ్లీ మార్చుకోవడం వల్ల కొంచెం ఆలస్యమైంది. అగ్రిమెంటు అయిన నాటినుంచి 18 మాసాలలో ఈ పథకం పనులను పూర్తిచేయాలని ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. సుమారు 21 నెలల వరకూ ఆలస్యమైంది. అక్కడున్న సమస్యలను పరిష్కారం చేసుకుని డిసెంబరు 31 నాటికి ఆ పనులను పూర్తిచేయాలని ఒక

నిర్ణయం తీసుకోవడం జరిగింది. అయితే, ఇప్పటికే చాలా పనులు పూర్తిచేశాము. ఓవర్‌హెడ్ ట్యాంకుల పనులు, నీటి సంపుల పనులు, ఫిల్టర్ల పనులు, గ్రావిటీ పనులు కూడా కొంతమేరకు పూర్తిచేయడం జరిగింది. ఈ పనులన్నింటినీ డిసెంబరు నెలాఖరుకు పూర్తిచేసి అక్కడున్న అన్ని గ్రామాలకు త్రాగునీటి సమస్య లేకుండా పరిష్కారం చేయడం కోసం తగిన నిర్ణయం తీసుకోవడం జరిగిందని మీద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను. అయితే, డిజైన్ చేసిన ప్రకారంగా మేము ఇచ్చిన రూ.55 కోట్లు సరిపోతాయి. ఇంకా అక్కడున్న రెండు, మూడు గ్రామాలను కూడా కవర్‌చేయడం కోసం అదనంగా రూ.5 కోట్లు అవసరమవుతాయని గౌరవసభ్యులు ఇంతకుముందు అడిగారు. నేను సంబంధిత ఇంజనీర్లతో మాట్లాడి రూ.5 కోట్లు అవసరమైనా, రూ.6 కోట్లు అవసరమైనా తప్పనిసరిగా ఈ కొత్త బడ్జెట్‌లో కేటాయింపు చేసి ఆ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని తమరిద్వారా గౌరవసభ్యులకు మనవిచేస్తున్నాను.

సభ్యులు శ్రీ పి.జె.చంద్రశేఖర రావు గారు మాట్లాడుతూ, బోర్ల మరమ్మత్తుల కోసం పనిచేసే సిబ్బందికి జీతాలివ్వడం రెండు, మూడు నెలలు ఆలస్యమైంది. ఆ సమస్యను కూడా చర్చించి పరిష్కారం చేస్తాము. ఈ రాష్ట్రంలో ఉన్న అన్ని బోర్ల మరమ్మత్తులు మరియు నిర్వహణ కోసం ఈ వేసవి కాలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఒక్కొక్క బోరుకు రూ.1000ల చొప్పున ప్రభుత్వం కేటాయించడం జరిగింది. ఆ సిబ్బంది జీతాల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తమరిద్వారా గౌరవసభ్యులకు మనవిచేస్తున్నాను.

## అనంతపురం జిల్లాలో త్రాగునీటి సమస్య

ప్రశ్న నెం. 9466 (15)
శ్రీ గుండుమల తిప్పేస్వామి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) అనంతపురము జిల్లాలో త్రాగునీటి కొరత ఉందనే విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, జిల్లాలోని ప్రజలకు త్రాగునీటిని కల్పించడానికి తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు (శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు):

అ) అవునండీ.

ఆ) మండలంలో త్రాగునీటి సమీక్షించడానికి, జనావాసాలలో త్రాగునీటి సమస్యను అధిగమించడానికి అవసరమయిన చర్యలను తీసుకోవడానికి ఎం.పి.డి.ఓ.(ఛైర్మన్), ఏఈఈ/ఏఈ(ఆర్‌డబ్ల్యుఎస్) (కన్వీనర్) , ఎంఆర్ఓ మరియు ఈఓఆర్‌డిలు సభ్యులుగా మండల కమిటీలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది.

త్రాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో త్రాగునీటి కొరతను తగ్గించడానికి, ట్యాంకర్ల ద్వారా త్రాగునీటి సరఫరా, ప్రైవేటు వనరులను అద్దెకు తీసుకోవడం, 827 దుర్భరమైన జనావాసాలను గుర్తిస్తూ బోరుబావులను శుభ్రపరచడం/లోతు చేయడం వంటి సత్వర చర్యలను చేపట్టడానికి రూ. 14.26 కోట్లతో వేసవి అత్యవసర కార్యాచరణ ప్రణాళికను తయారుచేయడమైనది.

- ఎస్‌డిఆర్ఎఫ్ క్రింద 13-02-2017 తేదిగల రెవెన్యూ (డిఎం.II) శాఖ, జి.ఓ.ఆర్‌టి.నెం.18 ద్వారా రూ.10.00 కోట్ల మొత్తాన్ని విడుదల చేయడమయింది.

08-02-2017 తేదినాటికి

- 675 ట్యాంకర్ ట్రిప్పులతో 129 జనావాసాలకు త్రాగునీటిని రవాణా చేయడమయింది.
- 77 జనావాసాలలో 87 ట్యాంకర్ ట్రిప్పులతో 22543 పశువులకు నీటిని సరఫరా చేయడమవుతున్నది.
- 10 జనావాసాలలో త్రాగునీటిని సరఫరా చేసేందుకు 10 ప్రైవేటు బోరుబావులను అద్దెకు తీసుకోవడమయింది.

ఉ. 10.40

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు: అధ్యక్షా, ఇటీవల అనంతపురం జిల్లా కలెక్టర్‌గారితో కూడా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ మూడు నెలలూ త్రాగునీటి సమస్య పరిష్కారంకోసం ఒక ప్రణాళిక తయారుచేసి అనంతపురం జిల్లాకు రూ.14.26 కోట్లు అవసరమని జిల్లా కలెక్టర్‌గారు ప్రభుత్వానికి ఒక లేఖ రాయడం జరిగింది. ఆ లేఖ ప్రకారంగా SDRF grant నుంచి రూ.10 కోట్లు విడుదలచేశాము. ఈమధ్యనే నిర్వహించిన సమావేశంలో చంద్రబాబునాయుడుగారు మార్చి నుండి మేనెల చివరివరకూ వేసవికాలంలో త్రాగునీటికి ప్రణాళికను రూపొందించమని ఆదేశించారు. తదనుగుణంగా ప్రణాళిక రూపొందించగా రూ.130 కోట్ల బడ్జెట్ అవసరమని తేలింది. ప్రణాళిక ప్రతిపాదనలను వారికి అందచేయగా వారు దానిని ఆమోదించడం జరిగింది. గత నెలలో రూ.35 కోట్లు విడుదల చేయగా, అందులో నుంచి రూ.10 కోట్లు అనంతపురం జిల్లాకు పంపించాము. అలాగే రెండురోజుల క్రితం మరొక రూ.35కోట్లు విడుదల చేయగా, అందులో నుంచి అనంతపురం జిల్లాకు మరొక రూ.5.00కోట్లు రిలీజ్ చేయడం జరిగింది. ఈ నిధులతో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, 675 గ్రామాలకు ట్యాంకర్లద్వారా నీటి సరఫరా చేస్తున్నాము.

అదేవిధంగా 77 గ్రామాల్లో 85 ట్యాంకర్లద్వారా పశువులకుకూడా త్రాగునీరు అందించడానికి ఏర్పాట్లు చేయడం జరిగింది. అంతేగాకుండా కొన్ని గ్రామాల్లో భూగర్భజలాలు అట్టడుకువెళ్ళిపోయి బోర్లు ఎంత తవ్వినా నీళ్ళు పడడంలేదు కాబట్టి పనిచేస్తున్న పది బోర్లను అద్దెకు తీసుకుని ట్యాంకర్లద్వారా నీటి సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంలో మీ అందరికీ మనవి చేస్తున్నాను. ఇవన్నీ కూడా తాత్కాలిక చర్యలు. అంతేగాకుండా అనంతపూర్ జిల్లాకు శాశ్వతంగా త్రాగునీటి సమస్య లేకుండా చేయాలని చంద్రబాబునాయుడుగారు ఒక మాస్టర్‌ప్లాన్ తయారుచేయడం జరిగింది. అయితే రాష్ట్రం మొత్తంమీద 13 జిల్లాలకు కూడా మాస్టర్‌ప్లాన్ తయారుచేయాలనే ఒక నిర్ణయాన్ని తీసుకోవడం జరిగింది. దాని ప్రకారంగా మేము సంబంధిత అధికారులతో సమావేశమై, బయటి నుంచి కన్సల్టెంట్‌ను తీసుకువచ్చి మాస్టర్‌ప్లాన్ తయారుచేయడం జరిగింది.

అంతేగాక ఈ రాష్ట్రానికి రూ.4500కోట్లు అవసరమని గుర్తించాము. అయితే ఈ రూ.4500 కోట్లు రాష్ట్ర బడ్జెట్‌లో ఇవ్వలేము కాబట్టి నిన్ననే ఢిల్లీకి వెళ్ళి కేంద్రమంత్రిగారిని కలిసి ఈ అమౌంట్‌ను EAPద్వారా మంజూరుచేయమని కోరాము. ఈ రూ.4500కోట్లు మంజూరు చేస్తామని కేంద్ర ప్రభుత్వంవారు మాట ఇవ్వడం జరిగింది. త్వరలోనే మంజూరుచేస్తారని ఆశిస్తున్నాము. ఒకవేళ రూ.4500కోట్లు కూడా వాళ్ళు మంజూరుచేస్తే అందులో నుంచి అధికభాగం అంటే దాదాపు రూ.1140కోట్లు ఒక్క అనంతపూర్ జిల్లాకే ఇవ్వాలని ముఖ్యమంత్రిగారు కూడా ఆలోచన చేస్తున్నారని గౌరవ సభ్యులకు ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అనంతపూర్‌లో ఎన్ని పథకాలున్నాయి? ఏ పథకాలు పూర్తిచెయ్యాలి. ఎన్ని పథకాలు పూర్తిచేస్తే ఎంతమంది ప్రజలకు నీళ్ళు ఇవ్వగలమనే విషయాలను కూడా ఆలోచన చేస్తున్నాము.

శ్రీమతి పి.శమంతకమణి: అధ్యక్షా, అనంతపూర్ జిల్లా త్రాగునీటి సమస్యను తీర్చడానికి రూ.430కోట్లు ఇస్తామన్నారు. అందుకు ధన్యవాదాలు. ముఖ్యంగా ఈ శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డిగారికి ఈ జిల్లాయొక్క నీటి పరిస్థితి తెలుసు. ఆయన చాలాసార్లు రావడం ఎస్.జి.ఓలతోకూడా సమావేశం కావడం జరిగింది.

మిస్టర్ ఛైర్మన్: సప్లిమెంటరీ వేయండమ్మా.

శ్రీమతి పి.శమంతకమణి: అక్కడ నీటివసతిలేని చోట్ల నాలుగైదు బోర్లు అద్దెకు తీసుకుని ట్యాంకర్లద్వారా నీళ్ళు అందించడానికి బదులు ఒక అయిదారు కిలోమీటర్ల దూరంలో ఏర్లు ఉన్నాయి. ఆ ఏటి గట్టున బోర్లువేసి అక్కడినుంచి పైపులైనుద్వారా తీసుకొస్తే నీటిసమస్యను శాశ్వతంగా నివారించవచ్చు. అటువంటి ఆలోచన ఏమైనా ప్రభుత్వానికి ఉందా అని నేను ప్రశ్నిస్తున్నాను.

శ్రీ గుండుమల తిప్పేస్వామి: అధ్యక్షా, 10బోర్లు అద్దెకు తీసుకోమని మంత్రిగారు చెప్పారు. 1500 అడుగులు వేసినా ఈరోజు నీళ్ళురావడంలేదు. అనంతపూర్‌లో బోరుబావులు అద్దెకు ఇచ్చేవాళ్ళు లేరు. కారణమేమంటే పది, పదిహేను సంవత్సరాల నుంచి తోటలు పెంచుకుంటున్నాను. నీటికోసం నేను బోరుబావి అద్దెకిస్తే నా తోటలు ఎండిపోతాయని అంటున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికి రూ.450 ఇస్తున్నారు. అది ఏ మూలకూ కూడా సరిపోదు. సి.ఆర్.ఎఫ్ కింద రూ.10 కోట్లు విడుదల చేశామని చెప్పారు. అయితే ఆ నిధులు నీటిరవాణాకు, బోర్‌బావులు లోతు చేయడం కొరకు విడుదలచేశారు. అలాకాకుండా కొత్త బోర్‌బావులు తవ్వడానికి నాన్ సి.ఆర్.ఎఫ్ కింద రూ.25 కోట్లు విడుదల చేయాలి. లేకపోతే ఈరోజు ప్రజా ప్రతినిధులుకానీ, అధికారులుకానీ జిల్లాలో ఎక్కడకు పోయినా ఖాళీ బిందెలు తీసుకొచ్చి అడ్డంపెట్టి నీళ్ళు ఇచ్చి ముందుకు పోండి లేకపోతే కదలనివ్వమనే దుర్భరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలో రూ.1,300 కోట్లు పెట్టినందుకు ధన్యవాదాలు. త్రాగునీటికి చాలా ఇబ్బంది ఉంది. ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డిగారు ఆ ప్రాంతమంతా పర్యటించి వచ్చారు. అక్కడి సమస్యలు మంత్రిగారికి, ముఖ్య కార్యదర్శిగారికి కూడా తెలుసుకాబట్టి వెంటనే నాన్ సి.ఆర్.ఎఫ్ కింద రూ.25 కోట్లు యుద్ధ ప్రాతిపదికన విడుదల చేసి ఎక్కడైతే నీళ్ళు, ట్రాన్స్‌పోర్టేషన్ దొరకదో అక్కడ వెంటనే బోర్లు వేయాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాము.

శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి (నామినేటెడ్): అధ్యక్షా, అనంతపూర్ జిల్లా తరువాత నెల్లూరుజిల్లాలో 70 శాతం వర్షపాతం తక్కువగా ఉంది. మంచినీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. ఓహెచ్ఆర్‌లో మంజూరు చేసినప్పుడు సర్వేపల్లిలో రెండు ఓవర్ హెడ్ ట్యాంక్స్ ఇమ్మని మంత్రిగారిని అడిగాను. ఇప్పటికీ మంజూరుచేయలేదు. మంత్రిగారు ఏమనుకుంటున్నారంటే మూడు, నాలుగు వందల కోట్ల రూపాయలతో కాంప్రహెన్సివ్ వాటర్ స్కీమ్స్‌కు ప్లాన్ చేస్తున్నారు. అవన్నీ దీర్ఘకాలికమైనవి. జిల్లాలో ఎక్కడ అత్యవసరమో అక్కడ కనీసం 30, 40 ఓవర్‌హెడ్ ట్యాంకులు మంజూరు చేయకపోతే ఇబ్బందికరమైన పరిస్థితి వస్తుంది. అలాగే ప్రత్యేకంగా నెల్లూరు జిల్లా మంచినీటి విషయంలో వర్షపాతం తక్కువగా ఉంది కాబట్టి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

MR CHAIRMAN: (Addressing the Minister) Question relates to Anantapur District. If you got information, you can disclose.

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు: అధ్యక్షా, గౌరవసభ్యులు తిప్పేస్వామిగారు, శమంతకమణి గారు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిగారు కొన్ని సమస్యల గురించి చెప్పడం జరిగింది. అయితే అనంతపూర్ జిల్లా విషయం మీ అందరికీ తెలియంది కాదు. అనంతపూర్ జిల్లాపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టడం జరిగింది.

ఎక్కడైనా సెలయేర్ల దగ్గర బోర్లువేసి పైపులైనుద్వారా సరఫరా చేయమని గౌరవ సభ్యులు శమంతకమణిగారు కోరారు. జిల్లాలో కొన్నిచోట్ల బోర్లుకూడా పనిచేయడం లేదు కాబట్టి చాలా సీరియస్‌గా సర్వే చేశాము. అయితే అనంతపూర్‌లో బోర్లు వేయాలంటే పదిహేను, పదహారు వందల అడుగులు వెళ్తేకానీ నీరు పడే పరిస్థితి లేదు. అవికూడా ఫెయిలవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో నేను వారిని అభ్యర్థించేదేమంటే ఎక్కడైనా బోర్లు పడతాయంటే సి.ఆర్.ఎఫ్ గ్రాంటు ద్వారా బోరు వేయడానికి అభ్యంతరంలేదు. అయితే నీళ్ళు పడనిచోట కూడా బోర్లు వేసి అనవసరంగా బడ్జెట్‌ను వధాచేసే బదులు దానికి ప్రత్యామ్నాయంగా ఆ జిల్లా శాసనసభ్యులుగా మీరున్నారు కాబట్టి సమస్యను ఏ విధంగా పరిష్కరించాలో ఆలోచన చేసి, జిల్లా కలెక్టర్‌గారి సమక్షంలో మీరు ఒక నిర్ణయం తీసుకుంటే దానిని అమలుచేయడానికి మాకు ఏ విధంగానూ అభ్యంతరం లేదు.

అధ్యక్షా, Non SDRF కింద ఇప్పటికే మేము జిల్లాకు రూ.2 కోట్లు ఇవ్వడం జరిగింది. అదికాకుండా SDRF grant కింద రూ.50 కోట్లు జిల్లా కలెక్టర్‌గారు కూడా మంజూరు చేయడం జరిగింది. మొత్తం కలిపి ఈ రూ.52 కోట్లతో మీరు ఆలోచన చేసి, మీ ప్రాంతానికనుగుణంగా జిల్లా కలెక్టర్‌గారి ద్వారా కార్యక్రమాలు చేసుకోవడానికి ఇప్పటికే నిధులు కూడా విడుదల చేశాము. దానిని మీరు ఉపయోగించుకోవలసిన అవసరముందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము. అలాగే 2017-18 సంవత్సరంలో రూ.10 కోట్ల వరకు పనులకోసమని అడ్వాన్స్ పేమెంట్ కూడా ఇవ్వడం జరిగిందని తమద్వారా మనవి చేస్తున్నాను.

అదేవిధంగా నెల్లూరు జిల్లాలోకూడా మంచినీటి సమస్య ఉంది. 13 జిల్లాలోని మంచి నీటి సమస్య పరిష్కారానికి రూ.4,500 కోట్లు నిధులివ్వాలని కూడా ఆలోచన చేస్తున్నాము. 13 జిల్లాలలోనూ ముఖ్యంగా రాయలసీమ జిల్లాలకు, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు అధికమైన నిధులివ్వాలనే ఆలోచన చేస్తున్నామని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఉ. 10.50

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు (స్థానిక సంస్థలు - చిత్తూరు): అధ్యక్షా, చిత్తూరు జిల్లాలో తంబాలపల్లి, మదనపల్లి, పీలేరు, పుంగనూరు, కుప్పం మొదలగు ప్రాంతాలలో నీటి ఎద్దడి చాలా ఎక్కువగా ఉంది. అదేవిధంగా మున్సిపాలిటీలలో కూడా నీటి కొరత ఎక్కువగా ఉంది. శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం, ప్రకాశం జిల్లాలోని కనిగిరి ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు త్రాగి కిడ్నీ వ్యాధులకు గురవుతున్నారు. అదేవిధంగా తంబాలపల్లి, పీలేరు, మదనపల్లి, పుంగనూరు, కుప్పం ప్రాంతాలలో కూడా ఫ్లోరైడ్ నీళ్లు త్రాగడం వలన కిడ్నీ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అక్కడ కూడా బోర్లు వేయాలి. మంత్రిగారు బోర్లు వేసినా నీళ్లు పడకపోవడం వల్ల డబ్బులు వృథా అవుతున్నాయి అంటున్నారు. కానీ మనకు నీళ్లు పడతాయో పడవో తెలియాల్సిన అవసరం ఉంది. నాలుగు బోర్లు వేస్తే మూడు ఫెయిల్ అయినా ఒకటి సక్సెస్ అవుతోంది. అందువల్ల మీరు బోర్లు వేసేందుకు వెనకాడొద్దు. త్రాగునీటి కోసం ఖర్చు పెట్టే నిధులు దుర్వినియోగం అవుతున్నాయని అనుకోవద్దు. మీరు కచ్చితంగా బోర్లు వేసేందుకు అనుమతులు ఇవ్వండి. కొన్ని చోట్ల బోర్లు సక్సెస్ అయ్యి నీళ్లు పడుతున్నాయి. జియాలజిస్టులు చెప్పిన చోటే వేస్తున్నారు. అది వాళ్ల తప్పు. నీళ్లు పడని దగ్గర చూపిస్తున్నారు. అందువల్ల బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వండి. చిత్తూరు జిల్లాలో 65 కరవు మండలాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో నీళ్లు బాగానే 350, 400 అడుగులలో పడుతున్నాయి. మీరు అక్కడ కూడా బోర్లు వేయకుండా చేస్తున్నారు. చిత్తూరు జిల్లాకు టాప్ ప్రైయారిటీ ఇచ్చి ఎక్కువ నిధులు ఇవ్వాల్సిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

MR. CHAIRMAN: Since the summer has come, you have a separate meeting with the Members to discuss the issue of drinking water.

SRI CH. AYYANNA PATRUDU: Definitely Sir. అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు చెప్పినట్లు చిత్తూరు జిల్లాలో నీటి సమస్య ఉంది. గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా రాయలసీమ జిల్లాలకు మంచినీటి విషయంలో ఎక్కువ నిధులు కేటాయించాలనే ఉద్దేశంతో శాశ్వత పరిష్కారం కోసం చిత్తూరు జిల్లాకు దాదాపు రూ.600 కోట్లు కేటాయించాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. తాత్కాలికంగా వేసవి కాలంలో ఈ మూడు నెలలకు త్రాగునీరు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ముద్దుకృష్ణమ నాయుడు గారు బోర్లు గురించి చెప్పారు, మేము బోర్లు వేయడానికి వెనుకాడడం లేదు, అయితే 1600, 1700 అడుగులు వేస్తే కూడా ఫెయిల్ అయిన సందర్భాలు ఉన్నాయి. అందుచేత స్థానిక పరిస్థితులు మీకు బాగా తెలుస్తాయి కాబట్టి స్థానికంగా మీ నాయకులు అందరూ కూడా కలెక్టర్ గారితో సమావేశం ఏర్పాటు చేసుకుని, ఎక్కడ బోర్ వేయాలి, ఎక్కడ వేయకూడదు, ఎక్కడ ట్రాన్స్‌పోర్ట్ చేయాలి, ఎక్కడ బోర్లు అద్దెకు తీసుకోవాలి, ఎక్కడి నుండి వాటర్ సప్లై చేయాలనే విషయాన్ని చర్చించి ఒక రిపోర్ట్ ఇచ్చి గైడెన్స్ ఇచ్చినట్లయితే ఆ గైడెన్స్ ప్రకారంగా....

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు: అధికారులు బోర్లు వేయడానికి వచ్చినప్పుడు ప్రజలు చెప్పిన చోట వేయడం లేదు. మా జియాలజిస్టులు చెప్పిన చోటే వేస్తామని అంటున్నారు. అలా కాకుండా ప్రజలు చెప్పిన ప్రాంతంలో బోర్లు వేయమని చెప్పండి.

శ్రీ సిహెచ్. అయ్యన్నపాత్రుడు: ముద్దుకృష్ణమ నాయుడు గారూ, మీరు కూడా సీనియర్ గౌరవ సభ్యులు, ఎవరు చెప్పింది మేము వేయడం లేదు. జిల్లా కలెక్టర్ గారి సమక్షంలో ఇంజనీర్లు కలిసి కూర్చొని ఎక్కడ నిర్ణయిస్తారో అక్కడ మేము పరిశీలన చేస్తున్నాము. మీరందరూ కూడా స్థానికంగా ఉన్న ప్రజలతో, ఇంజనీర్లతో కూర్చొని చర్చించుకుని ఒక నిర్ణయం తీసుకుంటే ఎంత ఖర్చయినా నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని మీద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

## సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులు

ప్రశ్న నెం.9602

సర్వ శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఉమ్మా రెడ్డి వెంకటేశ్వర్లు, మేకా శేషు బాబు ఎం.ఎల్.సి.లు.,

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) 2014-15, 2015-16, 2016-17 లో సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించి, విడుదల చేసిన నిధుల మొత్తమెంత?

ఆ) అందులో ఖర్చు చేసిన నిధుల మొత్తం ఎంత?

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు (శ్రీ రావెల కిషోర్ బాబు):

అ)& ఆ) 2014-15, 2015-16, 2016-17 సంవత్సరాలలో సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించిన నిధుల కేటాయింపు విడుదల వ్యయానికి సంబంధించిన సమాచారాన్ని ఈ క్రింద ఇవ్వడమయింది.

I. 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.3,287.38 కోట్లను కేటాయించడమయింది. రూ.2,531.09 కోట్లను విడుదల చేయడమయింది. రూ.2,244.07 కోట్లను ఖర్చు చేయడమయింది.

II. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.2,696.58 కోట్ల మొత్తాన్ని కేటాయించడమయింది. రూ.2,339.20 కోట్లను విడుదల చేయడమయింది. రూ.2,129.13 కోట్లను ఖర్చు చేయడమయింది.

III. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.3,236.05 కోట్లను కేటాయించడమయింది. రూ.2,688.69 కోట్లను విడుదల చేయడమయింది. ఇప్పటి వరకు రూ.1,971.96 కోట్లను ఖర్చు చేయడమయింది

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్(శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, 2014-15వ ఆర్థిక సంవత్సరం నుండి ఇప్పటివరకూ దాదాపుగా రూ.9,220 కోట్లు కేటాయించారు. ఖర్చు చేసింది రూ.6,345కోట్లు. ఖర్చు కానిది రూ.2,980 కోట్లు. అంటే which is around 30% of the total allocated amount. అదేవిధంగా సబ్‌ప్లాన్ నిధుల విషయం కూడా ఇదే పంథాలో ఉంది. ఈ పరిస్థితి కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని కాని, ఈ ఒక్క ప్రభుత్వమే ఇలా చేస్తోందని కానీ నేను చెప్పడం లేదు. గత 25 సంవత్సరాలుగా భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీనికి ఏ ఒక్కరినీ ఎక్కువ చేశారని గానీ, తక్కువ చేశారని గానీ చెప్పడం లేదు. I am also accused person in this episode. నేను కూడా మంత్రిగా ఉన్నాను. ఇదే విధానం కొనసాగుతోంది కాబట్టి డిబిఆర్ (దళిత బహుజన రిసోర్స్ సెంటర్) అనే సంస్థ ఉంది సార్, వారు కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆందోళన కూడా చేశారు. స్పెండ్ ఇండియా అనే సంస్థ కూడా ఈ యదార్థాలను బయట పెట్టింది సార్.

మిస్టర్ ఛైర్మన్: సప్లిమెంటరీ వేయండి సార్.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్: అధ్యక్షా, నేను మంత్రి గారిని డైరెక్ట్ ప్రశ్న అడుగుతున్నాను, మనం సబ్‌ప్లాన్ నిధులను non lapsable and non divertible చేస్తామని, 2013వ సంవత్సరంలో ఈ హౌస్‌లో చట్టం చేసుకున్నాము. ఆ చట్టాలను యధాతథంగా అమలు చేసి, 2017-18వ ఆర్థిక సంవత్సరం నుండి అయినా సబ్‌ప్లాన్ నిధులను non lapsable and non divertible చేస్తారా? లేదా? ఈ వివరాలలోకి, ఈ ఫిగర్స్ జోలికి నేను పోవడం లేదు. అలాగే డైవర్ట్ అయిన నిధులను వెనక్కి తీసుకుని రాలేము. ల్యాప్స్ అయిన వాటికి జీవం పోయలేము. దానిజోలికి కూడా నేను పోవడం లేదు. చట్టంలో ఉన్నవి యధాతథంగా అమలు చేస్తూ, సబ్‌ప్లాన్ ఫండ్స్‌ను non lapsable and non divertible చేస్తారా, లేదా? దానికి డైరెక్ట్ సమాధానం చెప్పాల్సిందిగా నేను మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ గారు చెప్పినట్లు ఇటు చూస్తే బడ్జెట్‌లో కేటాయింపులు, దాని తరువాత విడుదల, ఖర్చు చూస్తే ప్రతీ సంవత్సరం ఒక ఆనవాయితీ లాగ బలహీనవర్గాల సంక్షేమానికి కేటాయించిన నిధులు ఎక్కువగా ల్యాప్స్ అవుతున్నాయి. దాదాపు 1/3వ వంతు ఫండ్స్ ల్యాప్స్ అవుతున్నాయి. ఈ ఒక్క నాలుగు మూడు సంవత్సరాలే కాదు, ఈ ఒక్క ప్రభుత్వమే కాదు. గతంలో నుండే ఫండ్స్ ల్యాప్స్ అవడం అనేది ఒక ఆనవాయితీగా వస్తోంది. ల్యాప్స్ అయిపోవడానికి బలమైన కారణాలు ఏమిటని ప్రభుత్వం గుర్తించిందా? ఎందుకింత consistant గా బలహీన వర్గాల కేటాయింపులే ల్యాప్స్ అవుతున్నాయి. మొత్తం బడ్జెట్‌లో మిగతా రంగాలను పరిశీలిస్తే నిధులు అంత ఎక్కువగా ల్యాప్స్ అవ్వడం లేదు. వ్యవసాయం తరువాత బలహీన వర్గాల సంక్షేమం అనేది ప్రధానమైనది. మిగతా వాటిలో కాస్తో కూస్తో ల్యాప్స్ అవుతాయి కాని, 1/3వ వంతు ఫండ్స్ ల్యాప్స్ అయిన దాఖలాలు లేవు. బలహీన వర్గాల కేటాయింపులో ఎందుకు నిధులు ఎక్కువగా ల్యాప్స్ అవుతున్నాయి. రూ.9,000 కోట్లలో రూ.6,000 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు, రూ.3,000 కోట్లు ల్యాప్స్ అయిపోయాయి. దీనికి గల బలమైన కారణాలు ఏమిటో గుర్తించారా? ఆ కారణాలేమిటో తెలిస్తే మాకు కూడా చెబితే సమాచారంకు తెలుస్తుంది. భవిష్యత్తులో వాటిని ప్రభుత్వాలు రెక్టిఫై చేసుకుని నిధులు మొత్తం ఖర్చు పెట్టడానికి ఉపయోగపడుతుంది. ఆ కారణాలేమిటో చెప్పాల్సిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ రాము సూర్యారావు: అధ్యక్షా, ఏలూరులో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తారని గత 15 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాము. నిధులు కూడా శాంక్షన్ చేశారు. ఈ రోజు, రేపు అంటున్నారు. వాళ్లు చదువుకోవడానికి బిల్డింగ్ లేక ఆ స్టడీ సర్కిల్ వేరే స్కూల్‌లో పెట్టి చదువుకుంటున్నారు. దయచేసి ఆ స్టడీ సర్కిల్ ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాల్సిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

ఉ. 11.00

శ్రీ రావెల కిషోర్ బాబు: అధ్యక్షా, సభ్యులు శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ గారిని అభినందించాలి. ఎందుకంటే, వారు కేబినెట్ మంత్రిగా ఉన్నప్పుడు ఫండ్స్ యొక్క ల్యాప్సబిలిటీ, డైవర్టబిలిటీ అనే ప్రక్రియలో నా వంతు పాత్ర కూడా ఉందని వారు అన్నారు. వారి టైమ్‌లో కూడా ఫండ్స్ ల్యాప్సబిలిటీ, డైవర్టబిలిటీ జరిగింది. వారి టైమ్‌లో విచిత్రమైన విషయాలు చాలా జరిగాయి.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు: ఇప్పుడు మీ టైమ్‌లో జరుగుతున్నది చెప్పండి.

శ్రీ రావెల కిషోర్ బాబు: వారు చెప్పారు కదా... అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఫండ్స్‌ని ఓఆర్ఆర్‌కి కూడా డైవర్ట్ చేశారు. హుస్సేన్ సాగర్ ప్రక్షాళనకి కూడా ఖర్చు చేశారు. మా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాను నిధులను చిత్తశుద్ధితో అమలు చేస్తామని పెట్టడం జరిగింది. దానికి మేము కట్టుబడి ఉన్నాము. దానిని తూ.చ తప్పకుండా అమలు చేస్తున్నది మాప్రభుత్వం. మేము గత సంవత్సరం కంటే ముందు సంవత్సరంలో 96% నిధులు, గత సంవత్సరం 99.69% ఖర్చుపెట్టాము. ట్రైబల్ సబ్‌ప్లాన్‌లో గత సంవత్సరం 101% ఖర్చుపెట్టాము. మేము ఈ సంవత్సరం, నిన్నటి వరకు 80% అచీవ్ అయ్యాము. అంటే సమాధానం ముందే ఇవ్వడం వల్ల అందులో ఇచ్చిన ఫిగర్ తక్కువ ఉంది, మేము ప్రతిరోజూ దానిని వెబ్ పోర్టల్‌లో చూస్తున్నాము. ఇప్పుడు అది 80 శాతానికి చేరింది. మిగతా 20% కూడా ఈ నెలాఖరుకు అచీవ్ చేస్తాము. గతంలో నిధులు ల్యాప్స్ అవ్వడం, డైవర్ట్ అవ్వడం వాస్తవమే. కానీ, మా ప్రభుత్వం వచ్చాక డైవర్ట్ కానీ, ల్యాప్స కానీ కాకుండా చూస్తున్నాము.

MR.CHAIRMAN: Sir, measures to be taken to control, diversion and lapse of funds. That is the point.

శ్రీ రావెల కిషోర్ బాబు: అధ్యక్షా, ఈ ఫండ్స్‌కి సంబంధించి మొదటి పాయింటేంటంటే, ఏ డిపార్టుమెంట్లు అయితే ఇచ్చిన నిధులను ఖర్చు చేయడం లేదో, ఆ డిపార్టుమెంట్ల నుంచి ఆ నిధులను రీ-అప్రాప్రియేట్ చేసి, వాటిని ఇతర ఖర్చు పెట్టే డిపార్టుమెంట్లకి కేటాయించాము. ఇది మేజర్ స్టెప్. అంటే ఫండ్స్ ల్యాప్స్ కాకుండా, first time we have taken this step. అంతకు ముందెప్పుడూ ఈ రకమైన చర్య తీసుకోలేదు. ఉదాహరణకు పంచాయితీ రాజ్ డిపార్టుమెంటు వారు వారి దగ్గర ఖర్చు పెట్టకుండా ఉన్న నిధులలో సుమారుగా రూ.1,400 కోట్లు రహదారుల నిర్మాణానికి మంజూరు చేశారు. ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు, ఇరిగేషన్ డిపార్టుమెంటు, ఇండస్ట్రీస్ డిపార్టుమెంటు ఇలా ఒక ఆరు డిపార్టుమెంట్లు ఏవైతే ఇచ్చిన నిధులు ఖర్చు పెట్టలేదో వాటన్నింటినీ కూడా పూలప్ చేసి రీ అలోకేట్ చేసి వారికి సుమారు రూ.350కోట్లు ఇచ్చాము. అదేవిధంగా ఎం.ఎ అండ్ యు.డి డిపార్టుమెంటుకి కూడా రీ-అప్రాప్రియేట్ చేసి, రీ-అలోకేట్ చేశాము. ఇండస్ట్రీస్ డిపార్టుమెంటులో లిడ్‌క్యాప్‌కి రూ.28 కోట్లు రీ-అప్రాప్రియేట్‌చేసి, రీ అలొకేట్ చేశాము. ఈవిధంగా మేము ఏ 33 డిపార్టుమెంట్లకి ఎస్సీ సబ్‌ప్లాను నిధులను అలొకేట్ చేస్తున్నామో, వాటిలో ఏ డిపార్టుమెంట్లయితే ఆ నిధుల్ని ఖర్చు పెట్టడం లేదో వాటిని రీ అప్రాప్రియేట్‌చేసి, రీ అలొకేట్ చేయడం మొదటిసారిగా చేస్తున్నాము. ఈ సంవత్సరం మొత్తం వంద శాతం ఎక్స్‌పెండిచర్‌ని అచీవ్ చేయడం అదొక మేజర్ స్టెప్.

మరొకటేమంటే, వచ్చే సంవత్సరం నుంచి ప్రతి పదిహేను రోజులకొకసారి నోడల్ ఏజెన్సీ సమావేశాలను ఏర్పాటుచేసి, ఎక్స్‌పెండిచర్‌ని క్లోజ్‌గా మానిటర్ చేస్తూ లాస్ట్ క్వార్టర్‌లో రీ-అప్రాప్రియేట్ చేయడం కాకుండా, ఫస్ట్ క్వార్టర్‌లోనే ప్లాన్ చేసుకుంటున్నాము. ఉదాహరణకు ఈ సంవత్సరం హౌసింగ్ డిపార్టుమెంటుకి రూ.600 కోట్లు సబ్‌ప్లాన్ నిధుల కింద ఇస్తే, అది వాళ్లు ఖర్చుపెట్టలేదు. దానిని రీ అప్రాప్రియేట్ చేయమని అడిగితే, దానికి వాళ్ల కేంద్రప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంటు రావాలి, అది ఈ నెలాఖరు వరకు వస్తుంది, వచ్చిన తరువాత ఆ రూ.600 కోట్లను మేము ఖర్చుపెడతాము, కాబట్టి దానిని రీ అప్రాప్రియేట్ చేయడానికి వీలు లేదని వాళ్లు చెప్పారు. అంటే మేము ఎంత క్లోజ్‌గా మానిటర్ చేస్తున్నామనేది దీనిని బట్టి మీకు తెలుస్తుంది. మేము ఎక్కడా కూడా ఒక్క రూపాయి కూడా ల్యాప్స్ అవ్వకుండా, డైవర్ట్ అవ్వకుండా, క్లోజ్‌గా మానిటర్ చేస్తూ, ఆ డిపార్టుమెంట్లను కేటగరైజ్ చేశాము. అంటే ఎక్స్‌పెండిచర్ వైజ్‌గా డిపార్టుమెంట్లను ఏ, బి, సి, డి లుగా కేటగరైజ్ చేసి, దానిలో 100% అచీవ్ అయితే ఏ-కేటగిరీ అని, 75% కంటే ఎక్కువ అచీవ్ చేస్తే బి-కేటగిరి, 50% కంటే ఎక్కువ చేస్తే సి-కేటగిరి, 50% కంటే తక్కువ చేస్తే డి-కేటగిరి కింద చేశాము. ఆవిధంగా డిపార్టుమెంట్లన్నీ మొత్తం ఫండ్స్‌ని ఖర్చుపెట్టే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాము.

అధ్యక్షా, ఇక్కడ సభ్యులు సుభాష్ చంద్రబోస్ గారు, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గానీ చెప్పినట్లు గతంలో ఫీజు రీ -యింబర్స్‌మెంటు గానీ, విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లు గానీ విద్యాసంవత్సరం ముగింపులో ఇచ్చేవారు. అలా ఇవ్వడం వల్ల ఆ వసతి గృహాల వార్డెన్లు సంవత్సరం మొత్తం డబ్బులు వడ్డీలకు తేవడం కానీ, లేదా వారి సొంత డబ్బులు ఖర్చు పెట్టికానీ వాటిని నడుపుతున్నారు. ఈ విధంగా చేయడం వల్ల సంవత్సరాంతానికి వారికి వచ్చిన డబ్బులు, వడ్డీలు కట్టడానికే సరిపోతుండేవి. వార్డెన్లు వడ్డీలకు అప్పులు తేవడమో, విద్యార్థులు ఇబ్బందులకు గురవడమో జరుగుతుందని, ఇది చాలా తప్పు పద్ధతని, చట్టసమ్మతం కూడా కాదని ముఖ్యమంత్రి గారు అంటే, ఈ సంవత్సరం నుంచి ఆ హెడ్ ఆఫ్ ఎకౌంట్‌ని మార్చి ఏ నెలకానెల ఫండ్స్ రిలీజ్ చేసే విధానాన్ని తీసుకువచ్చాము. అంతేగాకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయానికి వస్తే, గతంలో 1/3వ వంతు నిధులు తదుపరి సంవత్సరానికి స్పిల్లోవర్ అయ్యి, అది ఒక సంప్రదాయంగా కొనసాగుతూ వస్తే, మా ప్రభుత్వం వచ్చిన తరువాత ఎట్టి పరిస్థితుల్లో కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కి కేటాయించిన నిధుల్ని ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఇచ్చేయాలని, there is no question of spill over అని ముఖ్యమంత్రిగారు చెబితే, ఆ విధానానికి కట్టుబడి చేస్తున్నాము. అయితే, నేను ఇచ్చిన ఈ ఎక్స్‌పెండిచర్‌లో 30% ఖర్చు పెట్టలేదంటున్నారు. అది వాస్తవం కాదు. మూడు సంవత్సరాలుగా యావరేజ్ చేస్తే 30% వస్తుంది. మీరు ఏ సంవత్సరానికాసంవత్సరం యావరేజ్ చేసుకుంటే 30% రాదు. ఎందుకంటే, ఈ సంవత్సరం ఇంకా మేము ఈ రూ.3,236 కోట్లలో, రూ.2,688 కోట్లు ఎక్స్‌పెండిచర్ క్రింద విడుదల అయితే వాటిలో ఇంకా ఖర్చు పెట్టాల్సి ఉంది.

గౌరవ సభ్యులు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారికి నేను మనవి చేసేదేమంటే, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ అంటే బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ రూ.350 కోట్లు ఈ సంవత్సరం మంజూరు చేస్తే, ఒక్కొక్క భవన నిర్మాణానికి సుమారు ఒకటిన్నర సంవత్సరం నుండి రెండు సంవత్సరాల కాల వ్యవధి పడుతుంది. ఒక్కొక్కసారి ల్యాండ్ లిటిగేషన్ ఉంటే రెండున్నర సంవత్సరాలు కూడా పడుతుంది, ఇంకా ఆలస్యం కూడా అవ్వచ్చు. టెండర్లు పిలిచినప్పుడు కూడా ఒక్కోసారి టెక్నికల్ ప్రాబ్లమ్ రావడం, రీ టెండర్లు పిలవడం వల్ల కూడా ఆలస్యం జరుగుతోంది. అంటే సుమారు రూ.600 కోట్లు భవన నిర్మాణానికి కేటాయిస్తే, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌లోని కొన్ని కారణాల వల్ల అంటే facts are beyond our control, వాటి వల్ల ఖర్చు పెట్టకుండా ఉంటే అవి ల్యాప్స్ కావు, కంటిన్యూ అవుతాయి, దీనివల్ల కూడా ఖర్చుపెట్టడంలో కొంత

తగ్గుతుంది. అయితే మేము దీనికి సంబంధించి ఇప్పుడు అన్ని చర్యలు తీసుకుంటున్నాము. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌లో ఏ సంవత్సరానికాసంవత్సరం ఖర్చు పెట్టాలి, దాని దగ్గరే కొంత ఇబ్బంది వస్తుంది. భవనాలకు కేటాయించిన నిధులలో సకాలంలో వాటిని నిర్మించనందువల్ల, ఇంకా అనేక ఇతర కారణాల వల్ల తప్ప, మిగతావన్నీ కూడా ఖర్చు పెట్టడం జరుగుతోంది. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఉపకారవేతనాలు ఇవ్వాల్సిందే. దానిలో ల్యాప్సబులిటీ అని కానీ, డైవర్సిఫికేషన్ అనే ప్రశ్నే రాదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంది అది ఏ సంత్సరానికాసంవత్సరం ఇవ్వాల్సిందే. దానిలో ల్యాప్సబులిటీ రాదు, డైవర్ట్ చేసేది ఉండదు.

డైట్ ఛార్జెస్ విషయానికి వస్తే, అవి విద్యార్థులకు ఎంటిఎఫ్ ద్వారా గానీ, ఆర్‌టిఎఫ్ ద్వారా గానీ ఖచ్చితంగా ఇవ్వాల్సిందే. దీనిలో ఖర్చు పెట్టలేదనే అంశాలు ఉండవు. ఒకే ఒక్క అంశమేమంటే, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌లో ఉన్న నిధుల్ని ఖర్చు పెట్టడానికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అవి మా కంట్రోల్‌లో లేకపోయినా, వాటిని కూడా కంట్రోల్‌లోకి తీసుకువచ్చి వాటన్నింటినీ సరిచేసి నూటికి నూరు శాతం ఖర్చు పెట్టడానికి తగిన చర్యలను తీసుకుంటామని తమరి ద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు: అధ్యక్షా, మంత్రిగారు చెప్పిన దానిలో 30% కాదంటున్నారు, పోనీ 29.99% వేసుకోండి, మాకేమీ అభ్యంతరం లేదు. మాకు 30% టెక్నికల్‌గా చూపించడం కాదు, మొదటి సంవత్సరం అంటే 2014-15వ సంవత్సరంలో ఎక్స్‌పెండిచర్ కింద రూ.3,287 కోట్లు కేటాయిస్తే, దానిలో రూ.1,043 కోట్లు ల్యాప్స్ అయింది, 2015-16వ సంవత్సరంలో రూ.567 కోట్లు ల్యాప్స్ అయ్యింది, 2016-17వ సంవత్సరంలో ఇప్పటి వరకూ చూస్తే రూ.1,264 కోట్లు ఖర్చు పెట్టాలి. వాటిలో బిల్లులు సుమారు వందకోట్లో, రెండువందల కోట్లో వస్తాయి. ఈ సంవత్సరం కూడా వెయ్యి కోట్ల రూపాయలు ఉంది, ఇది ల్యాప్స్ అయినట్లు కనబడుతుంది. మంత్రిగారు క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌లో ల్యాప్స్ అవుతుందని చెబుతున్నారు. మాకు ఆ పర్టిక్యులర్స్ ఇవ్వండి. మీకు ఏ క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌లో ల్యాప్స్ అయ్యింది?

ఉ.11.10

అధ్యక్షా, ఎందుకు క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌లో మిగిలిన వాటికన్నా ఎందుకు తగ్గిస్తున్నారు? ఈ సాంఘిక సంక్షేమం, బలహీన వర్గాల సంక్షేమం అనేది చాలా ప్రధానమైనటువంటి అంశం. మీరు బడ్జెట్ కేటాయింపులు చేసేటప్పుడు చాలా ఎక్కువగా నిధులు చూపించి, ఆఖరుకి వచ్చేసరికి బాగా తగ్గిపోతోంది అంటే ఇక చరిత్ర అంతా గతంలో మా ప్రభుత్వం ఉన్నట్లే మీ ప్రభుత్వం కూడా ఉంటుంది. మీ ప్రభుత్వం బాగా చేయాలనే కదా మేము కూడా కోరుకుంటోంది. దానికి కాదు. అసలు కారణాలు ఏమిటి? ఎందుకంటే, గత ప్రభుత్వంలో ఏం జరిగిందో, ఈ ప్రభుత్వంలో కూడా అదే జరుగుతోంది. అసలు దీనికి గల కారణాలు ఏమిటి? దీనిని ఎలా రెక్టిఫై చేయాలి అనే దానికి సంబంధించి మీరు అన్వేషణ చేయాలి. అలా చేయకుండా మాకు ఆ ప్రభుత్వం, ఈ ప్రభుత్వం అనే దాని గురించి ఎవరూ అడగరు. అసలు ఏ ప్రభుత్వంలో ఎంత అనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నం కానే కాదు. బలహీన వర్గాలకు కలిసి వస్తుందా, లేదా? అసలు వీటికి కేటాయింపులు జరుగుతున్నాయా, లేదా అనేదే ఇక్కడ సమస్య, ప్రశ్న తప్ప, రెండవది కాదు.

శ్రీ రాము సూర్యారావు : సార్, గౌరవ మంత్రిగారిని స్టడీ సర్కిల్స్‌కు సంబంధించి చెప్పమనండి.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ : అధ్యక్షా, తమ ద్వారా డైరెక్టుగా మంత్రిగారిని ఒక ప్రశ్న అడుగుతున్నాను. I am expecting positive assurance from the Government. ఈ సబ్‌ప్లాన్ నిధులు Non lapsable and non-divertable అనేది కనీసం ఈ2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి అయినా చట్టాలకు అనుగుణంగా అయినా చేస్తారా? నేను ఏమీ మిగిలిన వాటి గురించి అడగడం లేదు.

వీటి గురించి చేస్తారా? చేస్తామంటే చెప్పండి, లేకపోతే లేదని చెప్పండి. నేను నేరుగానే ప్రశ్నించాను. నేను ఏమీ అంకెలలోకి వెళ్ళడం లేదు. దానికి ఒక్కదానికి గౌరవ మంత్రిగారిని చెప్పమనండి సార్.

MR. CHAIRMAN : No lapses, no diversions.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, తప్పకుండా చెపుతాను. మా ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి ఆదేశాల ప్రకారం దళిత, గిరిజన సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉంది. ఎట్టి పరిస్థితులలో కూడా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను డైవర్ట్ చేసే ప్రశ్న ఉత్పన్నం కాదు, చేయము. ఈ హామీని మీ ద్వారా గౌరవ సభ్యులకు, ప్రజలకు ఇస్తున్నాను. ల్యాప్సబులిటీకి సంబంధించినంతవరకు క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ విషయంలో తప్ప, ఎట్టి పరిస్థితులలో మిగతా అంశాలలో నిధులు ల్యాప్స్ కాకుండా చూసే బాధ్యత తీసుకుంటాము.

గౌరవ సభ్యులు అడిగినట్లుగా ఏలూరు స్టడీ సర్కిల్‌కి గ్రాంట్లను మంజూరు చేశాము. ఆ జీ.వో. కూడా ఇష్యూ చేశాము. త్వరలోనే ఆ పనులు కూడా మొదలు పెడతాము.

మిస్టర్ ఛైర్మన్ : ఇప్పటికి సమయం 11.12 నిమిషాలు అయింది. ఇంకా 4 ప్రశ్నలు ఉన్నాయి. We will close the question hour.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ (పట్టభద్రుల నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం): మా ప్రశ్నలు ఉన్నాయి సార్.

మిస్టర్ ఛైర్మన్ : ఇంకా వేరే సబ్జెక్టులు కూడా ఉన్నాయి. షార్ట్ డిస్కషన్ కూడా ఉంది. I will go with single supplementary.

## ప్రభుత్వ వసతి గృహాల్లో పౌష్టికాహారం

ప్రశ్న నెం.9389 (17)

శ్రీమతి పి. శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం & సాధికారత మరియు గిరిజన సంక్షేమం & సాధికారత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ప్రభుత్వ హాస్టళ్ళకు సరఫరా చేసిన ఆహారంలో పౌష్టికాహార లోపం పెరిగిందనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకునిరావడమయిందా?

ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం & సాధికారత మరియు గిరిజన సంక్షేమం & సాధికారత శాఖ మంత్రివర్యులు (శ్రీ రావెల కిషోర్ బాబు)

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి పమిడి శమంతకమణి: అధ్యక్షా, గౌరవ మంత్రిగారు 'నో, ఈ ప్రశ్న ఉత్పన్నం కాదంటే' ఎలా? నా దగ్గర హాస్టల్ మెనూ సోమవారం నుంచి ఆదివారం వరకు ఉంది. మనం బజార్లలో చూసే కూరగాయలన్నీ కూడా ఉన్నాయి. ప్రతి రోజూ కర్రీలో ప్రొద్దున ఏం కూరగాయలు ఉన్నాయో, క్యారట్, డ్రమ్‌స్టిక్, కుకుంబర్ మొదలైనవన్నీ ఉన్నాయి. ఇకపోతే, ఉదయం పూట కిచిడీ. సోమవారం – ఉప్మా, మంగళ,బుధవారాలు వెజిటబుల్ రైస్. పులిహోర, జీరా రైస్.

మిస్టర్ ఛైర్మన్ : మీరు జవాబు చెపుతున్నారా? సప్లిమెంటరీ వేస్తున్నారా?

శ్రీమతి పమిడి శమంతకమణి : లేదు అధ్యక్షా, నేను చదువుతున్నాను. ఇన్ని కూరగాయలను ఇందులో పొందుపరచి వాటి మధ్యలో మళ్ళీ పెరుగు, గ్రుడ్డును జత చేశారు. రోజూ ఒక గ్రుడ్డు, పెరుగు, ఇన్ని కూరగాయలతో కర్రీ, అన్నము ఇస్తున్నామా అంటే ఎక్కడ? ఒక్క బుధవారం తప్ప మరి లేనే లేదు. Boost is the secret of my energy అన్నారు. ప్రతి రోజు సాయంత్రం బూస్టు లేదా టీ. అసలు టీ నే లేదు ఇక బూస్టు ఎక్కడ నుంచి తీసుకువస్తాము అధ్యక్షా? ఈ రకంగా అన్ని కూరగాయలను పొందుపరచి చేసిన వాళ్ళు ఎక్కడా కూడా లేదు. మెనూలో అయితే ఆదివారం నాడు మన ఇంట్లో కూడా చేసుకోము. ఎగ్గు బిర్యానీ, వెజిటబుల్ బిర్యానీ, జీరా రైసు, బగారా రైసు. దీనికి మసాలా ఎగ్గ్ కర్రీ, ఆలూ కర్రీ. ఇవన్నీ ఎక్కడ ఇస్తున్నారు? నా దగ్గర ఉన్న లిస్టులో ఇవన్నీ పెట్టి ఇక మంత్రిగారు చెప్పిన జవాబులో లేదంటే ఎలా? వారిని ఆ హాస్టళ్ళకు రమ్మనండి. ఒక రోజు ఒక్క అరటిపండు, బుధవారం ఒక గ్రుడ్డు తప్ప రోజూ గ్రుడ్డు ఇస్తున్నారా అధ్యక్షా? అసలు ఇవన్నీ ఎక్కడ ఇస్తున్నారు? ఈనాటి బాలలే రేపటి పౌరులు. ఈరోజే ఆ పిల్లలకు ఎముకకు కండ కావలసి ఉంటే, చర్మం అంటుకుపోయి ఉంది అధ్యక్షా. అక్కడి పిల్లల పరిస్థితి చాలా దయనీయంగా ఉంటే, అసలు వార్డెన్లు ఎక్కడ ఉన్నారో చెప్పమనండి. సంబంధిత వార్డెన్లపై ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారో చెప్పమనండి. జిల్లా హెడ్‌క్వార్టర్లలో వార్డెన్లు ఉంటున్నారు. వారు అసలు పట్టించుకోవడం లేదు. ఏమన్నా అంటే, వాచ్‌మెన్‌లు చూస్తున్నారు. వీటికి సంబంధించి మంత్రిగారు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారో చెప్పమనండి.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, గౌరవ సభ్యురాలు శ్రీమతి పమిడి శమంతకమణి గారు బాబు బయట బాగానే చేస్తున్నావని అన్నారు. ఇక్కడకు వచ్చి డెఫిషియన్సీ గురించి విమర్శలు చేస్తున్నారు, బాగానే ఉంది. సభ్యులు అడిగిన ప్రశ్న ఏమిటంటే – అసలు ఈ డెఫిషియన్సీ తగ్గుతుందా అని అడిగారు. డెఫిషియన్సీ తగ్గడం లేదని చెప్పాను. అధ్యక్షా, నేను గతంలో హాస్టల్స్‌లో చదువుకున్నాను. నేను 1973వ సంవత్సరంలో చదువుకుంటున్నప్పుడు హస్టల్సు మరీ ఘోరంగా ఉండేవి. మట్టిగోడలు, తాటాకుల కప్పులు, అర్థాకలితో ఉండేవాళ్ళం. మా నాన్నగారు రోజుకు రెండు ఇడ్లీలను ఇవ్వమని చెప్పి, దగ్గర్లో ఉన్నటువంటి ఇడ్లీ కొట్టు వాడికి నెలకు రూ.10లు కట్టేవారు. అప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పులు ఉన్నాయి. అప్పట్లో ప్రైవేటు హాస్టల్స్ కూడా ఉండేవి. అప్పటి గవర్నర్‌గారు ప్రైవేటుహాస్టల్స్‌ను రద్దు చేశారు. ఆ తరువాత క్రొత్త ప్రభుత్వం వాటిని టేకోవర్ చేసిన తరువాత చాలా వరకూ ఇంప్రూవ్ చేశారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం వాటిని మరింత మెరుగ్గా చేసింది. తమరికి విన్నవించుకునేది ఏమిటంటే – సంవత్సరానికి ఒకసారి స్కాలర్‌షిప్పులను మంజూరు చేయడం ద్వారా విద్యార్థులకు చాలా నష్టం జరిగింది. హాస్టల్స్‌లో ఎవరైతే వార్డెన్లు ఇంఛార్జిగా ఉండేవారో, వాళ్ళు అప్పు తెచ్చి, కూరగాయలను కొని, పిల్లలకు పెట్టడం జరిగేది. ఆ స్కాలర్‌షిప్పులు సంవత్సరం చివరలో వచ్చేసరికి గతంలో చేసిన అప్పులు, వాటి వడ్డీలు తీర్చడం ద్వారా చాలా నష్టం జరిగింది. కాబట్టి, ఆ సిస్టమ్‌ని ఇప్పుడు తీసేశాము. నేనయితే ఎప్పుడు హాస్టల్ నుంచి బయటకు వెళ్ళినా కానీ, హాస్టల్ పిల్లలతోనే భోజనం చేస్తాను. యావరేజ్‌గా నెలకు 10 సార్లు హాస్టల్ పిల్లలతో భోజనం చేస్తాను.

మూడవ తరగతి నుంచి 7వ తరగతి వరకు నెలకు రూ.750ల చొప్పున ఇస్తున్నాము. 8–10వ తరగతి పిల్లలకు రూ.850లు ఇస్తున్నాము. పి.జి. విద్యార్థులకు నెలకు రూ.1,200 ఇస్తున్నాము. డిగ్రీ, ఇంటర్మీడియట్, నర్సింగ్ విద్యార్థులకు రూ.1,050లు ఇస్తున్నాము. ఈ మధ్య National Institute of Nutrition, Hyderabad నుంచి ఒక నివేదికను తెప్పించాను. ఆ నివేదిక నా దగ్గరే ఉంది. ఆ నివేదిక ప్రకారం పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే, న్యూట్రిషన్ వాల్యూ ఎంత పెంచాలని చెప్పి, వారు చాలా సమగ్రమైన నివేదిక ఇచ్చారు. దీనిని ఆధారం చేసుకుని విద్యార్థులకు అందించే పౌష్టికాహారం పెంచడానికి,

వారికి ఆరోగ్యకరమైన ఆహారం ఇవ్వడానికి ప్రతిరోజు ఇచ్చే ఆహారంలో ఏ విధమైన మార్పులు తీసుకురావాలి, ఆ పరిమాణంలో ఎన్ని గ్రాములు ఇవ్వాలి, ఎంతెంత ఆహారం ఇవ్వాలనే దానిపైన సమగ్రమైన నివేదిక కూడా ఉంది. దానిని నేను అన్ని హాస్టళ్ళకు సబ్మిట్ చేస్తాను. ఈ నివేదిక ప్రకారం ఆర్థిక శాఖా మంత్రితోను, ముఖ్యమంత్రిగారితోను ఒక సమావేశంలో చర్చించిన తరువాత సూత్రప్రాయంగా ఈ డైట్ ఛార్జెస్ పెంచడానికి ముఖ్యమంత్రిగారు అంగీకరించారు. ఆర్థిక శాఖామంత్రిగారు కూడా అంగీకరించారు. ఇప్పుడు ప్రపోజ్ చేసినటువంటి డైట్ ఛార్జెస్‌కు దాదాపు రూ.750 నుంచి రూ.1,000లకు పెంచడానికి ప్రపోజల్స్ ఇచ్చాము. అలాగే, రూ.850 నుంచి, రూ.1250లకు పెంచడానికి మరియు రూ.1200 నుంచి రూ.1400ల వరకూ పెంచడానికి కూడా ప్రపోజల్స్‌ను ఇచ్చాము. అన్ని వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఈ విధంగా పెంచితే, బడ్జెట్ ఎంత అవుతుందనేది లెక్కవేస్తే, సంవత్సరానికి దాదాపుగా రూ.99 కోట్లు వచ్చింది. దీనిని కూడా సూత్రప్రాయంగా అంగీకరించడం జరిగింది. ఇవి కూడా జీవోల రూపంలో వస్తాయి. తప్పకుండా విద్యార్థుల ఆరోగ్యానికి, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి, వారిని కన్నబిడ్డల కంటే ఎక్కువగా చూసుకోవడానికి మా ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుంది. అందులో భాగంగానే హాస్టల్స్ అన్నింటిని కూడా రెసిడెన్షియల్ స్కూల్స్‌గా కన్వర్ట్ చేస్తున్నాము. మొత్తం ఎస్టీ డిపార్టుమెంటులో ఉన్నటువంటి హాస్టల్సును 100 శాతం రెసిడెన్షియల్ స్కూల్సుగా కన్వర్ట్ చేసేశాము. ఈ సంవత్సరం మార్చి31 కల్లా అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు కూడా ఫైబర్ నెట్‌ఆప్టిక్ ద్వారా ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇస్తున్నాము. రాబోయే విద్యాసంవత్సరం నుంచి డిజిటల్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభిస్తున్నాము. అంతేగాకుండా, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటులో కూడా ఇప్పటికి దగ్గర దగ్గర 45 శాతం హాస్టల్సును రెసిడెన్షియల్ పాఠశాలలుగా కన్వర్ట్ చేశాము. ఈ రెసిడెన్షియల్ స్కూల్స్‌గా ఎందుకు కన్వర్ట్ చేశామంటే, మంచి ఆహారం, మంచి సౌకర్యాలు కల్పించడానికి ఈ విధంగా కన్వర్ట్ చేస్తున్నాము. పిల్లలకు కార్పోరేట్ స్థాయి కంటే మించినటువంటి విద్యను అందించాలి. వారికి మంచి ఆరోగ్యం ఇవ్వాలి, మంచి న్యూట్రిషన్ ఫుడ్ ఇవ్వాలి, మంచి విద్యాబోధన ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం పెద్దఎత్తున వేలకోట్ల రూపాయల నిధులను కేటాయిస్తూ, అన్ని చర్యలను తీసుకుంటోంది. అంతేగాకుండా, వరల్డ్ బ్యాంకు నుంచి దాదాపు రూ.1,000 కోట్లు ఋణం తీసుకుని, యాన్యువల్ బేసిస్ మీద పే చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటూ రెసిడెన్షియల్ పాఠశాలలుగా ఏర్పాటు చేస్తున్నాము. విద్యార్థులందరినీ కూడా ఈ రెసిడెన్షియల్ పాఠశాలలకు మార్చేటటువంటి ప్రక్రియ పెద్ద ఎత్తున చేస్తున్నాము.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు): (మైకు లేదు) ఏంటి సార్ ఇది? సార్, గౌరవ మంత్రిగారు సభ్యులు అడిగిన ప్రశ్నకు కన్‌ఫైన్ అయి చెపితే బావుంటుంది, ఆయన వేరే అంశాల గురించి చెపుతుంటే, మేము ఇతర అంశాలకు సంబంధించి ప్రశ్నలు అడగవలసి వస్తుంది. పౌష్టికాహారానికి సంబంధించి సమాధానం చెప్పమనండి సార్.

ఉ. 11.20

SMT. PAMIDI SAMANTHAKAMANI: Chairman Sir,

MR. CHAIRMAN: No, no. There must be some discipline in the House. Now, I am taking it very seriously. What is this? Mr. Jagadeshwara Rao, put your question.

# మరుగు దొడ్ల నిర్మాణంలో జాప్యం

ప్రశ్న నెం.9543(18)
శ్రీ ద్వారపు రెడ్డి జగదీశ్వరరావు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) విజయనగరం జిల్లాలో స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం జాప్యం అవుతున్న విషయం వాస్తవమేనా?
ఆ) జిల్లాలోని అనేక గ్రామాలలో వ్యక్తిగత మరుగుదొడ్లను పూర్తిచేయడం కోసం బిల్లులను చెల్లించడం లేదన్న విషయం కూడా వాస్తవమేనా?
ఇ) అయితే, అందుకు గల కారణమేమిటి?

గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణ మరియు పారిశుద్ధ్య శాఖ మంత్రివర్యులు (శ్రీమతి కిమిడి మృణాళిని):

అ) లేదండీ.
ఆ) లేదండీ.
ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి కిమిడి మృణాళిని : అధ్యక్షా, గౌరవ సభ్యులు చాలా మంచి ప్రశ్నను లేవనెత్తడం జరిగింది. సమయాభావం వల్ల క్లుప్తంగా సమాధానం చెబుతాను. తరువాత గౌరవ సభ్యులు డౌట్స్‌ను క్లారిఫై చేసుకోవచ్చు. ఈ రోజు భారతదేశంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు చేపట్టిన విధంగా, ఆంధ్రరాష్ట్రంలో కూడా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అక్టోబరు 2 వ తేదీ 2014 వ సంవత్సరంలో మహాత్మాగాంధీ 150 వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.

అధ్యక్షా, మహిళల ఆత్మగౌరవం పేరిట వారి యొక్క ఆత్మగౌరవం పరిరక్షించుకోవాలి. రాష్ట్రాన్ని 2019 సంవత్సరం నాటికి బహిర్భూమిలో మలవిసర్జన రహిత రాష్ట్రంగా మార్చాలనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందనే విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మన రాష్ట్రంలో 90,11,000 నివాస గృహాలు ఉన్నాయి. ఇప్పటికి ఐఎస్ఎల్స్ ఉన్నవి 44,80,000. ఇంకా చేయాల్సినవి 45,31,000. ఈ సంవత్సరం 10,00,000 ఐఎస్ఎల్స్ పూర్తి చేయుటకు నిర్ణయించుకున్నాము. ఇప్పటి వరకూ పూర్తి చేసినవి 7,22,000, ప్రోగ్రెస్‌లో ఉన్నవి 4,07,000.

అధ్యక్షా, అదే విధంగా 2014-15, 2015-16, 2016-17 సంవత్సరాల ఎక్స్‌పెండిచర్‌కు సంబంధించి గవర్నమెంటు ఆఫ్ ఇండియా రూ.685 కోట్లు, ఆంధ్రరాష్ట్రం రూ.732 కోట్లు మొత్తం రూ.1,367 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఇప్పటి వరకూ ఐఎస్ఎల్స్‌కు అయినటువంటి ఖర్చు రూ.1,309 కోట్లు.

అధ్యక్షా, విజయనగరం జిల్లాకు సంబంధించి గౌరవ సభ్యులు అడిగారు. ఆ జిల్లాలో మొత్తం హౌస్ హోల్డ్స్ 4,64,000 ఉన్నాయి. వాటిలో ఐఎస్ఎల్స్ ఉన్నవి 1,06,000, ఇంకా పూర్తి చేయాల్సినవి 3,58,000. ఈ రెండున్నర సంవత్సరాలలో ఐఎస్ఎల్స్‌కు అయిన ఖర్చు రూ.64.14 కోట్లు. 2016-17వ సంవత్సరంలో పూర్తి చేసినటువంటి ఐఎస్ఎల్స్ 43,469. ప్రోగ్రెస్‌లో ఉన్నవి 25,191.

2016-17వ సంవత్సరంలో ఐఎస్ఎల్స్‌కు రూ.43.92 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. చెల్లింపుల గురించి కూడా గౌరవ సభ్యుల అడిగారు. ప్రతి రోజూ కూడా ఐఎస్ఎల్స్ నిర్మాణం జరుగుతోంది. అందుచేత ఆ బిల్లులు వస్తూనే ఉంటున్నాయి. చాలా వేగంగా చెల్లింపులు జరిగినవి. గత రెండు నెలల నుండి విజయనగరంకు సంబంధించి రూ.14 కోట్లు విడుదల చేయడమైనది. ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న పేమెంట్స్ కేవలం రూ.26.60 కోట్లు మాత్రమే. నాన్ ఒడిఎఫ్ క్రింద రూ.7.24లక్షలు.. మొత్తం కలిపి రూ. 33.84 కోట్లు . విజయనగరం జిల్లాకు సంబంధించి ఒడిఎఫ్ రూ.2.89 కోట్లు, నాన్ ఒడిఎఫ్ రూ.12 లక్షలు. మొత్తం 2.41 కోట్లు మాత్రమే. మొత్తం జిపిసిపిలో12,856 ఉన్నాయి. ఇప్పటికి ఒడిఎఫ్ అచీవ్ చేసింది రూ.3,226. అదే విధంగా 2016-17 వ సంవత్సరంలో చాలా ఎక్కువగా రూ.2,913 పూర్తి చేయడం జరిగింది. విజయనగరం జిల్లాలో 923 ఉన్నాయి. అక్కడ 46 మాత్రమే పూర్తి చేయడం జరిగింది. ఒడిఎఫ్ జిల్లాలుగా ఈ సంవత్సరం నెల్లూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలను ఎంపిక చేయడం జరిగింది. ఈ సంవత్సరంలో ఏప్రిల్ మొదటి వారానికి ఒడిఎఫ్ జిల్లాలుగా కొన్ని జిల్లాలు ఎంపిక అవుతాయి. రాబోయే సంవత్సరంలో విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, గుంటూరు, కర్నూలు జిల్లాలను ఒడిఎఫ్ జిల్లాలుగా ఎంపిక చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నాము. ఆ దిశగా ఈ రాష్ట్రం ముందుకు వెళుతుందని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు మొన్ననే సభలో దీనిని ఒక సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ కూడా తీసుకోవాలని తెలియజేయడం జరిగింది. ప్రజల్లో చైత్యనం తీసుకురావాలి. ప్రతి ఒక్కరికి మరుగు దొడ్లను నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రూ.7,200 , రాష్ట్ర ప్రభుత్వం రూ.7,800 మొత్తంగా కలిపి ప్రభుత్వం ఉచితంగా రూ.15,000 ఇవ్వడం జరుగుతుంది. ప్రతి ఒక్కరిని కూడా మోటివేట్ చేసి ఐఎస్ఎల్ కట్టుకోవడమే కాకుండా, వాటిని వాడుకునే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. ప్రతి ఎం.ఎల్.ఏ, ప్రజాప్రతినిధి గ్రామ స్థాయి నుండి ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో ఒడిఎఫ్ రాష్ట్రంగా బహిర్భూమిలో, మల విసర్జనరహిత రాష్ట్రంగా చేసి ప్రజల యొక్క ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ మహిళల యొక్క ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలని, గౌరవ ముఖ్యమంత్రి గారు ఈనాడు రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుచున్నారని సగౌరవంగా, ఈ సభ ద్వారా ఆంధ్రరాష్ట్ర ప్రజానీకానికి తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ కూడా ముందుకు వచ్చి సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయవలసినదిగా ఈ సభ ద్వారా, తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

## ముందస్తు అరెస్టులకు సంబంధించిన నిబంధనలు

ప్రశ్న నెం.9506(19)
శ్రీ ఎం.వి.ఎస్.శర్మ, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (హోం వ్యవహారాలు) గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ముందస్తు అరెస్టు లకు సంబంధించిన నిబంధనల వివరాలేమిటి?0

ఆ) ముందస్తు అరెస్టులు / ముందస్తు కస్టడీలలో రాష్ట్రం ఏ నిబంధనల క్రింద జోక్యం చేసుకోగలుగుతుంది?

గౌరవనీయులైన హోం మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రివర్యులు (శ్రీ ఎన్. చినరాజప్ప):

అ) ఎవరైనా వ్యక్తులు పట్టదగిన నేర చేయబోతున్నారు అని తెలిసినప్పుడు వారిని 151 నేర శిక్షాస్మృతి క్రింద ముందస్తు కస్టడీకి తీసుకొనవచ్చును. నేరం శిక్షాస్మృతిలోని 151 ప్రకారం పోలీసు అధికారికి ఎవరైనా వ్యక్తులు పట్టదగిన నేరం చేయడానికి ప్రణాళికతో ఉన్నారు. అని తెలిసినప్పుడు అట్టి పోలీసు అధికారి మేజిస్ట్రేటు వద్ద నుండి వారెంట్ లేకుండా పట్టదగిన నేరం చేయడానికి ప్రణాళికతో ఉన్న వ్యక్తులను ముందస్తు అరెస్టు ద్వారా తప్పితే, ఆ వ్యక్తులను పట్టదగిన నేరం చేయకుండా ఆపలేమని తెలిసినప్పుడు పోలీసు అధికారి ఈ రకమైన ముందస్తు అరెస్టు చేయవచ్చును. అయితే, ఏదేని ఇతర నేర శిక్షాస్మృతిలోని నిబంధనలు లేదా ప్రస్తుతానికి అమలులో ఉన్న ఏదేని ఇతర చట్టం క్రింద అతనిని తదుపరి నిర్బంధించడం అవసరం లేదా అధికారం ఉన్నప్పుడు తప్పితే పైవిధంగా అరెస్టు అయిన వ్యక్తిని అతను అరెస్టు అయిన సమయం నుండి 24 గంటల గుడువుకు మించి నిర్బంధించరాదు.

ఆ) ముందస్తు అరెస్టులు / ముందస్తు కస్టడీలలో రాష్ట్రం ఈ క్రింది నిబంధనల క్రింద జోక్యం చేసుకోవచ్చు.

(1) పట్టదగిన నేరాలను చేయడానికి అవకాశమున్నట్టి ఒక వ్యక్తిని నేర శిక్షాస్మృతిలోని 151వ సెక్షను ప్రకారంగా ముందస్తుగా అరెస్టు చేయడమవుతుంది.

(2) ఒక వ్యక్తి ఏవేని స్థిర లేదా చర ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడానికి పాల్పడుతున్నప్పుడు పోలీసు అధికారి అట్టి ప్రభుత్వ ఆస్తికి కలిగే నష్టాన్ని నివారించడానికి అవసరమయిన అట్టి చర్యను తీసుకుంటారు.

శ్రీ ఎం.వి.యస్.శర్మ: అధ్యక్షా, cognizable offence చేయవచ్చు అని పోలీసు అధికారి అనుకుని ముందస్తు అరెస్టు చేయవచ్చు అని గౌరవ మంత్రి గారు చెబుతున్నారు. ఒక మెమొరాండమ్ ఇవ్వడం cognizable offence అవుతుందా? ఒక ఊరేగింపు చేయాలనుకోవడం cognizable offence అవుతుందా? కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా ఉద్యమం నడుస్తున్నప్పుడు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ప్రతిపక్ష నాయకులుగా అక్కడకు వచ్చి ఉద్యమ శిభిరాన్ని ప్రారంభించి దానికి మద్ధతు తెలియజేసి వెళ్లారు. అప్పుడు అది cognizable offence అవుతుందా? గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు చేసినప్పుడు cognizable offence కానిది, ఈ రోజు ఇంకొక రాజకీయ పార్టీ నాయకుడో, ఇంకొక ప్రజా సంఘ నాయకుడో చేస్తే cognizable offence ఎలా అవుతుంది? వారు ఎందుకు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు?

( INTERRUPTIONS)

MR. CHAIRMAN: No, no. I am not allowing anybody. Mr.Bala Subrahmanyam I am not allowing you. Nothing will go on record. It is a Question Hour and that is the procedure being followed for the past ten years. I am not allowing anybody and even I don't allow supplementary. That is my convention. If that subject is such an important thing, then why you have not come in a separate motion? I don't want to change my convention. I am not allowing anybody. If you continue like this, I will adjourn the House. What is the procedure being followed in the House for the past ten years, I am also following the same procedure. Moreover, I am also cautioning for the last half-an-hour. But, nobody is hearing me. This is an established convention and nobody has challenged it. If you want, then you come with a separate motion then I will allow. Whatever it may be, I did not even allow supplementary. Mr. M.V.S. Sarma, you are there from the beginning and you know very well. That is the reason why I have allowed Mr. M.V.S. Sarma. Nobody can take part except M.V.S. Sarma. I am not allowing anybody.

ఉ.11.30

(INTERRUPTION)

MR. CHAIRMAN: Please, all of you go to your seats. Please, sit down. It is already 11-30 a.m. Everybody is having freedom to come to the House and go except me. There is one convention. Mr. M.V.S. Sarma you put one supplementary. I am sure, if you continue like this, then I will not allow even one supplementary. I want an answer to go on record and it has gone on record. Whatever it may be, I don't want to deviate from the established practices. I told that Mr.M.V.S. Sarma should answer. It is not like that. Actually, I want to complete the Question Hour by 11-00 a.m.

(అంతరాయం)

(సభ్యులు శ్రీ ఎం.వి.యస్.శర్మ, శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం, శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి, శ్రీ బొడ్డు నాగేశ్వరరావు గార్లు తమ తమ స్థానాల నుండి లేచి పోడియం వద్దకు వచ్చి మీరు పాస్ ఇచ్చిన తరువాత కూడా వారిని అరెస్టు చేశారని తమ నిరసనను తెలియజేశారు.)

శ్రీ ఎం.వి.యస్.శర్మ: మీరు పాస్ ఇచ్చిన తరువాత కూడా వారిని అరెస్టు చేశారు.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి: మీరు పాస్ ఇచ్చిన తరువాత కూడా వారిని అరెస్టు చేయించడమా? ఇది సభా గౌరవాన్ని పోగొట్టినట్లు ఉంది సార్. ఇది రెచ్చగొట్టడం అవుతుంది. ఇంకొకటి కాదు. కక్ష సాధింపులా ఉంది ఈ వ్యవహారం.

MR. CHAIRMAN: Suppose, if it is such an important issue, why you have not coming in a separate motion?

శ్రీ ఎన్. చినరాజప్ప: ఈ రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అలాగే అనేక పరిశ్రమలు, ప్రాజెక్టులు వస్తున్నాయి. ఈ ప్రాజెక్టులు జరగకూడదని అనేక పార్టీలు ఆటంకాలను సృష్టిస్తున్నాయి. అందువలన, వీటన్నింటిని గమనించి, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకూడదనే ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టామని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

(ప్రతిపక్ష సభ్యులు శ్రీ సి.రామచంద్రయ్య, శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శ్రీ పి.జె.చంద్రశేఖర రావు, శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మొదలైన వారంతా తమ తమ స్థానాల నుండి నిరసనలను తెలియజేశారు.)

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం: అధ్యక్షా, మాకు ఇక్కడకు రావాలంటే భయమేస్తోంది. మమ్మల్ని అరెస్టు చేయిస్తున్నారు అంటే, మమ్మల్ని ఇలా గొంతు నొక్కితే చాలా అనర్థాలకు దారి తీస్తుంది. మేము ఉపాధ్యాయులం. మేము అంత అమాయకంగా లేము.

శ్రీ ఎం.వి.యస్.శర్మ: అధ్యక్షా, మన కౌన్సిల్ పాస్ ఇచ్చిన తరువాత మెమొరాండమ్ ఇవ్వడానికి వచ్చిన వారిని మీరు అరెస్టు చేయిస్తారా?

MR. CHAIRMAN: Mr. M.V.S. Sarma, you can't speak like this, from the Podium. Now, the Question Hour is over.

Now, the House is adjourned Tea-Break for 15 Minutes.

(Then, the House adjourned at 11-33 a.m.)

* * *

మ. 12.10

(After Tea-Break the House Re-assembled at 12.15 p.m.)

(Hon'ble Chairman in the Chair)

* * *

MR. CHAIRMAN: Now Special Mentions. Boddu Nageswara Rao garu...

## 3.ప్రత్యేక ప్రస్తావనలు

శ్రీ బొడ్డు నాగేశ్వరరావుః అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి ఆయుష్ వైద్యశాలల్లో కాంట్రాక్టు పద్ధతుల్లో పనిచేస్తున్నటువంటి పారామెడికల్ సిబ్బందికి ప్రభుత్వం జనవరి, 2016 నుండి గౌరవ వేతనాలు చెల్లించడం లేదు. ఆ గౌరవ వేతనాలను చెల్లించాలని, వారి సేవల్ని క్రమబద్ధం చేయాలని, జీఓ నెం.151 ద్వారా 10 పి.ఆర్.సి. క్రింద వేతనాలు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వమిచ్చిన హామీ మేరకు వారి సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ, ఈ రెండు రోజుల నుండి వారి కుటుంబాలతో సహా పెద్దయెత్తున ధర్నాకు కూర్చున్నారు. ఈ రోజున వారి సమస్యల్ని స్పెషల్ మెన్షన్ ద్వారా నేను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరుగుతోంది. 2008లో ఎన్‌ఆర్‌హెచ్‌ఎం పథకం క్రింద వీళ్లంతా నియమించబడ్డారు. ఇందులో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 449 మందిని రెగ్యులరైజ్ చేశారు. ఆ స్థానాలను మళ్లీ భర్తీ చేయకుండా, డాక్టర్లు లేరు కాబట్టి వీళ్లకి జీతాలివ్వడం లేదని 2016 నుండి గౌరవ వేతనాలివ్వడం ఆపేశారు. ఇది చాలా అన్యాయం.

MR. CHAIRMAN: I will send it to the Government for necessary action....

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు (పట్టభద్రుల నియోజకవర్గం-కృష్ణా, గుంటూరు) ః సార్, ఆ 900 కుటుంబాలు ఈ రోజున రోడ్డుమీద ఉన్నాయి కాబట్టి, వీరికి న్యాయం చేయాలని మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు: అధ్యక్షా, ఈ రోజు అనంతపురం జిల్లా నుండి వచ్చిన రైతులు, వలస కార్మికులు, మహిళలు సుమారుగా 5000 మంది విజయవాడ పట్టణంలో ఉన్నారు. తమ సమస్యల్ని పట్టించుకుని ఈ వలసల్ని నివారించేందుకు, త్రాగునీరు ఏర్పాటు చేసేందుకు, పశువులకు మేత సప్లై చేసేందుకు, అలాగే ఉపాధి హామీ పనికి సంబంధించినటువంటి జాబు కార్డులకి సంబంధించి అన్ని మండలాల్లోనూ కరువుని ప్రకటించిన నేపథ్యంలో, 150 రోజుల పాటు ప్రతి జాబుకార్డుకి విధిగా ఉపాధి వచ్చేలా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించి, అక్కడ త్రాగునీటికి ఇబ్బంది లేకుండా, వలసలు, క్షామ నివారణకు శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాల్సినటువంటి చర్యలు, దానికి తగిన కేటాయింపుల కోసం జిల్లాకు సంబంధించిన అఖిల పక్ష సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కరువు నివారణకు శాశ్వత చర్యలను చేపట్టాలని కోరుతున్నారు. అలా చేయనట్లయితే, అనంతపురం జిల్లా ఎడారిగానూ, మనుషులే లేనట్టి ప్రాంతంగా మారిపోయే ప్రమాదమున్నది. కాబట్టి, జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి వెంటనే అనంతపురం జిల్లా రాజకీయ, ప్రజా సంఘాల వారితో కలిసి కూర్చుని శాశ్వత కరవు నివారణ చర్యలకు పూనుకోవలసిందిగా కోరుతూ, అక్కడి ప్రజల తరఫున సభ దృష్టికి, ఈ ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని పరిశీలనార్థం తీసుకువస్తున్నాను. ధన్యవాదాలు అధ్యక్షా.

MR. CHAIRMAN: Item No.II of the Agenda. All the papers are deemed to have been laid on the Table of the House.

## 4.PAPERS LAID ON THE TABLE:

1. A copy of the 1st Annual Report of the Bhogapuram International Airport Corporation Limited for the Year, 2015-16, as required under Section 619A(3) of the Companies Act, 1956.

2. A copy of the 38th Annual Report of the Andhra Pradesh Tourism Development Corporation Limited, for the Year 2013-2014, as required under Section 619A(3) of the Companies Act, 1956.

Item No.III – Mr. Narayanagaru, Minister for Municipal Administration will present Supplementary Estimates of Expenditure.

SRI P. NARAYANA, MINISTER FOR MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT: On behalf of Minister for Finance, I beg to present the Supplementary Estimates of Expenditure for 2016-17.

మ. 12.20

## 5. సాంఘిక భద్రతా పథకాలపై లఘు చర్చ:

MR. CHAIRMAN: Now, we will go for short discussion on Social Security Schemes. Govinda Reddy Garu…

శ్రీ దేవసాని చినగోవింద రెడ్డి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. సోషల్ సెక్యూరిటీ స్కీములలో మూడు నాలుగు స్కీములను సభలో ప్రస్తావించదలచుకున్నాను.

మొదటిది, బీదలకు ఇచ్చే బికెటి భూముల పంపిణీ. రెండవది, రేషన్ కార్డులను ఇష్యూ చేయడం, మూడవది, బీదప్రజలకు ఇళ్ల పంపిణీ, నాలుగవది పెన్షన్స్. ముందుగా గ్రామీణ బీద ప్రజలకు ఇచ్చే భూమి విషయంలో గతంలో డా. వై.యస్.రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సమైక్య రాష్ట్రంలో బీదలకు 32 లక్షల ఎకరాలు పంపిణీ చేయడం జరిగింది. కానీ, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క ఎకరం బికెటి భూమిని కూడా పంపిణీ చేయలేదు. ముఖ్యంగా ఈ భూమి పంపిణీకి శాసనసభ్యుడు అధ్యక్షునిగా ప్రతి నియోజకవర్గంలోనూ అసైన్‌మెంట్ కమిటీలు ఉండేవి. ఇప్పటివరకూ ఒక్క అసైన్‌మెంట్ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు. భూ వివాదాలను పరిష్కరించాలంటే ఈ అసైన్‌మెంట్ కమిటీలు ప్రముఖ పాత్ర వహించేవి. ఎవరికైనా పట్టాలు ఇవ్వకపోయినా, ఒక్కోసారి పట్టా ఇచ్చినా భూమి ఉండని పరిస్థితుల్లో, ఇతర విషయాలలో గానీ, భూమిని సక్రమంగా పంపిణీ చేయడానికి గానీ, విచారించడానికి గానీ ఏ వ్యవస్థా లేదు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో తహశీల్దారును అడిగినా కూడా పరిష్కరించలేనివిగా ఉంటున్నాయి. బీదవాళ్లకు ఎక్కడా కూడా ఒక్క ఎకరా పంపకమనేది ఈ ప్రభుత్వంలో జరగలేదు అధ్యక్షా. దీనివల్ల చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఇది ఒక సెక్యూరిటీ స్కీం. పేదవానికి ఒక ఎకరా భూమి ఉంటే, దానిని దున్నుకుని బ్రతకడానికి వీలుంటుంది. లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు నిరుపయోగంగా పడి ఉంటున్నాయి. ఈనాడు ప్రభుత్వం భూమిని తీసుకుని ఇండస్ట్రియలైజేషన్ అదీ, ఇదీ అని చెప్పి పేదవాళ్లెవరికీ భూమిని ఇవ్వడం లేదు. కొన్ని చోట్ల పరిశ్రమలకు ఉపయోగపడవచ్చు గానీ, అన్ని గ్రామాలలో ఉన్న భూమి కూడా పరిశ్రమలకు ఉపయోగపడదు. మరి ఎందుకు ఈ ప్రభుత్వంలో పేదలకు ఆ భూమిని ఇవ్వడం లేదో మంత్రిగారు సమాధానం చెప్పవలసిందిగా కోరుతున్నాను.

రేషన్ కార్డుల విషయమైతే గత సంవత్సరం మార్చి వరకూ 1,40,00,000 ఉంటే, సెప్టెంబరుకు 1,31,00,000లకు తగ్గిన విషయం మనకు కనబడుతున్నది. అంతేకాకుండా ఇంతకుముందు 9 రకాల

సరుకులు సప్లై చేసేవారు. గత ప్రభుత్వంలో "అమ్మ హస్తం పేరు"తో ఒక కిలో కందిపప్పు, ఒక కిలో గోధుమ పిండి, ఒక కిలో గోధుమలు, ఒక పామాయిల్ ప్యాకెట్, అరకిలో చక్కెర, కిలో ఉప్పు ప్యాకెట్, అరకిలో చింతపండు, 250 గ్రా. కారంపొడి, 100 గ్రా. పసుపు వీటన్నింటినీ ఒక సంచిలో ఉంచి సబ్సిడీ రూపంలో ఆ బ్యాగును కేవలం రూ.85 లకు పంపిణీ చేసే పద్ధతి ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటన్నింటినీ తీసేసి కేవలం బియ్యం, అరకిలో చక్కెర మాత్రం ఈనాడు పంపిణీ చేస్తున్నారు. బీదలకు ఇచ్చే నిత్యావసర వస్తువులలో కేవలం బియ్యం ఇచ్చేస్తే సరిపోదు. నిత్యావసర వస్తువులు చుక్కలంటిన ధరలతో ఉన్న నేపథ్యంలో బీదలందరూ చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సభ దృష్టికి తీసుకువస్తున్నాను. చాలామంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఈ–పాస్ అని పెట్టి వాటిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఆధార్ కార్డు ఉన్నప్పటికీ రేషన్ కార్డును కట్ చేసే వ్యవస్థ నడుస్తున్నది. తెల్ల రేషన్ కార్డుతోబాటు ఆధార్ కార్డు ఉన్నప్పటికీ 95,000 కుటుంబాలకు రేషన్ అందడం లేదు. ఆధార్‌కార్డును అనుసంధానం చేసినప్పటికీ ఈ–పాస్ మిషన్‌లో వేలిముద్రలు సరిగా పడడం లేదనే సాకుతో రేషన్‌లను నిలిపివేసే పరిస్థితి ఉన్నది. రేషన్ ఆగిపోయిందని తహాశీల్దారుకు 95,339 మంది లబ్ధిదారులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, విఆర్‌ఓల ద్వారా రేషన్ సరుకులు ఇప్పించేందుకు ప్రయత్నించగా కేవలం 16,435 మందికి మాత్రమే సరుకులు అందాయి. మిగతా 78,904 మంది లబ్ధిదారులకు సరుకులు అందని పరిస్థితి ఉన్నది. ఎవరైనా ఎక్కడైనా వలసలు వెళితే వాళ్ల రేషన్‌ను కట్ చేస్తున్నారు. రెండు, మూడు నెలలు రేషన్ తీసుకోకపోతే ఆ రేషన్ కార్డును కూడా కట్ చేస్తున్న పరిస్థితి ఉన్నది. ఇంతకుముందు మనవిచేసినట్లుగా 9,14,009 కార్డులు గత మార్చి నుండి తొలగించిన విధానం ఉన్నది.

ధరల విషయానికి వస్తే కందిపప్పు తప్పనిసరిగా తీసుకోవాలని రేషన్ కార్డుదారులపై ఒత్తిడి చేస్తున్నారు. తెలంగాణా రాష్ట్రంలో కేజీ కందిపప్పు రూ.50లు ఉండగా, మన రాష్ట్రంలో కేజీ రూ.120లకు అమ్ముతున్నారు. ఈ కందిపప్పు తీసుకోకపోతే మిగతా రేషన్ వస్తువులు ఇవ్వము అని రేషన్ షాపుల వారు చెప్పడంతో రేషన్ లబ్ధిదారులకు ఇబ్బంది కలుగుతున్న విషయాన్ని నేను సభ దృష్టికి తీసుకువస్తున్నాను. వేలి ముద్రలు పడడం లేదని రేషన్ కార్డులు ఇవ్వడం లేదు. సర్వసాధారణంగా 60 సంవత్సరాలు దాటిన వారు వేలిముద్రల విషయంలో ఇబ్బంది పడుతున్నారు. ఆ కారణంగా రేషన్ ఇవ్వమంటే ఎలా? ప్రభుత్వం కూడా తహాశీల్దారుకు ఫిర్యాదు చేసుకోమని చెబుతున్నది. కానీ, అక్కడ సరైన యంత్రాంగం లేక ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఇవ్వడం లేదు. వారు రేషన్ తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, హౌసింగ్ విషయానికి వస్తే, డా. వై.యస్.రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 13 జిల్లాలలో 30 లక్షలకు పైగా ఇళ్లు ఇచ్చిన విషయం ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. సమైక్య రాష్ట్రంలో 48 లక్షల ఇళ్లు ఇచ్చారు. కానీ, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 సంవత్సరాలు అయినప్పటికీ ఎవరికీ ఇళ్లు ఇవ్వలేదు. ఏదైనా అంటే, గత ప్రభుత్వంలో చాలావరకు అవకతవకలు జరిగాయి, వాటన్నింటినీ సరిదిద్దుతున్నాము అంటూ మూడు సంవత్సరాల నుండీ కాలయాపన చేస్తున్నారు గానీ ఇప్పటివరకూ దానిని పరిష్కరించడం లేదు. బీదలకు ఇళ్లు ఇచ్చే విషయంలో ఈ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

మ. 12.30

అధ్యక్షా, పెన్షన్ల విషయంలో నేను ముఖ్యమంత్రిగారి డ్యాష్‌బోర్డు నుంచి సమాచారాన్ని సేకరించడం జరిగింది. మార్చి నెలలో మొత్తం 45,46,709 పెన్షన్లు మంజూరైతే, వాటిలో 93 శాతం పెన్షన్లు పంపిణీ చేయగా, 92.13 శాతం పెన్షన్ల మొత్తాన్ని పంపిణీ చేసినట్లుగా ముఖ్యమంత్రి గారి డ్యాష్‌బోర్డులో

సమాచారముంది. అంతా కంప్యూటరీకరణ చేశామంటున్నా నూటికి నూరు శాతం పెన్షన్లను ఇంకా ఎందుకు ఇవ్వడం లేదు? పెన్షన్లను పూర్తిగా ఇవ్వకపోవడానికి ప్రధాన కారణం ఏమిటంటే, వేలిముద్రలు సరిగా పడకపోవడం, వృద్ధులెవరైతే ఉన్నారో వారందరికీ కూడా ఏదో ఒక సాకుతో కనీసం 8 శాతం మందికి పెన్షన్లు ఎగవేసే కార్యక్రమం ప్రభుత్వం చేస్తోందని కూడా ఈ సందర్భంగా నేను సభకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, పేదలకోసం ప్రభుత్వం తీసుకువచ్చిన సోషల్ సెక్యూరిటీ స్కీములన్నింటినీ సరిగా అమలుచేయాలంటే ప్రభుత్వ యంత్రాగం ఉంది. కానీ, ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తిగా పక్కన పెట్టి ప్రతి గ్రామంలో జన్మభూమి కమిటీలను ఏర్పాటుచేసి వారికి అధికారాన్ని కట్టబెట్టి వారి ద్వారానే ప్రతి ఒక్క కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తోంది. వారు ముఖ్యంగా ఏమి చూస్తున్నారంటే, ఈ వ్యక్తి మాపార్టీకి సంబంధించిన వ్యక్తా లేక, ఈ వ్యక్తి మా పార్టీకి ఓటు వేశాడా అనేదే చూస్తున్నారు. ప్రభుత్వం అందరి కోసం పనిచేయాలే కానీ కేవలం ఒక రాజకీయ పార్టీకి మాత్రమే పనిచేయడం చాలా దురదృష్టకరం. ఈనాడు ఈ రాష్ట్రంలో ఆవిధంగా జరుగుతోంది. అనేకమంది సర్పంచులు, ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు ఉండి ఇంత పెద్ద ప్రభుత్వ యంత్రాగం ఉన్నప్పుడు, వారందరినీ పక్కనపెట్టి ప్రభుత్వం ఇచ్చే సహాయాన్ని కేవలం పార్టీపరంగా నడిపించడం చాలా దురదృష్టకరమైన విషయంగా నేను సభ దృష్టికి తీసుకువస్తున్నాను. ప్రతి పథకం విషయంలో లబ్దిదారులను ఎంపిక చేయడంలో పారదర్శకత లేదు. కేవలం రాజకీయపార్టీకి, స్థానిక నాయకులకు సహాయపడుతున్నారా, లేదా అనే దృష్టితో చూస్తున్నారు కాబట్టి చాలామంది పేద ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అధ్యక్షా, పెద్ద పెద్ద ఇరిగేషన్ పథకాలు గానీ, నీరు-చెట్టు పథకం గానీ, గ్రామీణ రహదారులు మొదలైనవన్నీ కూడా కేవలం నామినేషన్ పద్ధతిలో వారి పార్టీ కార్యకర్తలకు ఇస్తున్నారు. రూ.200 లు, రూ.500 లు, రూ.1,000 లు ఇచ్చే పథకంలో కూడా రాజకీయ జోక్యం నడుస్తోంది కాబట్టి ఇది చాలా దురదృష్టకరమని, వీటన్నింటినీ కూడా సరిచేయవలసిన అవసరం ఎంతైనా ఉందని, గౌరవ మంత్రిగారు వీటన్నింటినీ కూడా చక్కదిద్దుతారని, భవిష్యత్తులో కూడా కేవలం ప్రభుత్వ యంత్రాంగంతోనే ఈ కార్యక్రమాలన్నీ చక్కగా నిర్వహించాలని మనవి చేసుకుంటూ, నాకీ అవకాశం ఇచ్చిన తమరికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్ (స్థానిక సంస్థలు – కృష్ణా): అధ్యక్షా, నేడు రాష్ట్రంలో నివసించేటటువంటి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సామాజిక భద్రతను కల్పించి, అనేక సంక్షేమ కార్యక్రమాలను ఈ ప్రభుత్వం చేపట్టడం జరిగింది. రాష్ట్రవిభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చాలా కష్టాల్లో, నష్టాల్లో ఉన్న విషయం అందరికీ తెలుసు. అయినప్పటికీ, ప్రజల అంచనాలకు మించి, వారు ఆశించిన దానికంటే ఎక్కువగా అనేక రకాల పథకాలను సక్రమంగా అమలులోకి తేవడం జరిగింది. వాటిలో ముఖ్యంగా, పెన్షన్ల పథకం, గతంలో రూ.200 లు మాత్రమే పెన్షన్‌గా చెల్లించేవారు. ఈనాడు రూ.1,000 ల చొప్పున వృద్ధులు మరియు వితంతవులకు, వికలాంగులకు రూ.1,000 ల నుంచి రూ.1,500 ల వరకూ అనేకమందికి పెన్షన్లు ఇవ్వడం జరుగుతోంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడు సంవత్సరాలలో 10,60,000 పెన్షన్లు కొత్తగా ఇవ్వడం జరిగింది. ఈరోజున మొత్తంగా 45,68,000 మందికి పెన్షన్లు ఇవ్వడం జరుగుతోంది. సంవత్సరానికి రూ.5,880 కోట్లు పెన్షన్ల రూపంలో ఇవ్వడం జరుగుతోంది. పేద, బడుగు,బలహీన వర్గాలు, వృద్ధులు,వికలాంగులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులందరికీ రూ.5,8880 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోంది. నేడు రాష్ట్రం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉంది. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఒక చారిత్రాత్మకమైన నేపథ్యంలో పాదయాత్ర చేసి, పేద ప్రజల యొక్క, వృద్ధుల యొక్క మరియు వికలాంగుల యొక్క కష్టాలను

ప్రత్యక్షంగా చూసి, తీవ్రంగా బాధపడడం జరిగింది. మనకు ఎన్ని కష్టాలు, నష్టాలున్నా సరే వీళ్లందరినీ ఆదుకోవాలని, ధనిక రాష్ట్రం, మిగులు బడ్జెట్ కలిగివున్న తెలంగాణ రాష్ట్రంతో సమానంగా పెన్షన్‌ను రూ.1,000 లు చొప్పున ఇవ్వడం జరుగుతోంది. ఇది మామూలు విషయం కాదు. మొత్తం 45,68,000 పెన్షన్లు అంటే, దాదాపు ప్రతి కుటుంబంలో కూడా వృద్ధాప్య పెన్షనో, వితంతువు పెన్షనో, వికలాంగుల పెన్షనో, చేనేత కార్మికుల పెన్షనో, కల్లుగీత కార్మికుల పెన్షనో, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల పెన్షనో ఏదో ఒక పెన్షన్ ఇవ్వడం జరుగుతోంది. ఈ సంవత్సరం అయితే, 2017-18 సంవత్సరానికి సుమారు 46,00,019 పెన్షన్లకు గాను, రూ.5,906 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. కేంద్రప్రభుత్వం నిధులను ఇస్తోంది కనుక మీరు చేస్తున్నారని అప్పుడప్పుడు ప్రతిపక్షాలు రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శించడం జరుగుతోంది. ఈ మొత్తంలో కేంద్రప్రభుత్వం మనకు సంవత్సరానికి కేవలం రూ.284 కోట్లు మాత్రమే ఇస్తోంది. ఈ రకంగా పెన్షన్లను రాష్ట్రప్రభుత్వం ఇవ్వడం మామూలు విషయం కాదు. మేము గ్రామాల్లో తిరిగేటపుడు, జన్మభూమి కార్యక్రమాలకు వెళ్లినపుడు అక్కడ వృద్ధులు, మహిళలు, వికలాంగులు నెలకు రూ.1,000 ల చొప్పున లేదా రూ.1,500 ల చొప్పున పెన్షన్ వస్తోందని చెప్పి వారు ఎంతో ఆనందపడుతున్నారు. వాళ్ల కుటుంబ సభ్యులు వారికి గౌరవం ఇవ్వడం జరుగుతోంది. ఈనాడు పేద కుటుంబాల్లో లేదా పెద్ద కుటుంబాల్లో కూడా డబ్బు సంపాదించలేరని వృద్ధుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో మనందరికీ తెలుసు. కానీ, ఈరోజు నెలకు రూ.1,000 లు వారికి వస్తుందంటే, అది మామూలు విషయం కాదు. అదే, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత మొత్తాన్ని కేటాయించిందనేది ఒక్కసారి చూసుకుంటే, వారు సంవత్సరానికి కేవలం రూ.1,237 కోట్లు మాత్రమే పెన్షన్ల కోసం ఇచ్చేవారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.5,880 కోట్లు పెన్షన్ల రూపంలో ఇవ్వడం జరుగుతోంది. సుమారు నాలుగున్నర రెట్లు గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం ఎక్కువగా ఇవ్వడం జరుగుతోంది. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా, ఈ రకమైన అనేక సహాయాలు చేయడమే కాకుండా, ప్రభుత్వం ఇచ్చే పెన్షన్లలో ఎక్కడా అవకతవకలు జరగకూడదని, EPOS మెషీన్లు పెట్టడం, ఆధార్ లింకేజి పెట్టడం, వేలిముద్రలు, ఐరిస్ తీసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటూ, ఎక్కడా పెన్షన్ల పంపిణీలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ప్రభుత్వం నూటికి నూరుశాతం ప్రజలకు పెన్షన్లు అందించాలనే ప్రయత్నం చేస్తోంది. ఇంతకుముందు, గౌరవసభ్యులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గారి డ్యాష్‌బోర్డు నుంచి పెన్షన్లపై సమాచారాన్ని సేకరించామని చెప్పారు.

మ. 12.40

ఆ ఏడుశాతం మంది కూడా ఎక్కడికైనా ఊళ్ళకు వెళ్ళడంవల్లకానీ, లేకపోతే ఇంకేదైనా ఇబ్బంది వచ్చికానీ వాళ్ళు తీసుకోకపోయి ఉండవచ్చు. అయినా వారికి వచ్చేనెలలోకానీ, ఆ పై వచ్చేనెలలో కానీ మొత్తం రెండు, మూడు నెలలు కలిపి ఇవ్వడం జరుగుతుంది. అంతేకాదు ఉదాహరణకు మా కృష్ణా జిల్లా ఉయ్యూరులో పెన్షన్ తీసుకునే వ్యక్తి ఎక్కడో శ్రీకాకుళం జిల్లా రాజాంకు వెళ్ళి ఉంటే అక్కడ అయినా పెన్షన్ తీసుకోవచ్చు. అంతేకాదు రేషన్ కూడా అక్కడ తీసుకోవచ్చు. దానికి పోర్టబిలిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఇటువంటి అమోఘమైన అనేక అంశాలను ఈరోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగింది.

ఇందాక మన మిత్రులు మాట్లాడుతూ, వై.యస్.ఆర్. హయాంలో ముప్పైలక్షలు ఇళ్ళు కట్టించాము, కానీ తెలుగుదేశం ప్రభుత్వంలో ఏమీ చేయలేదన్నారు. వారు చెప్పింది అవాస్తవం. గ్రామాల్లో ఇప్పటికే ఇళ్ళు కట్టడాన్ని ప్రారంభించాము. పట్టణాల్లో కూడా త్వరలోనే మార్గదర్శకాలను ఇచ్చి ప్రారంభించడం జరుగుతుంది. మీరు ముప్పై లక్షల ఇళ్ళు కట్టించి ఉంటే దాదాపు ఈ రాష్ట్రంలోని ఒక నలభై, యాభై శాతం మందికి ఇళ్ళు కట్టించి పెట్టినట్లే కదా. అలా అయితే వాళ్ళంతా మళ్ళీ ఇప్పుడు ఇళ్ళు కావాలని ఎందుకొస్తున్నారు? కట్టించమని మీరెందుకు అడుగుతున్నారు? అంటే ప్రతి వ్యక్తికీ, ప్రతి కుటుంబానికీ

ఇళ్ళు వచ్చేసినట్లే కదా. ఇంకా కొత్తగా ఎందుకు ఇప్పుడు ఇళ్ళు కట్టించిపెట్టడం. అంటే మీరు మంజూరు చేసినటువంటి ఇళ్ళన్నింటినీ మీ కార్యకర్తలు దిగమింగేశారా?

ఆరోజున మీ మహానేత, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారి నాయకత్వంలో సుమారు 15 లక్షల ఇళ్ళు, వేల కోట్ల రూపాయలు మీరు గ్రామాల్లోని మీ పార్టీ కార్యకర్తలకు దోచి పెట్టారని ఈరోజున మీరు మాట్లాడుతున్నదాన్ని బట్టి అర్థమవుతోంది. దీనిపై సి.బి.సి.ఐ.డి విచారణకు కూడా ఆదేశించడమైంది. దానిపై ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకుని ముందుకు వెళ్ళవలసిందిగా మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను. అవసరమైతే ఆ విచారణ ఎక్కడిదాకా వచ్చింది? నిందితులు ఎంతమంది ఉన్నారు? వాళ్ళపైన రాష్ట్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో కూడా చెప్పాలి.

పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన నిధులతో వాళ్ళకి సామాజిక భద్రతకోసం, చిరకాల వాంఛ అయినటువంటి ఇళ్ళు కట్టించిపెడతామంటూ ఆ పార్టీ నాయకులు ఆ నిధులను తినేస్తూ, ఒక్కొక్కళ్ళూ అయిదు, పది ఇళ్ళు మంజూరుచేయించుకుంటూ పెద్ద పెద్ద భవనాలు కట్టుకున్నవాళ్ళు కూడా ఉన్నారు. రికార్డుల్లోనేమో ఇళ్ళపేర్లు ఉంటాయి. అక్కడ క్షేత్రస్థాయికి వెళ్ళి పరిశీలిస్తే ఇళ్ళు కనబడవు. ఇది ఎంతో దారుణమైన పరిస్థితి. మీరేదో యాభైలక్షల ఎకరాలు పంపిణీ చేశామని చెప్తున్నారు. ఇది ఎంత హాస్యాస్పదం. నిజంగా మీరు బడుగు, బలహీనవర్గాలకు యాభైలక్షల ఎకరాలు పంపిణీ చేసిన తరువాత, ఇంకా పంపిణీ చేయడానికి భూమి ఎక్కడుంటుంది? అసలు అవసరమైన లబ్ధిదారులు ఎక్కడుంటారు? అయినా మీరు పంపిణీ చేయలేదు. మీరు మాయచేశారు.

ఈరోజు చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో విశాఖపట్నంలో సుమారు పది లక్షల మందికి ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయడం జరిగింది. ఇది మామూలు విషయంకాదు. బహిరంగంగా, ఎక్కడో చాటుమాటున జరిగింది కాదు. పెద్ద బహిరంగ సభ పెట్టి విశాఖ మహాపట్నంలో ఉండే పేద బడుగు బలహీన వర్గాలవారికందరికీ ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు లేదనకుండా పంపిణీ చేయడం జరిగింది. అటువంటి కార్యక్రమం త్వరలో మన రాజధాని విజయవాడ, గుంటూరు, అనంతపురం, తిరుపతి ప్రాంతాలతోపాటు రాష్ట్రం మొత్తం పట్టణాలనుంచి పల్లెల వరకూ చేపట్టడం జరుగుతుంది. ఈ రాష్ట్రంలోని పేద బడుగు బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే కాకుండా వాళ్ళని పూర్తిస్థాయిలో అభివృద్ధిలోకి తీసుకువచ్చేంతవరకూ కంకణం కట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం పనిచేస్తోంది.

ప్రతి ఒక్క వ్యక్తి ఆనందంగా, చిరునవ్వుతో ఉండాలని చెప్పే మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు రోజుకు 18 గంటలు కష్టపడి పనిచేయడం జరుగుతోంది. ప్రతి కుటుంబానికీ ఒక కొడుకుగా ఉంటానని ఆయన తెలియచేయడం జరిగింది. అందుకనే రాష్ట్రం ఎంతో కష్టాల్లో, నష్టాల్లో ఉండి ఆర్థికలోటులో ఉన్నాకూడా అప్పో, సొప్పో చేసైనా సరే పేద బడుగు బలహీన వర్గాలను ఆదుకోవాలనే లక్ష్యంతో ఈ తెలుగుదేశం ప్రభుత్వం ముందుకు వెళ్తోంటే జన్మభూమి కమిటీల గురించి వీళ్లు విమర్శిస్తారు. జన్మభూమి కమిటీలు ప్రభుత్వానికీ, ప్రజలకీ వారధిలాగా పనిచేస్తున్నాయి. మీ ఇందిరమ్మ కమిటీలలాగా ఉండి పెన్షన్‌లు తినెయ్యడం, ఇళ్ళు దోచెయ్యడం, అవినీతి కార్యక్రమాలు చేయడం జరగలేదు. ఈరోజున జన్మభూమి కమిటీలను గురించి ప్రశ్నించే నైతిక అర్హత, హక్కు మీకు ఎక్కడుంది?

మీ హయాములో ఇందిరమ్మ కమిటీలను ఎందుకు పెట్టారు. ఆరోజున ఇందిరమ్మ కమిటీలో స్థానిక నాయకత్వం సర్పంచ్‌లు కానీ, ఎంపిటిసిలు కానీ ఎవ్వరూ లేరు. శాసనసభ్యులు ఒక నలుగుర్ని నియమించుకునేవారు. వాళ్ళే పెన్షన్‌లు పంపిణీ చేసేవారు. ఈరోజు జన్మభూమి కమిటీలకు అధ్యక్షులుగా సర్పంచ్‌లు, సభ్యులుగా స్థానిక ఎం.పి.టి.సిలు ఉన్నారు. వీరంతా ఎక్కడా తప్పుచేయకుండా ఉన్నారు.

గతంలో ఇందిరమ్మ కమిటీల్లో సర్పంచ్‌లు, ఎం.పి.టి.సిలు లేరు. ఇందిరమ్మ గ్రామ కమిటీలో పైన వేదికమీద వాళ్ళ కార్యకర్తలు కూర్చుంటే సర్పంచ్, ఎం.పి.టిసి నేల మీద కూర్చునేవారు. ఇవాళ జన్మభూమి గ్రామసభలు సర్పంచ్ అధ్యక్షతన జరుగుతున్నాయి. ఎం.పి.టి.సి, జడ్.పి.టి.సిలు వేదికమీద కూర్చుంటున్నారు. కౌన్సిలర్ అధ్యక్షత వహిస్తున్నారు. కానీ, మీరు సర్పంచ్‌లను, ఎం.పి.టి.సిలను నేలమీద కూర్చోబెడుతున్నారు. అదీ ఇందిరమ్మ కమిటీలకు, జన్మభూమి కమిటీలకు తేడా. ఈరోజు జన్మభూమి కమిటీల్లో ఉన్నవాళ్ళెక్కడా అవినీతి చేయకుండా మొత్తం పారదర్శకతతో, జవాబుదారీతనంతో ఈ సంక్షేమ కార్యక్రమాలనన్నింటినీ కూడా రాష్ట్ర ప్రభుత్వం నడపడం జరుగుతోంది. That is Chandrababu Naidu garu. అదే మీ వై.యస్ రాజశేఖరరెడ్డి గారు ఒక లక్షకోట్ల రూపాయలు దోచేయ్యడమే కాకుండా కార్యకర్తలకు కూడా లక్షలాది రూపాయలు దోచిపెట్టేయడం జరిగింది. రాష్ట్రం పుట్టి మునిగిపోయింది. వీళ్ళు లెక్కల్లోనేమో లక్షలాది మందికి, వేలాదిమందికి అవీ, ఇవీ ఇచ్చేశామని అంటారు. కానీ ఇవాళ గ్రామలకు వెళ్తున్నప్పుడు ప్రజలు ప్రతి ఒక్కటీ కావాలని అడగడం జరుగుతోంది.

మిస్టర్ ఛైర్మన్: త్వరగా ముగించండి. ఇంకా చాలామంది మాట్లాడాలి.

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: ముగిస్తున్నాను అధ్యక్షా. కనీసం శాసన పరిషత్తులో ప్రశాంతంగా మాట్లాడుకోనివ్వకపోతే ఎలా. చాలా సమయముంది కదా.

MR. CHAIRMAN: Mr. Y.V.B. Rajendra Prasad, you allow others to speak.

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: మీరు ముగించేయమంటే ముగించేస్తాను. థ్యాంక్యూ అధ్యక్షా.

మిస్టర్ ఛైర్మన్: చంద్రశేఖర్‌రావుగారూ మాట్లాడండి. మాట్లాడాల్సినవాళ్ళు చాలామంది ఉన్నారు కాబట్టి ఒక్క పదినిమిషాలే మాట్లాడండి.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు: అధ్యక్షా, సామాజిక భద్రతా పథకాలు అనే అంశం మీద మాట్లాడేదానికి అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు. దీంట్లో ఆరు రకాల సామాజిక భద్రతా పథకాల గురించి పొందుపరిచారు. వీటితోపాటు గర్భిణీ స్త్రీలకు లేదా బాలింతలకు ప్రభుత్వం కొన్ని సామాజిక భద్రతా పథకాలు ఏర్పాటు చేయాల్సిన సామాజిక అవసరం మరింతగా ఉంది. దానికి సంబంధించి కూడా బడ్జెట్ ప్రసంగం రూపొందినప్పుడుకానీ, లేదా ఇతరత్రా పద్దుల విషయం చర్చించేటప్పుడు కానీ ఆ విషయం మీద కూడా ఆలోచిస్తున్నామని ప్రభుత్వం వారు చెప్పారు. దాని ప్రస్తావన దీంట్లో లేకపోవడం ఒక సీరియస్ బలహీనతగా నేను భావిస్తున్నాను.

మ. 12.50

రెండవ అంశం ఏమంటే, చంద్రన్న బీమా పథకం గురించి ఈ ప్రభుత్వం చాలా విస్తృతంగా ప్రచారం చేసింది. దాదాపు 2 కోట్ల మంది చంద్రన్న బీమా పథకంలో సభ్యులుగా చేరారని మన కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి గారు ప్రకటించడం జరిగింది. దానికి సంబంధించిన వివరాలు కూడా ఇక్కడ ప్రస్తావించకపోవడం, ఆ దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వాటికి సంబంధించిన వివరణలు లేకపోవడం చాలా బాధాకరమైన అంశం. మొత్తం సామాజిక భద్రతా పథకాలకు సంబంధించిన విషయాలలో వాటిని మినహాయించడం, ఈ పరిధిలోకి రాకపోవడమనేది నేను అన్యాయంగా భావిస్తున్నాను.

తరువాత ఈ పథకాల విషయానికి వస్తే, వికలాంగులకు సంబంధించి సామాజిక లెక్కలు వేసుకున్న నేపథ్యంలో ఇవన్నీ 2011 జనాభా లెక్కల ప్రాతిపదిక మీద ప్రభుత్వం వేస్తున్న అంచనాలుగా నేను భావిస్తున్నాను. ఇప్పుడు దాదాపు 6 సంవత్సరాలు జనాభా గణన జరిగిన తరువాత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో

లేటెస్ట్‌గా ఉండే జనాభా ప్రాతిపదికన చూసుకున్నట్లయితే వీటిని ఎప్పటికప్పుడు ప్రతీ సంవత్సరం రివైజ్ చేయాల్సిన అవసరం ఉంటుంది. Nuclear family system వచ్చిన తరువాత వృద్ధులకు, వికలాంగులకు సంబంధించిన వాటిమీద మనం గణన చేయాల్సిన అవసరం ఉంది. మొత్తంమీద వృద్ధాప్యానికి సంబంధించిన అంశం గాని, రాయలసీమ, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలలో పేదలు వలసలు పోవడమనేది సర్వ సాధారణమైన అంశం. కొన్ని గ్రామాలలో మనం చూసినట్లయితే, నూటికి యాభై శాతం ఇళ్లు తాళాలు వేసి ఉంటున్నాయి. మిగిలిన కొన్ని ఇళ్లలో ముసలివాళ్లు, మరీ చిన్న పిల్లలు మాత్రమే ఉంటున్న పరిస్థితి ఉంటున్నది. అలా వలసలు వెళ్లిపోయిన వారు నాలుగైదు నెలలు ఇతర రాష్ట్రాలలో ఉంటున్న నేపథ్యంలో వారు ఆ నాలుగు నెలలు ఉపాధి కోల్పోవడమే కాకుండా, తిరిగి వచ్చిన తరువాత మరలా నమోదు చేయించుకునే ప్రక్రియ చాలా క్లిష్టతరంగాను, అసాధ్యమైన పరిస్థితులలోనూ ఉన్నది. దీనికి సంబంధించి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ సంవత్సరం చేనేత కార్మికులకు సంబంధించి ప్రభుత్వం 25,000 మందికి పెన్షన్ ఇస్తున్నది. నేను మనవి చేసేదేమంటే, కేవలం మగ్గం మీద పనిచేస్తుండే వాళ్లు మాత్రమే ఈ చేనేత కార్మికులు అంటున్నారు. నూలు వడికే దగ్గర నుంచి, రాట్నం లాగేటప్పుడు కుటుంబంలో ఉండే వాళ్లందరూ కూడా దానిలో భాగస్వాములు అవుతారు, కాబట్టి వారికి అందరికీ కుటుంబానికి ఒకే పెన్షన్ అనేటటువంటిదో, ఆ రకమైన పద్ధతులలో చూసినప్పుడు కొంతమంది మినహాయించబడుతున్నారు.

కల్లు గీత కార్మికులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కల్లు గీత కార్మికులంటే చెట్టు ఎక్కి కల్లు తీసి కల్లు దింపేవాడే కల్లు గీత కార్మికుడు కాదు. అక్కడ కల్లు కాంపౌండ్‌కు వచ్చి అమ్మేవాడు, కల్లుని ట్రాన్స్‌ఫర్ చేసే వారు, రవాణా చేసే వారిని కూడా ఈ కేటగిరీలోకి చేర్చి వారికి ఈ ప్రయోజనాలు అందేలా చేయాల్సిన అవసరం ఉందని నేను అభిప్రాయపడుతున్నాను.

అలాగే, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సంబంధించి 39,348 మందికి మాత్రమే పెన్షన్ ఇస్తున్నారు. కానీ, మన రాష్ట్రంలో ముఖ్యంగా పశ్చిమగోదావరి, ప్రకాశం, గుంటూరు నేషనల్ హైవే ఉండే పద్ధతులలో ఎయిడ్స్ వ్యాధి చాలా భయంకరంగా వ్యాప్తి చెందిన ఘటన ఉంది. ప్రభుత్వాలు గతంలో కూడా తక్షణ చర్యలు తీసుకోవడం వలన దాని యొక్క వ్యాప్తిని కొంతవరకు నిరోధించగలిగాము గాని, దాని సంఖ్య 39,000 కంటే ఎక్కువగానే ఉన్నది. వారందర్నీ ఐడెంటిఫై చేయాలి. సోషల్ స్టిగ్మా అనేది ఉండి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు అని సమాజంలో తెలిస్తే వారికి ఒక వివక్షత వస్తుందని దీనిలోకి రావడం లేదు, రాకపోవడం వలన దాని వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వానికి, స్కీములకు కష్టం అవుతోంది. కాబట్టి, ప్రతీవారిని గుర్తించి, వారికి ఈ బెనిఫిట్ ఎక్స్‌టెండ్ చేసి ఎయిడ్స్‌ను నిరోధించాలి. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు వారి శరీరంలో ఎయిడ్స్ కణాల కౌంట్ పెరగకుండా ఉండేందుకు మందులు రెగ్యులర్‌గా వేసుకోవాలి. కానీ, మన జిల్లాలలో ఉండే ఏ.ఆర్.టి. సెంటర్లలో మెడిసిన్లు రెగ్యులర్‌గా సరఫరా చేయాలి. ప్రతీ నెల వ్యాధిగ్రస్తుల సి.డి.4 కౌంట్‌ను బట్టి వారికి ఇచ్చే మందుల డోసేజ్‌ను పెంచే ప్రక్రియలో ప్రభుత్వం చాలా వెనుకబడి ఉంది. 3,4 నెలల క్రితం నేను ఈ విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ గారి దృష్టికి తీసుకుని వెళ్లాను. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఎయిడ్స్ కిట్‌ను నాగపూర్ నుండి పర్చేజ్ చేసేవాళ్లం. మన రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం మాత్రమే పర్చేజ్ చేస్తున్నది. మనకు కావాల్సిన సప్లైస్‌ను తీసుకోవడంలో, డిస్ట్రిబ్యూట్ చేయడంలో వెనుకబడి ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావడం జరిగింది. అప్పుడు కొన్ని చర్యలు తీసుకున్నారు. కొంతమేరకు వచ్చింది, కానీ అప్పుడప్పుడు డ్రాప్ అవుతున్నది. దానికి రెగ్యులర్‌గా కంటిన్యుటీ రాకపోవడం వలన ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులుగా ఉన్నవారికి పింఛన్లు ఎక్స్‌టెండ్ చేయడంలో అందర్నీ ఐడెంటిఫై చేయడంలో ఫెయిల్ అవుతున్నారు. ఐడెంటిఫై చేసిన తరువాత కూడా వారికి ఇచ్చే కిట్‌లు, రెగ్యులర్ మెడిసిన్లు, కౌంట్ టెస్ట్ చేయడం వంటి ప్రక్రియ చాలా వీక్‌గా ఉంది. అందువలన, ఎయిడ్స్ వ్యాధిని

నిరోధించడంలో ప్రపంచంలో అనేక దేశాలు చాలా అడ్వాన్స్ అయ్యాయి. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా గత ప్రభుత్వం, ఇప్పటి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ దాని అమలు యంత్రాంగంలో చాలా బలహీనతలు ఉన్నాయని నేను మనవి చేస్తున్నాను.

గర్భిణీ స్త్రీలకు సంబంధించి ప్రసవం పూర్తయిన మరుక్షణమే వారిని ఈ సామాజిక భద్రతా పథకాలలో చేర్చాల్సిన అవసరం ఉంది. ఎంతమంది మహిళలు ప్రసవిస్తున్నారు, ఎంతమంది గర్భిణీలుగా ఉన్నారు, ఎంతమందికి రక్తహీనత ఉంది, ఎంతమందికి పోషకాహార బలహీనత ఉన్నది అనేది గతంలో మనకున్న టెక్నాలజీ సహాయంతో ఈజీగా గుర్తించవచ్చు. వారు గర్భవతులు అయిన వెంటనే ఆశా కార్మికుల ద్వారా గాని, అంగన్ వాడీ కార్మికుల ద్వారా గాని వివరాలు సేకరించి ప్రతీ డెలివరీలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతీ 1000 డెలివరీలలో మరణాల సంఖ్యను 18 కంటే తక్కువగా ఉండేలా చూడాలని ప్రభుత్వం ఒక టార్గెట్ పెట్టుకున్నది. కానీ, ఆ టార్గెట్ ఇప్పుడు భయంకరమైన స్థాయిలో ఉంది.

మ.1.00

అధ్యక్షా, దక్షిణాది రాష్ట్రాలలో అత్యధికంగా మన ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రసవ సమయంలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉన్నది. ఆ మరణాలను తగ్గించాల్సిన సామాజిక బాధ్యత, కర్తవ్యం మన ప్రభుత్వం మీద ఉన్నది. అందుచేత, దీనిని వెంటనే సామాజిక భద్రతా పథకాలలోకి తీసుకువచ్చి, వారియొక్క న్యూట్రీషనల్ కెపాసిటీలను, IMR,MMR మరణాల రేటుని తగ్గించాల్సిన అవసరం ఉంటుంది. మనం ఈజ్ ఆఫ్ డూయింగ్ అని, అన్నింటిలో నెం.1 అని, అదని ఇదని ఎన్ని చెప్పుకున్నా కూడా, ఎంతమంది పిల్లలు ఐదు సంవత్సరాలలోపు మరణిస్తున్నారని చూసుకున్నట్లయితే, మనం తలదించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఎంతమంది తల్లులు రక్తహీనతతో ప్రసవించలేక మరణిస్తున్నారనే విషయానికి వస్తే, మనం బాధ పడాల్సి వస్తుంది. మానవాభివృద్ధి సూచికల్లో ఆంధ్రప్రదేశ్ యొక్క గ్రాఫుని చూస్తే, గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం అనే అంశం కాకుండా, దీని ప్రాధాన్యతలను తెలుసుకోవడంలో, కేటాయింపులు చేయడంలో, వీటిని అమలు చేసే ప్రక్రియలో, టెక్నాలజీని ఉపయోగించుకోవడంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అయినప్పటికీ ఈ విషయంలో వారు ఇంకా వెనుకబడి ఉన్నారని చెప్పక తప్పదు. ఈ ప్రభుత్వాన్ని నేను కోరేదేమంటే, సామాజిక భద్రతా పథకాలలో అత్యంత కీలకమైనటువంటి, ప్రాథమికమైనటువంటి గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలకు సంబంధించిన అంశాలను చేర్చి దానిమీద ప్రత్యేకమైన దృష్టిని పెట్టకపోతే, ఏఏ రంగాలలో మనం ఎంత అభివృద్ధి చేశామని ప్రచారం చేసినా, అవన్నీ కూడా దిష్టిబొమ్మలలాగే ఉండాల్సి ఉంటుంది.

అధ్యక్షా, నేను చివరిగా మనవి చేస్తున్నదేమంటే, ఈరోజు చంద్రన్న బీమా పథకంలో సుమారు రెండుకోట్ల వరకు అసంఘటిత రంగ కార్మికులు చేరారని చెబుతున్నారు. రెండుకోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉంటే, వారికి ఇస్తున్న సామాజిక భద్రత అంటే వారు మరణించినప్పుడు అది కూడా వారు పనిచేస్తూ మరణించినప్పుడు, లేదా ప్రమాదవశాత్తు మరణించినప్పుడు వారికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వడం జరిగింది. సహజమరణానికి అయితే ముప్పైవేలు ఇవ్వడం జరుగుతోంది. దీనివల్ల వారికి వచ్చే ప్రయోజనం ఏమీ లేదు. దీనికి సంబంధించిన బడ్జెటు కేటాయింపులు కానీ, లేదా వాటి వివరణ ఇవ్వడంలో కానీ, ఆరోగ్యానికి సంబంధించి వారి ట్రీట్‌మెంట్‌కి అయ్యే ఖర్చులు భరించే విషయంలో కానీ, లేదా ఆ ఫ్యామిలీకి సంబంధించిన వ్యక్తి ఇబ్బంది పడుతున్నప్పుడు, అటువంటి పరిస్థితులలో ఇబ్బందుల నుండి ఆ కుటుంబాన్ని బయట పడేయడానికి కావాల్సినది చేయడానికి, ఇది బీమా పథకం కాబట్టి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది, ఆ ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది. దురదృష్టకరమైన అంశమేమంటే, దీనికి సంబంధించిన ప్రీమియంను ఈ నిర్మాణ రంగానికి సంబంధించిన సెస్ ఏదైతే ప్రభుత్వం కలెక్ట్ చేస్తుందో, 2% of the cost of the bill కి సంబంధించి, నిర్మాణ రంగంలో పనిచేసే

కార్మికుల కోసం ఏర్పడిన చట్టం ప్రకారం ప్రభుత్వానికి వచ్చిన రూ.1200కోట్ల రూపాయలలో, రూ.270కోట్లు తీసి దీనికి ఇన్స్యూరెన్స్ కట్టడం జరిగింది తప్ప, దీనిలో ప్రభుత్వం చేసిందేమీ లేదు. నేను చెప్పేదేమంటే, నిజంగానే సామాజిక భద్రతా పథకం అనేది మనం ఆచరణలో పెట్టాలంటే, ఉత్పత్తి రంగంలో క్రియాశీలకమైన పాత్రని పోషిస్తూ, మన జిడిపిలో దాదాపు 25 నుంచి 30శాతం కంట్రిబ్యూట్ చేస్తూ, ఈ అసంఘటిత రంగంలో ఉన్న కార్మిక వర్గానికి సంబంధించిన అంశాలలో వారి ఆరోగ్యము, వారి ఉత్పాదకత, వృద్ధాప్యము మొదలైన అంశాలన్నింటి మీద ప్రభుత్వం క్లోజ్ స్టడీ చేయాల్సిన అవసరముంది. దానికి బడ్జెటు కేటాయింపులు కూడా చేయాలి. ఈ అంశాలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఈ పత్రంలో ఏ విధమైన సమాచారం లేదు. అంటే, వారు సామాజిక భద్రతా పథకంలోకి రారా, లేక వారిని సామాజిక భద్రత అంశాలలో కలపాల్సిన విషయంలో ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదా? అనే విషయాలు మాకైతే తెలియదు. కానీ, నేను కోరుతున్నదేమంటే గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు వాళ్లకు సంబంధించి వారి భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలు అతిముఖ్యమైనవిగా ప్రభుత్వం గుర్తించి, వారిని కూడా సాంఘిక భద్రతా పథకంలో కలుపవలసి ఉంటుంది. దానికి ప్రత్యేక గుర్తింపునిచ్చి, కేటాయింపులు చేసి, టెక్నాలజీని ఉపయోగించి ఎఫెక్టివ్‌గా పని చేయాలని కోరుతూ మీరు ఇచ్చిన ఈ అవకాశానికి మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు: అధ్యక్షా, నాకు ఈ అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు. ఈరోజు లఘుచర్చలో సాంఘిక భద్రతా పథకాలనే అంశాన్ని తీసుకుంటే, ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వమైనా రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. సోషల్ జస్టిస్‌ని ఏ ప్రభుత్వమైనా ప్రాథమిక బాధ్యతగా తీసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. మొట్టమొదటిసారిగా శ్రేయో రాజ్యం అనే కాన్సెప్టుని అన్న నందమూరి తారకరామారావు గారు తీసుకువచ్చి, సంక్షేమ పథకాల్ని ఎక్కువగా ఈ రాష్ట్రంలో ప్రారంభించింది ఆయనైతే, ఇవాళ మన గౌరవముఖ్యమంత్రి శ్రీనారా చంద్రబాబునాయుడు గారు ఒక పేదరికంలేని సమాజాన్ని సృష్టించాలని, హ్యాపినెస్ ఇండెక్స్‌ని ఒక డెవలప్‌మెంట్ ఇండెక్స్‌గా పెట్టుకుని ఆవిధంగా ముందుకు వెళుతున్నారు. ఒక మిషన్‌బేస్డ్ అప్రోచ్ ద్వారా ప్రజలకు అన్ని విధాలా సెక్యూరిటీ ఇవ్వాలనే ఆలోచనతో, ఎన్.టి.ఆర్.భరోసా దగ్గర నుంచి ఎన్నో వెల్ఫేర్ కాన్సెప్టులు అమలు చేస్తున్నారు. ఆ వెల్ఫేర్ కాన్సెప్టులు కూడా ఎంతో ట్రాన్స్‌పరెన్సీగా ఉన్నాయని గౌరవ సభ్యులే చెప్పారు. ఇంత వరకూ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ కూడా సి.ఎం డ్యాష్ బోర్డు అనేది లేదు. మన ముఖ్యమంత్రిగారు సి.ఎం డ్యాష్ బోర్డు అనేది పెట్టి ప్రజలందరికీ కూడా, ఈ ప్రభుత్వం ఎంత ట్రాన్స్‌పరెంట్‌గా పనిచేస్తుందనేది తెలియజేస్తున్నారు. గౌరవ ప్రతిపక్ష సభ్యులు చెప్పినట్లు ఇప్పుడది 93%కి వచ్చింది. ఆ 7% ఎందుకు తగ్గిందంటే, దానిలో కొంతమంది లేకపోవడం వల్ల, ఎక్స్‌పైర్ అయితే వారికి మళ్లా రివైవ్ చేయడం కానీ ఉంటాయి కాబట్టి, అంత ట్రాన్స్‌పరెంట్‌గా ఉందని సభలోని సభ్యులు ఒప్పుకుంటున్నారు. ఈ రోజు ప్రభుత్వం ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో ఇలా ఎన్నో పథకాలు తీసుకువచ్చి సాంఘిక భద్రత అంటే సాంఘికాభివృద్ధే కాకుండా ఈ ప్రభుత్వం నాకోసం ఉంది అని ప్రతి పౌరుడు కూడా అనుకునే విధంగా పని చేస్తోంది. మన రాజ్యాంగంలో ఉన్న లెజిస్లేచర్ కానీ, ఎగ్జిక్యూటివ్‌గానీ, జ్యుడీషియరీ గానీ it is the fundamental duty of these organisations to uphold the social justice. అందుచేత, ఈ రోజు అన్ని సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకి విలువలను జోడిస్తూ, వాటిని బలోపేతం చేస్తున్నాము. బలోపేతం చేయడమే కాక ఆ సమస్యలకు పరిష్కార మార్గాలను అమలు చేసి, ప్రతి ఒక్క మనిషికి అభివృద్ధి ఫలాలు, సంక్షేమ ఫలాలు అందేలా చేయడమే ప్రాథమిక విధిగా పెట్టుకుని పని చేస్తున్నాము. అందుచేత ఆ విధంగా haves and have-nots, వీళ్ల మధ్య ఉన్న గ్యాప్‌ని తగ్గించి, ఒక ఇగాలిటేరియన్ సొసైటీని క్రియేట్ చేసి ఈ రాష్ట్రంలో ప్రతి ఒక్క పౌరుడిలో కూడా ఈ ముఖ్యమంత్రి నాకోసం ఉన్నారనే భావనను తీసుకురావడానికి ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుని పనిచేస్తుంది.

ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు చాలా ఉన్నాయి.  చంద్రన్న బీమా లాంటి సంక్షేమ పథకాలు ఇంతవరకు ఎప్పుడూ ఏ ప్రభుత్వం కూడా ఇవ్వలేదు. వారి కుటుంబీకులు చనిపోయినప్పుడు, ఇరవైనాలుగు గంటలలో చంద్రన్న బీమా కింద డబ్బు వస్తుండడంతో వారి వారి కుటుంబాలకు  కొంత ఉపశమనం కలుగచేసినట్లుగా ఉంటుంది.  ఇవన్నీ కూడా ఇంతకుముందెప్పుడూ జరుగలేదు.  విద్యార్థుల్ని కూడా ఈరోజు ఓవర్‌సీస్‌కి పంపించి ఉన్నత విద్యకు పంపిస్తున్నారు.  ఇలా చెప్పాలంటే చాలా ఉన్నాయి. ఈరోజు ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న పథకాలు ఎప్పుడూ, ఎవరూ కూడా ప్రవేశ పెట్టలేదనేది నిజం.  సభ్యులు, ఒకసారి గ్రామాలలోకి వచ్చి చూస్తే తెలుస్తుంది.  మొన్న ప్రవేశపెట్టిన బడ్జెటులో కూడా సుమారు రూ.24,000 కోట్లు ప్రజల సంక్షేమం కోసం  కేటాయించడం జరిగింది.  మన ముఖ్యమంత్రి గారి నాయకత్వాన్ని ప్రజలు అంగీకరించి ఆనందంగా ముందుకు వెళుతున్నారు.

మ. 01.10

అధ్యక్షా, ఈ విషయంలో ఒకసారి చూసుకుంటే, ఈ రోజున సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అని, సామాజిక వికాసమని, కుటుంబ వికాసమని, రెండు రకాల అవకాశాలను పెట్టి, అన్ని రకాలుగా కూడా సెక్యూరిటీ ఇవ్వడానికి ఈ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను చేస్తుంది. సాంఘిక భద్రత ఏదైతే ఉందో, దానిని చేయడంలో ముఖ్యమంత్రి గారిని అభినందిస్తూ నాకు మాట్లాడడానికి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు:   అధ్యక్షా, ఈ సామాజిక భద్రత పథకాలలో మనకు వృద్ధాప్య, వితంతు, వికలాంగులు మొదలైన వారికి రకరకాల పెన్షన్లను ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ, అందులో కళాకారులు కూడా చాలా కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. వారికి కూడా పెన్షన్లు ఇస్తున్నారు.  వారు కూడా ఈ సామాజిక భద్రత అనే అంశంలో చేరలేదు. ఈ కళాకారులకు కూడా ఈ పెన్షన్లు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఎందుకంటే, వారు వయస్సులో ఉన్నప్పుడు కష్టాలలో ఉన్న ఎంతోమందికి వారు తమ కళల ద్వారా ఆనందాన్ని అందించారు. ఈ కళాకారులు వృద్ధాప్యంలోకి వచ్చినప్పుడు మాత్రం వారికి సంబంధించి ఎటువంటి సహాయం కూడా అందడం లేదు.  దయచేసి ఈ కళాకారులను కూడా సామాజిక భద్రత పథకాలలో భాగంగా వారిని కూడా చేర్చి, పూర్తిస్థాయిలో పెన్షన్ అందేటట్లుగా ఈ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

అధ్యక్షా, ఈ పెన్షన్లు ఇచ్చే విధానం చూసుకుంటే, గతంలో కంటే, ఇప్పుడు ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారిని ప్రజలందరూ కుటుంబ పెద్దగా భావిస్తున్నారు.  చాలా తక్కువ స్థాయి నుంచి దాదాపు 10 రెట్లుగా వారి వారి పరిస్థితులను బట్టి పెన్షన్లను ఇస్తున్నారు.  అలాగే, చంద్రన్న బీమా పథకం ద్వారా ఎంతోమందికి తోడ్పాటును అందిస్తున్నారు. అలాగే, ఎవరైనా కుటుంబంలో వ్యక్తి చనిపోతే, బాధలో ఉన్న ఆ పేద  కుటుంబానికి చనిపోయిన వారి యొక్క కర్మకాండలను ఎలా చేయాలనే తరుణంలోను, సహజ మరణాన్ని తట్టుకునే బాధలో ఆ కుటుంబ సభ్యులు ఉన్నప్పుడు ప్రభుత్వం రూ.30,000లను ఆ బాధిత కుటుంబానికి అందించే విధంగా చర్యలు తీసుకుంటోంది. అందులో రూ.5,000లను తక్షణమే అందించి, మిగిలిన సొమ్మును వారం రోజుల లోపు అందించే ఏర్పాట్లు చేస్తోంది. తద్వారా మొదట ఇచ్చిన రూ.5,000లతో దహన సంస్కారాలు చేసుకుంటున్నారు.  11వ రోజుకల్లా మిగిలిన రూ.25,000లు రావడంతో, చనిపోయిన వ్యక్తి పేరు మీద మిగిలిన కర్మకాండలను చేసుకుంటున్నారు. కాబట్టి, ఆ రకంగా వారికి కష్టంలో కుటుంబ పెద్దగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఆదుకుంటున్నారని ప్రజలందరూ చెపుతున్నారు.  ఇది యదార్థం.

అధ్యక్షా, ఇక బాలబాలికలకు సంబంధించి చూసినట్లయితే, వారికి కూడా సామాజిక భద్రత క్రింద కొన్ని అంశాలను మనం పరిగణనలోకి తీసుకోవాలి. బడిఈడు గల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోను, కార్పోరేటు, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. మూడు రకాలుగా చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల ఐక్యూ రేట్లను తీసుకుంటే, విద్యాపరంగా రేషియోలో తేడా ఉంటుంది కానీ, సామాజిక పరంగా చూసుకుంటే, చాలా వెనుకబాటుతనం ఈ కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనబడుతోంది. బాలబాలికలలో తీసుకున్నట్లయితే, వారికి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడం వల్ల వారు చిన్నవయస్సులోనే ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి వెళుతున్నారు. ఈ ప్రభుత్వం ప్రత్యేకంగా వారి గురించి కూడా ఒక ఆలోచన చేసి, ఆ పిల్లలకు కార్పోరేటు, ప్రైవేటు పాఠశాలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివేటట్లుగా చర్యలు తీసుకోవాలి. అలాగే, 14 సంవత్సరముల వయస్సు గల విద్యార్థినీ విద్యార్థులకు కూడా ఆరోగ్యపరమైన విషయాలలోను, సామాజిక పరంగా అర్థం చేసుకునే విషయాలలో కానీ, లేక తరగతి గదులలోనే వారి బాల్యం అంతమయిపోయే విధంగా కాకుండా, ఆటపాటలందు, సామాజిక కార్యక్రమములయందు వారిని ప్రోత్సహించే విధంగా ఒక కార్యక్రమాన్ని తీసుకున్నట్లయితే బావుంటుంది. ఎందుకంటే, ఆ చిన్నారులు రేపు సమాజంలో పెద్దవారు అయ్యి, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడానికి మరింత అవకాశం ఉంటుందని కూడా ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను.

పెన్షన్లు ఇచ్చేటప్పుడు కూడా కుటుంబంలోని ఒక వ్యక్తికి పెన్షను వస్తున్నట్లయితే, అదే కుటుంబంలో మరొకరికి పెన్షను రావడానికి ఆటంకం ఉందని నా దృష్టికి వచ్చింది. అదే కనుక నిజమయినట్లయితే, ఒక కుటుంబంలోని వ్యక్తులకున్నటువంటి కష్టం చూడాలి తప్ప, ఒక కుటుంబంలోని వ్యక్తికి వృద్ధాప్య పింఛను వస్తుంది కావున, వికలాంగులకు ఇవ్వమని అంటున్నారు. అలాగే, వికలాంగులకు పింఛను వస్తే, ఎయిడ్స్ ఉన్న వారికి పింఛను ఇవ్వమని అంటున్నారు. ఆ విధంగా చేయడం వలన వారి కష్టాన్ని వచ్చే ఒక్క పింఛను కూడా కాపాడలేకపోతోంది. ఈ పెన్షన్ అనేది వ్యక్తి పరంగా చూడాలి తప్ప, కుటుంబ పరంగా చూడకూడదని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఇన్ని కార్యక్రమాలను ప్రభుత్వం చేస్తున్నప్పుడు ఆ ఒక్క అంశంలో వారిని ఇబ్బంది పెట్టకూడదని నా భావన. నేను చెప్పిన క్యాటగిరీలలో ఎవరికి అర్హత ఉంటే, వారికి పింఛన్లు వచ్చేటట్లుగా తగిన ఏర్పాట్లు చేయాలని తమ ద్వారా ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదేవిధంగా, పెన్షన్లలో కూడా చాలా మందికి సరిగ్గా రావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. గౌరవ ముఖ్యమంత్రి గారు మాత్రం అర్హత ఉన్న వారందరికీ కూడా పింఛన్లను అందించమని చెపుతున్నారు. కానీ, పెన్షన్లు మాత్రం సక్రమంగా రావడం లేదనే మాటలుకూడా వినిపిస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి అందరికీ పింఛన్లు అందించాలని చెపుతుంటే, ప్రజలు పింఛన్లు రావడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారు. కాబట్టి, ఈ రెండింటి మధ్యన సమన్వయమనేది అవసరం కాబట్టి, దానిని ఒక వ్యవస్థ ద్వారా సరిదిద్ది అర్హత గల వారందరికీ పింఛన్లు వచ్చేటట్లుగా తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే, ముఖ్యమంత్రిగారు చెప్పిన మాటే జీవో లాంటిది. కాబట్టి, వారి మాట ప్రకారం అర్హతగల వారందరికీ పెన్షన్లు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, మన సభలో ఆర్థిక శాఖా మంత్రిగారు బడ్జెటును ప్రవేశపెట్టారు. ఈ సామాజిక భద్రతలో భాగంగానే వృద్ధులు ఎటూ కదలలేక, పిల్లలు దూరంగా ఉండడం వలన వీరు ఏ పనులు చేసుకోలేకపోతున్నారు. వారందరి కోసం మూడు ప్రాంతాలలో ఈ ఓల్డేజి హోమ్స్‌ను ఏర్పాటు చేయాలని తమ ద్వారా కోరుతున్నాను. అది కేవలం 3 జిల్లాలలోనే కాకుండా, 13 జిల్లాలలో కూడా పెట్టి, వారి సంక్షేమానికి తోడ్పడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. అది ఒక దశలో సమాజానికి సేవ చేసి, వృద్ధాప్యంలో వడిలిపోయిన వారికి ఎటువంటి బాధలు లేకుండా ఇందులో కార్యక్రమాలు చేయడానికి, ఒక రక్షణ, భద్రత కల్పించడానికి అవకాశం ఉంటుందని తమ ద్వారా ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈ సామాజిక భద్రతలో భాగంగానే, అన్నా క్యాంటీన్లను ప్రారంభించి, తక్కువ ధరకే ఆహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. దానిని కూడా అన్ని ప్రాంతాలలో విస్తరించేలా తగిన చర్యలు తీసుకోవాలి. గిరిజన స్థాయిలలో కూడా ఆ పథకాన్ని విస్తరించేలా చేసి, పేదవారికి కూడా అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి. దానికి కావాలంటే టిటిడి వారి ఆధ్వర్యంలో తీసుకున్నట్లయితే, అది సామాజిక భద్రతలో బాధ్యతగా ఉంటుంది. ఎందుకంటే, ఎక్కువ నిధులు అక్కడ ఉన్నాయి కాబట్టి, ప్రభుత్వ పరంగా కొంత వెసులుబాటు ఉంటుందని తమ ద్వారా ప్రభుత్వానికి మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఇక్కడే ఆర్థిక మంత్రిగారు ఉన్నారు. సామాజిక భద్రతలో భాగంగానే చాలామంది ప్రజలు వారికి తెలియకుండానే ఈ చీటీ పాటలనీ, దుర్వ్యసనాలని, వడ్డీలకు తీసుకోవడమనేది వారికి తెలియకుండానే ఈ చట్రంలో ఇరుక్కుపోయి బయట పడలేక ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి, వారి ఆస్తిపాస్తులు అమ్ముకునే స్థాయికి చేరుకున్నారు. అవే కాకుండా, నెట్ ద్వారా కూడా చాలా గేమ్స్ వస్తున్నాయి. అవి కూడా అంటే, పేకాట, రమ్మీ మొదలైన ఆటలు ప్రజలను చాలా దారుణంగా మోసం చేసే విధంగా వస్తున్నాయి. అవి ఆటోమేటిక్‌గా ఆన్ ఆయిపోయి, డబ్బులు పోయే పరిస్థితి వస్తోంది. కాబట్టి, సామాన్య ప్రజలు, అమాయకులు దానికి బలైపోకుండా ఉండేటట్లుగా తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, సెల్‌ఫోన్లు వాడేటప్పుడు కూడా బిల్లులు ఏ విధంగా వస్తున్నాయో తెలియడం లేదు. అందులో కూడా చాలా మోసం వస్తోంది. మన సెల్‌ఫోన్‌కు వెంటనే మీరు ఒక ప్యాకేజీలోకి రమ్మని మెసేజ్ వస్తుంది. మనం ఒకసారి ఆ మెసేజ్ చూద్దామని ఆన్ చేస్తే బిల్లు పడిపోతుంది. తద్వారా పాత ప్యాకేజి పోయి, క్రొత్త ప్యాకేజి వస్తుంది. ఒక నెల ఫోను బిల్లు సుమారు రూ.5,000లు వస్తే నేనే ఆశ్చర్యపోయాను. కాబట్టి ఈ రకంగా కన్జ్యూమర్స్‌కి సంబంధించి చాలా మోసాలు జరుగుతున్నాయి. వాటికి సంబంధించి మోసాలు జరగకుండా ప్రజలకు భద్రత కల్పించాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఇక ఆధార్ కార్డులకు సంబంధించి చూసినట్లయితే, ఎక్కువ వయస్సు ఉన్న వారికి తక్కువ పడడం, తక్కువ వయస్సు ఉన్న వారికి ఎక్కువ పడడం జరుగుతోంది. ఆ వయస్సు గ్రూపుని సరిచేసి, జన్యూన్‌గా ఉన్న వారికి ఎందుకంటే, ఈ ఆధార్ కార్డులను కూడా ట్రాప్ చేసి, తప్పుగా వస్తున్నాయని అన్నారు. దానికి కూడా ఒక సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి, ఆధార్ కార్డులలో తప్పులు ఉన్నటువంటి కుటుంబాలలోని వారి వయస్సులను సరిచేసి, అర్హత గల వారికి లబ్ధి చేకూరేటట్లు చేయాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అంతేగాకుండా, కలెక్టరు కార్యాలయంలో చాలా విషయాల కోసం అనగా-ప్రభుత్వ పథకాలపైన ఎవరికి ఏ సందేహాలు వచ్చినా లేక ప్రభుత్వ సహకారమైనా ఏ రకంగానైనా సమాచారం తెలుసుకోవడానికి ఒక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. సామాన్య ప్రజలను ఎడ్యుకేట్ చేయడం కోసం, కౌన్సిలింగ్ చేయడం కోసం కలెక్టరు ఆఫీసులో ఒక హెల్ప్‌లైన్ పెట్టి, మన ప్రభుత్వ పథకాలపైన అవగాహన కల్పించినట్లయితే తప్పనిసరిగా వాటిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవడానికి మరింత అవకాశం ఉంటుంది. ఎందుకంటే, వారు నష్టపోకుండా, వారికి భద్రత కల్పించే విధంగా ప్రభుత్వానికి కూడా ఒక చక్కటి అవకాశం ఉంటుంది. కాబట్టి, ప్రతి కలెక్టరు కార్యాలయంలో ఒక హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేయాలని తమ ద్వారా ఈ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, టెక్నాలజీ ద్వారా, ఐరిష్ ద్వారా బయోమెట్రిక్ విధానం ద్వారా పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని చోట్ల హిల్‌టాప్ ఏరియాలలో ఉన్నవారికి ఈ సిగ్నల్స్ సరిగ్గా రాకపోవడం వల్ల వారికి సక్రమంగా ఇవ్వలేని పరిస్థితి వస్తోంది. అలాగే, ప్రత్యేక కేటగిరీలకు సంబంధించిన వారికి అనగా

ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్‌గా ఉన్న వారికి ఈ టెక్నాలజీ ఉపయోగపడడం లేదు. వారికోసం కొంచెం వెసులుబాటును కల్పించాలని కోరుతున్నాను.

అధ్యక్షా, మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఏ విధంగా కావాలని కోరుకుంటున్నారో, మన రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితులు ఈ విధంగా ఉన్నప్పటికీ కూడా మనం మైనస్‌లో ఉన్నప్పటికీ, లోటు బడ్జెటులో ఉన్నప్పటికీ పేదవారిని ఆదుకోవాలని, వారికి అండగా ఉండాలనే ఒక సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలను నిర్వహించారు. ముందుగానే వీటన్నింటి గురించి ఆలోచించి, ముందు చూపుతో, 80 శాతం ఆక్యురెన్సీ ఉండాలనే దీక్షతో వారు పని చేస్తున్నందుకు వారినీ, ఈ ప్రభుత్వాన్ని అభినందిస్తూ, నాకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సోము వీర్రాజు (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, ఈ అంశం మీద మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ప్రధానంగా ఈ ఓల్డేజ్ పెన్షన్ల విషయంలో కేంద్రం అన్ని రాష్ట్రాలలో ప్రతి వారికి రూ.1,000లు పెంచమని చెప్పింది. మన రాష్ట్రంలో రూ.200లు ఉంటే, దానిని రూ.1,000లకు పెంచారు. ఇవి అయిన తరువాత తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నటువంటి ఒక మున్సిపాలిటీలో 20 మంది డెత్ సర్టిఫికేట్లు తీసుకుని, వాళ్ళు బ్రతికి బాగానే ఉన్నారు. వారికి ఇంకా కొన్ని బాధ్యతలు కూడా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితులలో డెత్ సర్టిఫికేట్లు తీసుకుని, భార్యను విధవరాలు అని చెప్పి, వారు కూడా వితంతువులని చెప్పి వితంతు పెన్షన్ పొందే అవకాశం వారికి వచ్చింది.

మ. 1.20

అధ్యక్షా, ఆ సంఖ్య 110 అని పెద్దలు చెబుతున్నారు. అలానే రాజమండ్రిలోని రూరల్ మండలంలో ధవళేశ్వరం అనే ఒక పెద్ద గ్రామం ఉంది. ఆ గ్రామంలో కూడా పింఛన్లు ఇచ్చే విషయంలో కూడా చాలా అక్రమాలు జరుగుతున్నాయి. ఇక మూడవ అంశం ఏమిటంటే సహజంగా ఎవరైనా పెద్ద వారికి పింఛన్లు ఇచ్చే సందర్భంలో ప్రతి 3, 4 నెలలకు ఒకసారి పింఛన్ల సంఖ్యను పెంచుతున్నాము. కానీ, ఈ మధ్య కాలంలోనే కొంత మంది వృద్ధులు సహజంగానే మరణిస్తున్నారు. ఎందుకంటే వారి వయస్సు ఎక్కువగా ఉండటం మూలంగా మరణిస్తున్నారు. అలా మరణించిన వారి విషయాలలో ఎక్కువ అవినీతి జరుగుతోంది. అంటే, ఇలాంటి లోటుపాట్ల మీద కొంత అధ్యయనం చేయాలి. అలాగే, అధ్యయనం చేసిన పింఛన్ల విషయంలో ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం వాటికి సంబంధించి ఒక సమగ్రమైనటువంటి విచారణ జరిపించి, మిగిలినవారికి ఎక్కడా అన్యాయం జరగకుండా చూడాలి. మరణించిన వారి పేరు మీద ఉన్న పింఛన్ల విషయంలో పేర్లు తొలగించే ప్రక్రియ మాత్రం చాలా ఆలస్యంగా జరుగుతోంది. అలాగే, ఈ వృద్ధాప్య పింఛన్లు ఏవైతే ఖాళీలు అవుతున్నాయో వాటి స్థానంలో క్రొత్తగా వచ్చే వృద్ధుల పేర్లను జతపరచి, వారికి త్వరగా పింఛన్లు వచ్చే విధంగా అధికారులు తగిన ప్రయత్నం చేసినట్లయితే వారికి మేలు చేకూర్చినట్లు అవుతుంది. ఆ విధంగా తగు చర్యలు తీసుకోవాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, అదేవిధంగా బాలింతలకు సంబంధించి చూసినట్లయితే, రాష్ట్ర ప్రభుత్వం యూనిసెఫ్‌తోటి, ఐసిడిఎస్ అనేటటువంటి పథకాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందరికీ అందేలా తగిన చర్యలు తీసుకోవాలి. మన రాష్ట్రం మొత్తంమీద దాదాపు 55,000 పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాలలో బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు 3 నుండి 9వ నెల వరకు అందించే పౌష్టికాహారాన్ని అందించాలి. ఎందుకంటే, మన కుటుంబంలోని వారిని ఏ విధంగా అయితే, వైద్యుల దగ్గరకి వెళ్లి, చూపించి, మందులు ఏ విధంగా అయితే ఇప్పిస్తామో, ఆ విధంగానే వారికి మందులు ఇవ్వడం కోసం ఒక ఏ.ఎన్.ఎంను, వారిని చెకప్

చేయడం కోసం ఎల్లప్పుడూ ఒక ఆశా వర్కరు పనిచేసే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. అలాగే, వారికి వారానికి 4 కోడిగుడ్లు అంటే నెలకు 16 కోడిగుడ్లు, మంచి నాణ్యమైన కందిపప్పును, నూనె, బియ్యం మొదలైనవన్నీ సక్రమంగా అందజేయవలసిన అవసరం ఉంది. అయితే, అధ్యక్షా, ఈ ఉచితంగా పంపిణీ చేసే ఆహారంలో మాత్రం చాలా చిన్న చిన్న గోళీల వంటి గుడ్లను ఇస్తున్నారు. ఒక్కొక్క గుడ్డుకు సుమారు రూ 4.70 పైసలకి టెండర్లు వేస్తున్నారు. అసలు ఈ టెండర్ల వెనకాల ఎవరున్నారు? ఈ కోడిగుడ్లను ఎవరు సరఫరా చేస్తున్నారు? దాదాపుగా 10 కోట్ల 70 లక్షల కోడిగుడ్లను కొనుగోలు చేస్తున్నారు. గౌరవ సభ్యులు శ్రీ పి.జె.చంద్రశేఖర రావు గారు బాలింతలలో రక్తహీనత ఇంకా ఎక్కువగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఇంకా సక్రమంగా నిర్వర్తించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి. ఇందుకు సంబంధించి ఐసిడిఎస్‌లలో దాదాపుగా 1,25,000 మంది రూ.4,000లు, రూ.6,000ల జీతానికి తాత్కాలికంగా పనిచేస్తున్నారు.

అధ్యక్షా, రాష్ట్రంలో ప్రతి పాఠశాలకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. అక్కడ కేవలం ఒక సూపర్‌వైజర్ మాత్రమే కాకుండా ఒక సిడిపిఓ కూడా ఉంటారు. వారికి ఇంతంత జీతాలు ఇస్తున్నారు. ఈ ఐసిడిఎస్ అనేది కొంతమందికి ఉపాధి హామీ పథకంగా మారిపోయింది. వారి పేర్లు చెప్పడానికి నేను కొద్దిగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాను. ఎందుకంటే, రాబోయే రోజుల్లో ఈ ఐసిడిఎస్‌ని కాన్వెంట్లుగా చేయాలనేటటువంటి ప్రయత్నం చేస్తామని కూడా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చెపుతున్నారు. ఈ ఐసిడిఎస్‌లో ఎవరైతే పేద పిల్లలు అనగా 0.3 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల ఇళ్ళకు ఆహార పదార్థాలను పంపించాలి. అదేవిధంగా, ఆ కుటుంబాలకు కూడా 5 కేజీల బియ్యం, అరకేజీ కందిపప్పు, మంచి నూనె, కోడిగుడ్లు ఇవ్వాలి. చదువుకునే పిల్లలకి, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు కూడా అదే విధంగా ఇవ్వాలి. ఈ విధంగా దాదాపు 30 సంవత్సరాల నుండి ఈ విధానాన్ని అమలు జరుపుతున్నటువంటి పరిస్థితులలో ఇప్పటికీ కూడా రక్తహీనత, మినరల్స్ లేకపోవడం ప్రతి జిల్లాకి ఐసిడిఎస్‌లోని సిడిపిఓలతో మాట్లాడుతుంటే, సార్ కోడిగుడ్లు మేము ఇవ్వలేకపోతున్నాము అని అంటున్నారు. మార్కెట్‌కు వెళ్లి కొనుక్కుంటే రూ.4.70 పైసలకు కోడిగుడ్డు సులువుగా దొరికే రోజుల్లో కోడిగుడ్లను మేము ఇవ్వలేకపోతున్నాము అంటే, అక్కడ అవినీతి ఎంతవరకు జరుగుతోందో పెద్దలు అర్థం చేసుకోవాలి. ఈ అవినీతిని అరికట్టవలసిన పరిస్థితి ఎంతైనా ఉంది. ఒక సందర్భంలో మా జిల్లాలోనే డా.వై.ఎస్.రాజశేఖర్ గారి ప్రభుత్వం ఉన్నప్పుడు అందులో దాదాపు 14 మంది ఎం.ఎల్.ఎలు ఉన్నారు. వారిలో ఒకతను ఎం.పి.గా పోటీ చేశారు. ఆ తరువాత మరణించారు. అప్పుడే ఆయన ఐసిడిఎస్‌లో ఉన్నటువంటి పి.డి మీద ఒక కంప్లైంటు పెట్టారు. ఆ పి.డి మీద ఎంక్వైరీ చేయమని ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేస్తే, ఆవిడ అక్కడ ఉన్న ఇద్దరు మంత్రుల్ని పట్టుకొని, బదిలీ అవకుండా చేయించుకున్నారు. అలాగే, నిజామాబాద్‌లో ఉన్నటువంటి శ్రీనివాస్ అనే అధికారిని ఇక్కడకు బదిలీ చేశారు. నిజామాబాద్ నుండి వచ్చిన శ్రీనివాస్ ఇక్కడ జాయిన్ అవకుండా మంత్రులు ఇద్దరు నిలుపుదల చేయడం వల్ల ఆయన గాలిలో ఉన్నారు. అప్పుడున్న కలెక్టరు ఇప్పుడు మన రాష్ట్రంలో ఉన్న మంచి ఆఫీసరు. కానీ, ఏం చేయలేకపోయారు. ఆయన కోర్టుకెళ్లి వచ్చిన తరువాత ఆవిడను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఐసిడిఎస్‌లో పేద ప్రజలకు సంబంధించినటువంటి సామాజికమైన భద్రతలో ఉన్నటువంటి ప్రధానమైన ఈ పథకంలో ఇంత అవినీతి విచ్చిలవిడిగా జరిగేటటువంటి పరిస్థితి ఉంటోంది. అధ్యక్షా, ఇది మన అందరికీ తెలిసిన విషయమే. వారు ఎంత తక్కువ జీతాలు అయినా కూడా ఎం.ఎల్.ఎ ల దగ్గరికి ఉద్యోగాలకు ఎందుకు వస్తున్నారు? ఎంత కరష్టన్లతో వస్తున్నారు. ఈ రకంగా ఉంటే, ఇక సామాజిక భద్రత ఏ విధంగా వస్తుంది? అధ్యక్షా, వీటికి సంబంధించి నేను చాలా సమగ్రంగా వివరించగలను. దీని మీద ప్రభుత్వం తగు చర్యలు తీసుకొంటే ఈ సామాజిక భద్రత ఇంకా కూడా 100 శాతం ముందుకు వెళ్ళడానికి మరింత అవకాశం ఉంటుంది. ఇందుకు సంబంధించి దాదాపు ఒక్కొక్క జిల్లాకి రూ.400 కోట్లు ఖర్చు అవుతుంది. దాదాపుగా ఈ

రూ.400 కోట్లు ఎన్ని సంవత్సరాలు ఖర్చు పెట్టినా, ఇంకా ఇదే విధమైనటువంటి పరిస్థితిని మనం గమనిస్తున్నాము. దీనిలో సమగ్రంగా విచారణ చేయాలి. పింఛన్ల మాదిరిగానే మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ఐసిడిఎస్ పాఠశాలలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక ఐఎస్ఐ మార్కు ఇస్తుంది. ఆ విధమైనటువంటి పాఠశాలలను రూపాంతరం చేసి ఐఎస్ఐ మార్కు ఇస్తున్నటువంటి పరిస్థితి ఉన్నది. మన రాష్ట్రంలోని అధికారులు అక్కడికి వెళ్ళి చూసి వచ్చారు. కానీ, మన రాష్ట్రంలో ఏ విధంగాను కూడా అమలు జరగని మూలంగా 3 సంవత్సరాలు ఇంటి దగ్గర ఉంటున్న పిల్లల పరిస్థితి గానీ, పాఠశాలకు వెళ్లి చదువుతున్న పిల్లల పరిస్థితి గానీ, అలాగే బాలింతలు, గర్భిణీ స్త్రీలు ఈ నలుగురి యొక్క పరిస్థితులలో ఏ మాత్రం ఎదుగుదల లేనటువంటి పరిస్థితి ఉన్నది. అదేవిధంగా, ప్రతిరోజు అదే మోతాదులో అదేవిధంగా ఉండేటటువంటి పరిస్థితి ఉన్నది. అందువలన దీనిని సమగ్రంగా అధ్యయనం చేయాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, చాలా కాలం నుంచి అర్హత ఉన్నవారికి పింకు కార్డులను ఇవ్వడం లేదు. అంటే, ఇది సామాజికమైన ట్రాక్‌లోకి రాకపోయినప్పటికి కూడా తెల్ల రేషన్ కార్డులను అర్హత ఉన్నటువంటి పేద ప్రజలకు మన రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. కానీ, ఈ పింకు కార్డులను ఇవ్వడానికి మాత్రం ఏ మాత్రం అవకాశం ఏర్పడటం లేదు. అర్హత ఉన్న ప్రజలకు ఈ పింకు కార్డులు కూడా త్వరగా వచ్చే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలని తమ ద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

MR. CHAIRMAN: Tomorrow we will continue the discussion on Social Security Schemes and then reply by the Hon'ble Minister. Now, the House is adjourned to meet again tomorrow at 10.00 a.m.

(Then, the House was adjourned at 01.58 p.m.to meet again on Saturday, the 25th March, 2017 at 10.00 a.m.)

* * *